

వేలాయుధా శరణం..

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన వేల్‌కావడి ఉత్సవం సోమవారం ఒంగోలులో వైభవంగా జరిగింది. ఉదయాన్నే స్థానిక శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం వద్దకు భక్తులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. పురుషులు నాలుకపై శూలాలు గుచ్చుకుని, పాలు, పానకం వంటి అభిషేక సామగ్రి నింపిన కావడిని ధరించి ఒంగోలు కొండపై ఉన్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం వరకు వేలాయుధనే శరణం అని నామస్మరణ చేస్తూ చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు చేసిన నృత్యాలు, డప్పు వాయిద్యాలు ఆకట్టుకున్నాయి.

-ఒంగోలు కల్చరల్

కృష్ణమ్మ పరవళ్లు

అన్నదాతల్లో ఆశలు

బేసిన్‌లోని ప్రాజెక్టులకు భారీగా వరద

ఇప్పటికే నిండిన కర్ణాటక రిజర్వాయర్లు

- శ్రీశైలానికి 4.70 లక్షల క్యూసెక్కులు రాక
- మూడు గేట్లు ఎత్తిన డ్యాం అధికారులు
- సాగర్ వైపు పరుగెడుతున్న జలాలు
- జిల్లాలో ఈ సీజన్ సాగు, తాగునీటికి భరోసా

అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. ఈ సీజన్ సాగు, తాగునీటికి భరోసా లభించింది. ఏడాది నుంచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సాగర్ ఆయకట్టు రైతులకైతే కచ్చితంగా మంచి కబురే. కృష్ణా నదికి వరద పోటెత్తుతోంది. ప్రాజెక్టులు జలాలతో కళకళలాడుతున్నాయి. ఎగువ ప్రాంతంలో కర్ణాటక, మహారాష్ట్రలలో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. నదికి ఎగువ ప్రాంతంలోని కర్ణాటక, తెలంగాణలో ఉన్న ప్రాజెక్టులు ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల ఇప్పటికే నిండటంతో శ్రీశైలానికి భారీగా వరద నీరు వస్తోంది. డ్యాం మూడు గేట్లు ఎత్తడంతో అక్కడి నుంచి దిగువన ఉన్న అత్యంత కీలకమైన నాగార్జునసాగర్ ప్రాజెక్టు వైపు ప్రస్తుతం వరద పరుగుపెడుతోంది.

ఒంగోలు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లావాసులకు ఈ ఏడాది నీటికష్టాలు తప్పాయి. ఎట్టకేలకు కృష్ణా నదికి పైనుంచి వరద నీరు పోటెత్తుతోంది. వారం, పది రోజుల క్రితం కృష్ణా బేసిన్‌లోని మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో భారీవర్షాలు కురిశాయి. అప్పటికే ఆ ప్రాంతంలో కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులలో భారీగానే నీరు ఉండటంతో వస్తున్న వరద నీటిని ఒక్కో ప్రాజెక్టు నుంచి దిగువకు వదులుతున్నారు. అలా రాష్ట్రంలోని శ్రీశైలం ప్రాజెక్టుకు ఈనెల 17న స్వల్పంగా నీరు రావడం ప్రారంభమైంది. నాలుగైదు రోజులుగా వరద పెరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా నీటి సామర్థ్యం 215 టీఎంసీలు. వరద నీటి రాకతో గత ఐదు రోజుల్లో దాదాపు 123 టీఎంసీల మేర ప్రాజెక్టులోకి చేరింది. ఇక సోమవారం నాటికి ఇన్‌ఫ్లో మరింత పెరిగింది.


మూడు గేట్లు ఎత్తి..

ప్రాజెక్టులోకి సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు దాదాపు 4.17 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నీటిమట్టం 879.90 అడుగులకు పెరిగింది. దాదాపు 180 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. దీంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమయ్యారు. భారీగా వరద నీరు వస్తున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం ప్రాజెక్టు మూడు గేట్లను ఎత్తి సుమారు 81వేల క్యూసెక్కుల నీరు దిగువకు వదిలారు. ఎగువ నుంచి నీరు రాక పెరిగే కొద్దీ మరికొన్ని గేట్లను ఎత్తే అవకాశం ఉంది.

శ్రీశైలం గేట్లు ఎత్తి 81వేల క్యూసెక్కులను నీరు వదలగా అప్పటికే కుడి, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాల ద్వారా మరో 80వేల క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. అలా ప్రస్తుతం శ్రీశైలం నుంచి సోమవారం సాయంత్రం ఇంచుమించు 1.61లక్షల క్యూసెక్కుల నీరు సాగర్ డ్యామ్ వైపు పరుగు తీస్తోంది.

రేపు ఉదయానికి సాగర్‌కు..

సాగర్ డ్యాం పరిస్థితిని పరిశీలిస్తే 590 అడుగుల పూర్తి నీటిమట్టం, 312 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న డ్యాంలో ప్రస్తుతం నీటిమట్టం 512 అడుగులు, నీటి నిల్వ సుమారు 136 టీఎంసీలు ఉంది. అలాగే 55 వేల క్యూసెక్కులు ప్రస్తుతం డ్యాంలోకి వస్తోంది. శ్రీశైలం నుంచి సోమవారం సాయంత్రం విడుదలైన వరద నీరు బుధ వారం ఉదయా నికి సాగర్ కు చేరే అవకాశం ఉంది.



ప్రస్తుతం కృష్ణా ఎగువ ప్రాంతంలోని కర్ణాటక, తెలంగాణ ప్రాజెక్టుల్లో నీటి నిల్వ, వాటిలోకి వస్తున్న వరద, అక్కడి నుంచి దిగువకు నీటి విడుదల పరిశీలిస్తే శ్రీశైలం ప్రాజెక్టు మంగళవారానికే నిండనుంది. ఆతర్వాత మరింత భారీగా సాగర్ డ్యాంకు శ్రీశైలం నుంచి వరదనీటిని అధికారులు విడుదల చేయనున్నారు.

ఈ సీజన్‌కు భరోసా

రానున్న వారంరోజుల్లో సాగర్‌కు భారీగా వరదనీరు వచ్చి చేరి డ్యాం నిండే పరిస్థితి కనిపిస్తోంది. దాని వల్ల ఈ సీజన్‌లో జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు సాగునీరు, ప్రజలకు తాగునీరు ఎలాంటి ఇబ్బంది లేకుండా అందే అవకాశం ఉంది. గత ఏడాది కృష్ణా బేసిన్‌లో వర్షాలు కురవక, ప్రాజెక్టుల్లోకి నీరు రాక డ్యాంల నుంచి విడుదల జరగలేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో సాగర్ ఆయకట్టులోని 4.42 లక్షల ఎకరాలకు సాగునీరు అందక రైతులు నష్టపోయారు. అంతేకాక తాగునీటికి సైతం నీరు సరిపడా రాక ప్రజానీకం అవస్థలు పడ్డారు. ఇప్పుడు కూడా జిల్లాలో తాగునీటి అవసరాలకు సాగర్ నీరు అరకొరగానే వస్తోంది. అయితే ప్రస్తుతం కృష్ణమ్మ పరవళ్లు జిల్లాలోని ప్రజలకు తాగునీరు, ఆయకట్టుకు ఈ సీజన్ సాగునీరుపై పూర్తిభరోసా కనిపిస్తోంది.



విల్లాల్లో అధికారులు తనిఖీలు చేస్తున్న సమయంలో బయట ఉన్న వారి వాహనాలు

వైసీపీ నేత విల్లాల్లో అన్నీ అక్రమాలే!

- నిర్మాణం విషయంలో వచ్చిన ఆరోపణలపై కదిలిన యంత్రాంగం
- మాజీ మంత్రి బాలినేని వియ్యంకుడి విల్లాల్లో తనిఖీలు
- మూడు శాఖల నేతృత్వంలో రికార్డుల పరిశీలన

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 29 : మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి వియ్యంకుడు కుండా భాస్కర్‌రెడ్డి విల్లాలు వివాదాల్లో చిక్కుకున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఒంగోలు సమీపంలో నిర్మాణాలు చేపట్టిన శ్రీకరి ఎంపైర్ కట్టడాలపై రెండు సంవత్సరాలుగా అనేక ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వ నిధులతో యరజర్ల కొండను తవ్వి ఆ మట్టిని అనుమతుల్లేకుండా అడ్డగోలుగా విల్లాలకు తరలించారన్న ఫిర్యాదులతోపాటు, ఇసుక అక్రమ వినియోగం, అలాగే సమీప గ్రామానికి చెందిన రైతుల భూములను బలవంతంగా రాయించుకున్నారన్న ఆరోపణలు ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ దుమారాన్ని రేపాయి. విల్లాల్లో అంతా అడ్డగోలు వ్యవహారమే నడిచిందంటూ టీడీపీ నేతలు కూడా ధ్వజమెత్తారు. మరోవైపు అక్రమాలు తేల్చాలంటూ ఆర్యవైశ్య నాయకుడు సుబ్బారావుగుప్తా ఇటీవల విల్లాల సమీపంలో నిరసనకు దిగారు. విల్లాలలో అనధికారకంగా ఇసుక ఉందని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు జొన్న వెంకట్ సోమవారం స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో శ్రీకర అంపైర్ విల్లాలలో సోమవారం మైనింగ్, రెవెన్యూ, ఎస్‌ఈబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిర్మాణం కోసం ఉపయోగించిన ఇసుక, మట్టి, ఇతర మెటీరియల్, ప్రారంభం నుంచి ఇప్పటివరకు జరిగిన పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించినట్లు సమాచారం. ఈ సందర్భంగా అక్కడ అధికంగా ఇసుక ఉండటాన్ని గుర్తించినట్లు తెలిసింది. తనిఖీలకు సంబంధించిన అంశాలపై వారిని వివరణ కోరగా జేసీ ఆదేశాల మేరకు తాము పరిశీలనకు వచ్చామని మాత్రమే వెల్లడించారు.

వసూల్ రాజాలు..!

- పోలీసు శాఖలో ఐడీ పార్టీకి డిమాండ్
- అందులో చేర్చుకోవాలని సిఫార్సులు
- చీమకుర్తి స్టేషన్‌లో పంచాయితీ
- అన్నిచోట్లా ఆ టీంలను రద్దు చేస్తూ ఎస్పీ దామోదర్ ఉత్తర్వులు

ఒంగోలు (క్రైం), జూలై 29 : పోలీసు శాఖలో యూనిఫాం వేయకుండా చేసే విధులకు డిమాండ్ ఎక్కువ. అందులో ఐడీ పార్టీ అంటే సిబ్బందికి భలే మోజు. పోలీసు స్టేషన్లలో ఎలాంటి బాధ్యతలు ఉండవు, బందోబస్తులకు అస్సలు వెళ్లరు. స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఎస్సై, సీఐ ఎవరున్నా సరే వారి వెంట నిత్యం కారులో తిరుగుతూ ఉండవచ్చు. అదేసమయంలో ఎస్సైలు, సీఐలు యూనిఫాంలో ఉన్నప్పటికీ ఐడీ పార్టీ కానిస్టేబుళ్లు మాత్రం మఫ్టీలో ప్రత్యక్షమవుతారు. అంతేకాదు స్టేషన్ మొత్తం తమదే అన్నట్లు ప్రవర్తిస్తారు. అక్కడ పెత్తనం చెలాయిస్తుంటారు. మాట వినని సిబ్బందిపై ఎస్సైలకు చెప్పి పనిష్మెంట్ కూడా ఇప్పిస్తుంటారు. మరోకోణం ఏమిటంటే వసూల్ రాజాలు కూడా వారే. స్టేషన్లకు నెల మామూళ్ల నుంచి ఇతర కేసులలో వచ్చే మొత్తాలు కూడా వారి ద్వారానే అధికారులకు చేరుతుందని సమాచారం. ఇలాంటి పనులు చేసేందుకు కొంతమంది పోటీ పడుతుంటారు. వారిపని కేవలం వసూలు చేయడం, అవసరమైన చోట ఖర్చుపెట్టడంతోపాటు మిగిలిన లెక్క అధికారికి అప్పగించడమే. అంతా అమ్యామ్యా వ్యవహారం నేపథ్యంలో వారు ఇచ్చిందే లెక్క కావడంతో కాస్తోకూస్తో వెనుకేసుకునే అవకాశం ఉంటుంది. అందుకోసం ఐడీ పార్టీలోకి వెళ్లేందుకు పెద్దపెద్ద వారి నుంచి సిఫార్సులు చేయించుకుంటారు. ఇందుకు చీమకుర్తి ఘటన నిదర్శనం. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ పురిలో ఉన్న పోలీసు స్టేషన్‌లో ఇలాంటి వసూల్ రాజా పోస్టుకు ఓ కానిస్టేబుల్ ఏకంగా పొరుగు జిల్లాకు చెందిన రాష్ట్రంలో కీలకంగా ఉన్న ప్రజాప్రతినిధి ద్వారా సిఫార్సు చేయించుకోవడం చర్చకు దారితీసింది. దీంతో పోలీసు స్టేషన్‌లో పంచాయితీ జరిగింది. ఈమేరకు సమాచారం తెలుసుకున్న ఎస్పీ ఆగ్రహం వ్యక్తంచేసి జిల్లాలో ఉన్న ఐడీ పార్టీ సిబ్బంది రోజు వారీ విధులకు హాజరు కావాలని ఆదేశాలు జారీచేశారు.





ఐడీ పార్టీలు రద్దు : ఎస్పీ

జిల్లాలో పోలీసు స్టేషన్లలో ఐడీ పార్టీలను రద్దుచేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలు జారీచేశారు. చీమకుర్తి స్టేషన్‌లో జరిగిన పంచాయితీ పోలీస్ శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగే విధంగా ఉంది. ఈ మేరకు సోమవారం ఎస్పీ, పోలీసు అధికారులకు మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. ఐడీ పార్టీలలో ఉన్న వారంతా రోజు వారీ విధులకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో ఈ విషయం జిల్లా పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది.

ఐడీ పార్టీలు అంటే..

గతంలో పోలీసు స్టేషన్లలో ఐడీ పార్టీలు అంటే అత్యంత గోప్యమైన సమాచారాన్ని తెలుసుకుని ఎప్పటికప్పుడు అధికారులకు చేరవేసేవి. ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీలు, నేరస్థులు, అసాంఘిక శక్తుల వివరాలు వారు చేసే కుట్రలు ముందుగా పసిగట్టి శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా వాటిని భగ్నం చేసేవారు. ప్రజలతో మమేకమై క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలు, అంతర్గత కలహాల గురించి సమాచారం సేకరించి అధికారులను అప్రమత్తం చేసేవారు. అయితే అందుకు విరుద్ధంగా ప్రస్తుతం ఐడీ పార్టీలు వసూల్ రాజాలుగా మారారు. బయట సమాచార సేకరణ వదిలేసి నేరుగా ఎస్సై, సీఐలతో వ్యవహారాలు మాత్రమే చేస్తున్నారు. తమకు ఇబ్బంది లేకుండా ఉండటంతో అధికారులు కూడా ఐడీ పార్టీలను ప్రోత్సహిస్తూ లాభపడుతున్నారు.

చీమకుర్తిలో ఏం జరిగిందంటే..?

చీమకుర్తి పోలీసు స్టేషన్‌లో ఐడీ పార్టీ విషయంలో పంచాయితీ జరిగింది. ఆర్మ్‌డ్ రిజర్వుడు నుంచి కన్వర్షన్‌తో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఐడీ పార్టీ కానిస్టేబుల్ కోసం పోటీ పడ్డారు. పొరుగు జిల్లాకు చెందిన కీలక ప్రజాప్రతినిధి సిఫారుసు మేరకు విధులు నిర్వహించేందుకు సిద్ధమయ్యాడు. ఈ విషయం బయటకు పొక్కింది. దీంతో స్థానిక రాజకీయ నాయకులు జోక్యం చేసుకున్నారు. ఇలాంటి సిఫార్సులు వస్తుంటే తామెందుకు ఇక్కడ అంటు స్టేషన్‌లో పంచాయితీ జరిగింది. అయినా వసూళ్ల కోసం కానిస్టేబుల్ ఏమిటి అంటూ స్థానిక నాయకులు ప్రశ్నించారు. ఈ వ్యవహారం మొత్తం పోలీసు బాస్‌కు చేరింది. దీంతో ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.



మంత్రి స్వామికి వైద్య పరీక్షలు

- విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్ల సూచన

ఒంగోలు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామికి సోమవారం నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించారు. జరుగుమల్లి మండలం పాలేటిపాడులో ఆదివారం తిరునాళ్ల సందర్భంగా ఎండ్లబండి వద్ద అభిమానులు మంత్రితో ఫొటోలు దిగారు. ఆ సమయంలో డీజే సౌండ్‌తోపాటు, బాణసంచా మోతలకు ఎద్దు బెదిరి ముందుకు దూకడంతో మంత్రి స్వామి కిందపడి పోయారు. ఆయన్ను ఎద్దు కాలితో తొక్కింది. సెక్యూరిటీ అప్రమత్తతతో స్వామికి త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. ఆ ఘటనలో వీపుపై ఎద్దు తొక్కడంతో అక్కడ ఒత్తిడి పడింది. సోమవారం ఉదయానికి నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో డాక్టర్ స్వామికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రమాదం ఏమీ లేదని తేల్చిన వైద్యులు నాలుగైదు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అయితే మంగళవారం సాంఘిక సంక్షేమం, సచివాలయాల శాఖలపై సీఎం ఉన్నత స్థాయి సమీక్ష చేయనున్నారు. ఈ నేపథ్యంలో వైద్య పరీక్షల అనంతరం మంత్రి స్వామి అమరావతికి బయల్దేరి వెళ్లారు.


నేడు డ్వామా పీడీపై జేసీ విచారణ

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 29: జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ బి.అర్జునరావుపై విచారణకు రంగం సిద్ధమైంది. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు కలెక్టరేట్‌కు రావాలని పీడీకి జేసీ గోపాలకృష్ణ సమాచారం పంపారు. అర్జున్‌రావు వ్యవహారశైలితోపాటు, మండలాల వారీగా మామూళ్ల కోసం వేధింపులకు గురిచేస్తుండటంతో ఇటీవల డ్వామా ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. అదేసమయంలో మర్రిపూడి మండలం రావెళ్లవారిపాలెంకు చెందిన ఫార్మర్ టెక్నికల్ అసిస్టెంట్ జి.శివకుమార్ పంచాయతీరాజ్ కమిషనర్‌కు డ్వామా పీడీపై ఫిర్యాదు చేశారు. జిల్లాలోని డ్వామా ఉద్యోగులంతా ఆందోళన బాట పట్టడంతో జేసీ గోపాలకృష్ణను విచారణాధికారిగా కలెక్టర్ నియమించారు. ఈనేపథ్యంలో మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు కలెక్టరేట్‌లోని తన చాంబర్‌కు విచారణకు హాజరుకావాలని డ్వామా పీడీ అర్జునరావుకు ఆదేశాలు జారీచేశారు.

సచివాలయ సిబ్బంది ద్వారానే పింఛన్లు

- 2,91,419 మంది లబ్ధిదారులు
- పంపిణీకి జిల్లాకు రూ.123.92 కోట్లు

ఒంగోలు నగరం, జూలై 29 : రాష్ట్రప్రభుత్వం ఆగస్టు నెలలో కూడా సచివాలయ సిబ్బంది ద్వారానే పింఛన్లను ఇంటింటికి పంపిణీ చేయనుంది. ఈ మేరకు జిల్లాకు ఆదేశాలు అందాయి. జిల్లాలో సామాజిక పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల సంఖ్య మొత్తం 2,91,419 ఉండగా వీరికి పంపిణీ చేసేందుకు రూ.123.92 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. గత వైసీపీ పాలనలో ఈ సొమ్మును వలంటీర్ల ద్వారా పంపిణీ చేయించగా కొత్త గా ఏర్పడిన కూటమి ప్రభుత్వం సచివాలయ సిబ్బందినే ఇంటికి పంపించి అందజేస్తోంది. ఇంతేకాకుండా పింఛన్ సొమ్మును భారీగా పెంచింది. జిల్లాలో మొత్తం 5,723 మంది సచివాలయ సిబ్బంది ఉండగా పింఛన్లు అందజేసేందుకు వీరు సరిపోకపోవడంతో ప్రభుత్వం ఇతర శాఖల ఉద్యోగులను కూడా కేటాయించింది. వీరంతా ఆగస్టు ఒకటో తేదీనే ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ సొమ్మును అందజేస్తారని డీఆర్‌డీఏ, వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ వసుంధర తెలిపారు. తొలిరోజే 99శాతం మందికి పంపిణీ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆమె చెప్పారు.





కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 29 : నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులను కొందరిని తొలగించారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ తరఫున చేపట్టిన ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ కోవిడ్ విధుల్లోకి తీసుకున్న కార్మికులకు కనీస వేతనం రూ. 15వేలు అమలు చేయాలని కోరారు. కొందరిని చేరిన రెండు నెలలకే తొలగించడం అన్యాయమని, కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు స్వామ్రాజ్యం, ఆర్. రాములు, కే. వెంకటేశ్వర్లు, వంశీ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వివిధ కార్మికసంఘాల నేతలు

వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించని కేంద్రం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 29 : కేంద్రబడ్జెట్‌లో వ్యవసాయానికి, రైతాంగానికి, వ్యవసాయ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు ధ్వజమెత్తారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో అయన మాట్లాడారు. అంతకు ముందు కలెక్టరేట్ వద్ద కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రంగారావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో తొమ్మిది అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.రైతుల శ్రమ కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడమే లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని విమర్శించారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, బి. సుబ్బారావులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, జి. శ్రీనివాసులు, కొత్తకోట వెంకటేశ్వర్లు, వి. బాలకోటయ్య, వేజండ్ల శివరాం, ఆవుల సుబ్రహ్మణ్యం, పద్మ, పి. సుబ్బారావు, పాటిబండ్ల సిద్ధయ్య, కాట్రగడ్డ వెంకటకృష్ణ, మండవ శ్రీనివాసరావు, అయ్యప్పరెడ్డి, పెంట్యాల హనుమంతరావు, పల్లా హనుమంతరావు, జి. రమేష్ తదితరులు ఉన్నారు.



టంగుటూరులో కొనసాగుతున్న పొగాకు వేలం

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.359

టంగుటూరు, జూలై 29 : టంగుటూరు వేలం కేంద్రంలో పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.359 పలికింది. శనివారం నుంచి అదనంగా పండించిన పంట కొనుగోళ్లు జరుగుతున్నాయి. సోమవారం తూర్పునాయుడుపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాల రైతులకు చెందిన 971 పొగాకు బేళ్లను వేలానికి అనుమతించారు. అందులో 861 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించారు. కనిష్ఠ ధర రూ.205 లభించింది. సరాసరి ధర కిలో రూ.296.43గా ఉంది.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు : మండలంలోని పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం అమ్మకాలకు చీమకుర్తి క్లస్టర్ నుంచి 1,055 పొగాకు బేళ్లు రాగా 913 బేళ్లు అమ్ముడయ్యాయి. 142 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయని ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. గరిష్ఠ ధర కేజీ రూ.359లు పలకగా, కనిష్ఠ ధర రూ.205లు పలికింది. సరాసరి ధర రూ.312.17 వచ్చినట్లు తెలిపారు. కొనుగోలులో 25 కంపెనీల ప్రతినిధులు, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

పేదలకు ఆకలి తీర్చడం అభినందనీయం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 29 : జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా పేదల ఆకలి తీర్చడం అభినందనీయమని గోల్డ్‌మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, తెలుగు దేశం పార్టీ నాయకుడు తాతా ప్రసాద్ అన్నారు. స్థానిక డొక్కా సీతమ్మక్యాంటీన్ వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. డొక్కా సీతమ్మ పేరుతో నిరంతరం అన్నదాన కార్యక్రమం చేపడుతున్న జనసేన పార్టీ నేత జడ బాలనాగేంద్రయాదవ్‌ను అభినందించారు. ఇదే స్ఫూర్తితో పేదల ఆకలి తీర్చేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. జనసేన పార్టీ నాయకుడు జడ బాలనాగేంద్ర మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ప్రతిరోజు చేపడుతున్నామన్నారు. కాగా అన్నదాన కార్యక్రమానికి రవిప్రియామాల్ అధినేత కంది రవిశంకర్ రూ. 25వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాదర్తి సురేష్, గొల్ల కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

నివాసాల మధ్య పెట్రోలు బంకు ఏర్పాటును నిలిపివేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 29 : మద్దిపాడు మండలం దొడ్డవరంలో హైస్కూలు, నివాసాల మధ్య ఏర్పాటు చేస్తున్న పెట్రోలు బంకును నిలిపివేయాలని ఆ గ్రామస్థులు కోరారు. సోమవారం డీఎస్‌వోను కలిసి ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో 60 ఏళ్లనుంచి హైస్కూలు ఉందని, అక్కడ సమీపంలోనే నివాసాలు ఉన్నాయని తెలిపారు. అక్కడ ఏమి లేనట్లుగా ఎన్‌వోసీ కోసం తప్పుడు నివేదికలు ఇచ్చారని, అందువల్ల ఆ నివేదికను నిలుపుదల చేయాలని కోరారు. ప్రస్తుతం పెట్రోలు బంకు పెట్టాలనే స్థలం సమీపంలోనే పీఏసీఎస్ ఆఫీసు కూడా ఉందన్నారు. వాటన్నింటిని పరిగణనలోకి తీసుకొని పెట్రోలు బంకు ఏర్పాటుకు ఇచ్చే అనుమతులు రద్దు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎం. వెంకటేశ్వర్లు, కే వెంకయ్య, బి. అంకారావు తదితరులు ఉన్నారు.

1 నుంచి గ్రానైట్ ఫ్యాక్టరీల సమ్మె

ఓనర్ల అసోసియేషన్ ఏకగ్రీవ తీర్మానం

70కి పైగా మూతపడే అవకాశం

మిగతా రకాల శ్లాబు ఓనర్లూ ఇదే దారిన..

రోడ్డుపడనున్న వెయ్యి మంది కార్మికులు

చీమకుర్తి, జూలై 29: జిల్లాలోని 3 సీఎం మందం గల శ్లాబులను ఉత్పత్తి చేసే గ్రానైట్ పాలిషింగ్ ఫ్యాక్టరీలు వచ్చేనెల ఒకటి నుంచి మూతపడనున్నాయి. మర్రిచెట్లపాలెం ఫ్యాక్టరీలో సోమవారం జరిగిన ఓనర్ల అసోసియేషన్ సమావేశంలో సమ్మెలోకి వెళ్లాలని ఓనర్లు ఏకగ్రీవంగా తీర్మానించారు. బూదవాడ, మర్రిచెట్లపాలెం, కంభంపాడు, ఒంగోలు, గుండ్లాపల్లికి చెందిన 3సీఎం శ్లాబులను ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీ ఓనర్లు ఈ సమావేశంలో పాల్గొని నిర్ణయం తీసుకున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న దాదాపు 70కిపైగా ఫ్యాక్టరీలు మూతపడనున్నాయి. మరోవైపు మిగతా రకాల శ్లాబులను ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీ ఓనర్లు సైతం సమావేశమై మూతవేసే దిశగా నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు. ఇటీవల కాలంలో 3సీఎం శ్లాబుల రేటు భారీగా పడిపోయింది. బయ్యర్లు సిండికేట్ అయి ధరలను తగ్గించారు. గతంలో ఒక చదరపు అడుగు 3సీఎం శ్లాబు రేటు రూ.120కి బయ్యర్లు కొనుగోలు చేసేవారు.అనంతరం వీటిని నైజీరియా, ఇస్తాంబుల్, టర్కీ తదితర దేశాలకు ఎగుమతి చేసి లాభాలు గడిస్తారు. కాగా ప్రస్తుతం శ్లాబురేటు ఏకంగా సగానికి సగం పడిపోయి రూ.60కి కొనుగోలు చేస్తున్నారు. అదీ మూడునెలల తర్వాతనే పేమెంట్ చేస్తారు. తక్షణమే డబ్బులు ఇవ్వాలంటే రూ.56 పలుకుతుంది.ఒక చదరపు అడుగు ఉత్పత్తి ఖర్చు అన్ని రకాలుగా కలుపుకొని దాదాపు రూ.70పైనే ఖర్చు అవుతోంది.అంటే ఇపుడు బయ్యర్లు ఇవ్వచూపుతున్న ధర ఉత్పత్తి ఖర్చు కూడా రావటంలేదు. ఈ పరిస్థితుల్లో కరెంట్ బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో ఫ్యాక్టరీలు మూసివేయటమే నయం అని భావించిన ఓనర్లు ఆగస్టు 1 నుంచి సమ్మె చేయటానికి సిద్ధం అయ్యారు. ఫ్యాక్టరీలు మూతపడితే దాదాపు వెయ్యి మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుంది. బయ్యర్ల వైఖరిలో మార్పు వస్తే తప్ప పరిష్కార మార్గం కనపడటంలేదు. బయ్యర్ల ఆలోచన ఎలా ఉంటుందో వేచి చూడాల్సి ఉంది.



బూదవాడ వద్ద ఫ్యాక్టరీలో పేరుకుపోయిన 3సెంఎం శ్లాబులు

సమస్యలను స్థానికంగా పరిష్కరించాలి

జేసీ గోపాలకృష్ణ ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 29 : స్థానికంగా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం మీకోసం కార్యక్రమం జరిగింది. ముందుగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలురకాల సమస్యలను విన్నవించారు. ఆయా సమస్యలపై జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

ఈ అర్జీలను సకాలంలో సహేతుకంగా పరిష్కరించాలని జేసీ ఆదేశించారు. మురుగు కాలువలలో పూడికతీత, పగిలిపోయిన విద్యుత్ స్తంభాలను సరిచేయడం వంటి చిన్న చిన్న సమస్యలను కూడా ప్రజలు కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించాలని, సంబంధిత శాఖల అధికారులు వీటి పరిష్కార తీరును పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. ప్రజలను తరుచూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం మంచిదికాదని జేసీ హితవు పలికారు. కాగా సోమవారం మీ కోసం కార్యక్రమంలో 253 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, మాధురి, వరకుమార్‌తో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.



మీ కోసంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ప్రజాసమస్యల ఫిర్యాదుల వేదికకు 81 వినతులు

ఒంగోలు(క్రైం),జూలై 29: ఎస్పీ కార్యాలయంలో గెలాక్సీ భవన్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల ఫిర్యాదుల వేదికలో 81 వినతులు అందాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదిదారుల సమస్యలను ఎస్పీ ఏఆర్. దామోదర్ ఆదేశాల మేరకు పోలీసు అధికార్లు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కె.నాగేశ్వరరావు , ఎస్‌వి.శ్రీధరరావు, ఒంగోలు డీఎస్పీ కిషోర్ బాబు, తాలుకా సీఐ ఖాజావలి, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదిదారుల సమస్యలు వింటున్న ఏఎస్పీ

ముగిసిన శిక్షా సప్తాహ్ వారోత్సవాలు

పలు పాఠశాలల్లో భోజనాలు

ఒంగోలు(విద్య), జూలై 29 : పాఠశాలల్లో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ వారోత్సవాల కార్యక్రమం ముగింపు సందర్భంగా పలు పాఠశాలల్లో దాతలు విద్యార్థులు, ఉపాధ్యాయులకు సోమవారం భోజనాలు ఏర్పాటుచేశారు. స్థానిక బండ్లమిట్టలోని ప్రభుత్వబాలికోన్నత పాఠశాలలో బండారు మదన్ విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి దాతలు, ప్రజల సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జి. కృష్ణకుమారి, సింగరాజు రాంబాబు, బండారు సుబ్బారావు, కొఠారి నాగేశ్వరరావు, ఊసా మధు, వి. వెంకటేశ్వరరెడ్డి, గుంటూరు రాంబాబు, వెంకటరత్నం తదితరులు ఉన్నారు. అదే విధంగా కరవది జడ్పీ హైస్కూలులో శుభతిధి భోజన కార్యక్రమంలో భాగంగా పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ కుమారుడు ఎం. వేణుమాధవ్ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కరవది గ్రామపెద్దలు పోలవరపు వెంకట్రామయ్య, ఎస్. లక్ష్మీకుమారి, దొడ్డా చంద్రశేఖర్‌లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.



కొండపిలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న రామయ్య చౌదరి, ఉపాధ్యాయులు

పౌష్టికాహారంతో ఆరోగ్యం

కొండపి : పౌష్టికాహారంతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి అన్నారు. కమ్యూనిటీ పార్టిసిపేషన్ డే లో భాగంగా ఆయన సోమవారం వెన్నూరులోని జడ్పీస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అందిపుచ్చుకుని విద్యార్థులు అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం డి.భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముప్పవరంలో...

ముప్పవరం జడ్పీ స్కూల్, ఎంపీ స్కూల్‌లో శుభ్‌దిన్ భోజన్ కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ బత్తుల నారాయణస్వామి నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు భోజనం, స్వీట్లు, హాట్‌ను సర్పంచ్ అందజేశారు.

పేర్నమిట్ట హైస్కూల్లో

సంతనూతలపాడు: మండలపరిధిలోని పేర్నమిట్ట జడ్పీహైస్కూల్లో సోమవారం శిక్షాసప్తాహ్ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఉపసర్పంచ్, టీడీపీ నాయకుడు కరిచేటి శ్రీను విద్యార్థులకు భోజనాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అన్ని వేళల అండగా ఉంటామన్నారు. అనంతరం హైస్కూల్లో నిలిచిపోయిన మధ్యాహ్నభోజన పథకం గది నిర్మాణాన్ని పరిశీలించారు.కార్యక్రమంలో హెచ్‌ఎం వి.పార్వతి శాంతి, నాయకులు వి.వెంకటేశ్వరరెడ్డి, టి.వెంకటేశ్వర్లు, టి.చంద్రశేఖర్, ఎం.చిరంజీవి. మల్లికార్జున, రామయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు : ప్రభుత్వ పాఠశాలల్లో వారం రోజుల పాటు నిర్వహించిన శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు ముగిశాయి. చివరి రోజు సోమవారం బినిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ అబ్దుల్ కరీం మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. అనంతరం శుభ తిధి కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన మారెళ్ళ విజయ లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారి కుమారుడు మారెళ్ళ శ్రీనివాసరావు సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇసుక శ్రీనివాసులు రెడ్డి, భీమవరపు శ్రీనివాసరావు, లక్కెనబోయిన విజయ్ కుమార్, గోపి, అవినాష్, వంశీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పేర్నమిట్టలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న టీడీపీ నాయకులు

ఈనాం భూమికి ప్రైవేటు వ్యక్తుల ఫెన్సింగ్

రెవెన్యూ అధికారులకు కనుమళ్ల ప్రజల ఫిర్యాదు



సర్వే నెం. 323 ఫెన్సింగ్ వేసిన ఈనాం భూమి

సింగరాయకొండ, జూలై 29 : మండలంలోని కనుమళ్ల చెరువు సమీపంలో కందుకూరు వెళ్లే రోడ్డు పక్కన సర్వే నెం.323లో 50 సెంట్ల భూమిని రెండు రోజుల క్రితం కందుకూరు మండలం పోకూరుకు చెందిన వ్యక్తులు చదును చేయించారు. చుట్టూ ఫెన్సింగ్ వేశారు. అయితే శ్మశాన వాటిక, పంట చెరువు, డంపింగ్ యార్డుకు వెళ్లే దారిని ఆక్రమించారని కనుమళ్ల గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమికి నకిలీ పట్టాలు సృష్టించి అమ్ముకున్నారని ఆరోపించారు. దీనిపై సోమవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు విచారణ చేపట్టారు. ఫెన్సింగ్ వేసిన భూమిని పరిశీలించారు. అక్కడ కొలతలు వేశారు. సర్వే నెంబర్ 323లో 11.76 సెంట్ల భూమి దేవదాయశాఖకు చెందినదిగా గుర్తించారు. ఆర్ఐ ప్రవీణ్, ఇరిగేషన్ ఏఈ హరిబాబు, సర్వేయర్ బ్రహ్మం, వీఆర్వో విజయ పాల్గొన్నారు. దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్ తన్నీరు వెంకటేశ్వర్లును వివరణ కోరగా ఫెన్సింగ్ వేసిన భూమి కందుకూరు మండలం పోకూరుకు చెందిన రావి వెంకయ్య అనుభవంలో ఉన్నదని తెలిపారు. ఆయన 2011లో 40 సెంట్లు కొనుగోలు చేసినట్లు పత్రాలు చూపుతున్నారన్నారు. రికార్డుల్లో ఈనాం భూమిగా ఉందని వివరించారు. దీనిపై లోతుగా విచారణ చేపడుతున్నట్లు వెల్లడించారు.



భూమికి వేసిన ఫెన్సింగ్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ , అధికారులు

అవీ..ఇవీ..

ఒలింపిక్స్‌లో మెరుగైన ప్రతిభచూపాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 29 : పారిస్ వేదికగా జరుగుతున్న ఒలింపిక్స్‌లో రాష్ట్రం నుంచి పాల్గొంటున్న క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనపర్చాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. అందుకు సంబంధించి సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ క్రీడలలో భారత్ తరుపున ప్రాతినిధ్యం వహించే అవకాశం పొందిన రాష్ట్ర క్రీడాకారులు పీవీ సింధు, ఆర్ సాత్విక్ సాయిరాజు, వై.జ్యోతి, డి.జ్యోతిక, బి.ధీరజ్‌లకు అభినందనలు తెలిపారు. ప్రజలందరూ మన క్రీడాకారులకు అభినందనలు తెలుపుతూ అండగా నిలవాలని జేసీ కోరారు. ఈ కార్యక్రమంలో క్రీడల అభివృద్ధి అధికారి రాజరాజేశ్వరి, ఇతర అధికారులు ఉన్నారు.



సెల్ఫీపాయింట్‌లో జేసీ

పోలీసుల అదుపులో గంజాయి ముఠా?

సింగరాయకొండ, జూలై 29 : గంజాయి తరలిస్తున్న ఓ ముఠాను సింగరాయకొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. శనివారం జాతీయ రహదారిపై బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులను పోలీసులు ఆపగా వారు తప్పించుకునేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. దీంతో వారిని పట్టుకొని బ్యాగ్‌ను పరిశీలించగా అందులో గంజాయి ఉన్నట్లు తెలిసింది. ఆ ముగ్గురినీ అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. విచారణలో వారు ఇచ్చిన సమాచారం మేరకు మరో ముగ్గురిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

పశుగ్రాస విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



పశుగ్రాస విత్తనాలతో రైతులు

నాగులుప్పలపాడు, జూలై 29 : పాడి రైతులు పశుగ్రాస విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని జేడీఏ బేబి రాణి సూచించారు. నాగులుప్పలపాడు పశువైద్యశాలలో సోమవారం పాడి రైతులకు ఉచితంగా సీఎస్‌హెచ్.24 ఎంఎఫ్ పశుగ్రాస విత్తనాలను అందించి ఆమె మాట్లాడారు. పశుపోషకులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఎన్ నాగభూషనరావు, పశువైద్యులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్యం అందించాలి

ఒంగోలు(విద్య) జూలై 29 : జిల్లాలోని అన్ని ఆటల్ టింకరింగ్ ల్యాబ్స్ పూర్తిస్థాయిలో పనిచేయాలని, తద్వారా విద్యార్థులకు 21వ శతాబ్దం నైపుణ్యం అందించాలని సమగ్ర శిక్ష జిల్లా అకడమిక్ మానటరింగ్ అధికారి ఎం. రమేష్ కోరారు. సోమవారం స్థానిక సమగ్ర శిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో ఆటల్ టింకరింగ్ ల్యాబ్స్ హెడ్మాస్టర్లు, ఇన్‌చార్జి టీచర్లకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో రోబోటిక్స్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, టింకరింగ్ వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి టి. రమేష్ మాట్లాడగా హబ్ ఆటల్ ఇన్‌చార్జి ఎం. రమేష్, రాకేష్, రిసోర్సు పర్సన్లుగా వ్యవహరించారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

నాగులుప్పలపాడు, జూలై 29 : ఉప్పుగుండూరు పంచాయతీ కార్యదర్శిపై అట్రాసిటీ కేసు నమోదైన నేపథ్యంలో సోమవారం డీఎస్పీ విచారణ చేపట్టారు. కార్యదర్శి హరిబాబు విధినిర్వహణలో అలసత్వాన్నిప్రశ్నించిన తనపై 14వ వార్డు మెంబరు కనగాల శ్రీనివాసరావుతో కలిసి అసభ్యకరంగా మాట్లాడి కులం పేరుతో దూషించారని సర్పంచ్ దేవరకొండ జయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారిద్దరిపై నాగులుప్పలపాడు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సోమవారం డీఎస్పీ కిషోర్‌బాబు ఉప్పుగుండూరు పంచాయతీ కార్యాలయంలో ఇందుకు సంబంధించి విచారణ చేపట్టారు.

మట్టి అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లు సీజ్

సింగరాయకొండ, జూలై 29 : మండలంలోని కనుమళ్ల పంచాయతీ పరిధిలో ఉన్న భూముల నుంచి గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను సోమవారం మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. వాటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ టీఏ తిరుపతిరావు, సిబ్బంది హరిబాబు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో ఉన్న గ్రావెల్ టిప్పర్లు

నూతన కమిటీ ఎన్నిక

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 29 : యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ కమిటీని ఎన్నుకున్నారు జిల్లా అధ్యక్షునిగా వై. సురేష్, , జిల్లా ప్రధాన కార్యదర్శిగా కే శ్రీధర్‌బాబు, కోశాధికారిగా జి. నాగేశ్వరరావు, జిల్లాకమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కే అప్పలరాజు, గౌరవాధ్యక్షులుగా కాలం సుబ్బారావును ఎన్నుకున్నారు.

బాలికల గురుకుల పాఠశాలలో వైద్య పరీక్షలు



ఆరోగ్యపరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి ప్రసాద్‌బాబు

టంగుటూరు, జూలై 29 : టంగుటూరులోని బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి ఆరోగ్య పరిరక్షణపై మండల వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్‌బాబు అవగాహన కల్పించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎక్కడా నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జాతీయ ఆహార భద్రతపై మాగుంట ప్రశ్న

ఒంగోలు(కలెక్టరేట్),జూలై 29 : దేశంలో జాతీయ ఆహారభద్రత చట్టం ప్రజాపంపిణీ పథకానికి సంబంధించి ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ శాఖ సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్ సమాధానం ఇస్తూ దేశంలో 75శాతం వరకు గ్రామీణ జనాభాకు, 50శాతం వరకు పట్టణ జనాభాకు అధిక సబ్సిడీపై ఆహార ధాన్యాల సరఫరాను జాతీయ ఆహార భద్రత చట్టం ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు రాష్ట్రాలకు సలహాలు ఇచ్చామన్నారు. లబ్ధిదారుల గుర్తింపుపై ఏదైనా పునఃపరిశీలన చేయడమనేది తదుపరి జనాభా లెక్కల ప్రకటనపై ఆధారపడి ఉంటుందని మాగుంట ప్రశ్నకు కేంద్రమంత్రి వివరణ ఇచ్చారు.

స్కేటింగ్ పోటీలో విజయకేతనం

ఒంగోలు(విద్య), జూలై 29 : గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలలో స్థానిక హైదరాబాద్ పబ్లిక్ స్కూలు విద్యార్థి విజయకేతనం ఎగురవేశారు. ఈ పోటీల్లో ఆరు నుంచి ఎనిమిది సంవత్సరాల వయస్సు గల పిల్లలకు పోటీలు నిర్వహించగా హైదరాబాద్ పబ్లిక్ స్కూలు విద్యార్థి రేయాన్స్ బ్రాంజ్‌మెడల్ సాధించారు. తక్కువ సమయంలో శిక్షణ తీసుకొని మెడల్ సాధించిన విద్యార్థిని స్కూలు యాజమాన్యం, తల్లిదండ్రులు అభినందించారు.

లిక్కర్ పరవళ్లు

- ఆగని సారా, గంజాయి వినియోగం
- జగన్ బ్రాండ్లను ఆపాలని మద్యం ప్రియుల డిమాండ్
- రెస్టారెంట్, బార్‌లలో అధిక ధరలకు విక్రయాలు
- పట్టించుకోని అధికారులు

చీరాల, జూలై 29 : ఎన్‌డీపీ (నాన్ డ్యూటీ పెయిడ్) లిక్కర్ చీరాల నియోజకవర్గంలో, ప్రధానంగా తీరప్రాంతంలో పరవళ్లు తొక్కుతోంది. నాటుసారా, గంజాయి వినియోగం కొనసాగుతూనే ఉన్నాయి. రెస్టారెంట్ అండ్ బార్లలో నిబంధనలకు విరుద్ధంగా మద్యంను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. లూజ్ సేల్స్‌లో చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వీటిపై చర్యలు చేపట్టాల్సిన సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఒక వైపు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోం మినిస్టర్ వంగలపూడి అనితలు నార్కోటిక్స్ వినియోగంతో వైసీపీ పాలనలో నెలకొన్న పరిణామాలపై పూర్తి స్థాయిలో ఉక్కుపాదం మోపేందుకు కసరత్తు చేస్తున్నారు. నిర్దిష్టంగా సంబంధిత అధికారులకు కూడా ఆదేశాలకు జారీ చేసిన విషయం తెలిసిందే. క్షేత్ర స్థాయిలో మార్పు రాకుండా సత్ఫలితాలు రావని పలువురు అంటున్నారు.

ఆగని ఎన్‌డీపీ లిక్కర్ దిగుమతి

ఎన్‌డీపీ లిక్కర్ దిగుమతి జరుగుతూనే ఉంది. గతంలో గోవా, కర్నాటక, తెలంగాణ నుంచి దిగుమతయ్యే ఎన్‌డీపీ లిక్కర్‌పై పోలీస్ ఉన్నతాధికారులకు అందిన సమాచారంతో పోలీస్, ఎస్ఈబీ, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన దాడులలో భారీగా పొరుగు మద్యం ఒకటికి పలుమార్లు పట్టుబడింది. అయితే ఆ తరువాత అధికారుల మధ్య సమన్వయం లోపించింది. అందుకు పలు రకాల కారణాలనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ క్రమంలో ఎన్‌డీపీ దిగుమతులపై పెద్దగా దృష్టి కేంద్రీకరించటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జగన్ బ్రాండ్లు ఆపండి

వైసీపీ హయాంలో జగన్ బ్రాండ్లుగా పేరుపడ్డ నాసికరం మద్యంను వెంటనే ఆపాలని మద్యపాన ప్రియులు ముక్తకంఠంతో కోరుతున్నారు. కూటమి ప్రభుత్వ గెలుపులో తమ భాగస్వామ్యం కూడా గణనీయంగా ఉందని, అయితే ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా జగన్ బ్రాండ్లను తాగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర ఎక్కువ, నాణ్యత సున్నా, దీంతో తాము నాటుసారా వినియోగానికి మరలామని కొందరు చెప్తున్నారు. వెంటనే నాణ్యమైన మద్యం సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.

సిండికేట్‌గా మారిన బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు

మద్యం అధిక ధరలకు విక్రయాలు

బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహకులు సిండికేట్‌గా మారారు. సాధారణంగా వైన్ షాపుల కన్నా నిబంధనల మేరకు మద్యంను అధిక ధరలకు విక్రయించుకునే వెసులుబాటు ఉంది. అయితే సిండికేట్‌గా మారి నిబంధనలను



పట్టుబడ్డ అక్రమ మద్యం, నిందితుడితో అధికారులు (ఫైల్)

తుంగలో తొక్కుతూ ఇష్టారీతిన అదనపు ధరలు వసూలు చేస్తున్నారు. దీంతో తమకు తీరని అన్యాయం జరుగుతోందని మద్యం సేవించేవారు వాపోతున్నారు.

గంజాయి వినియోగంతో లోపిస్తున్న విచక్షణ..!

గతంలో గంజాయి అంటే ఎక్కడో ఒకరు, అర సాధువులు లాంటి వారు సేవించేవారు. అది పరిమితుల్లో కన్పించేవారు. అయితే ప్రస్తుతం గంజాయి వినియోగం వైపు కొందరు యువకులు ఆకర్షితులవుతున్నారు. మొదట ఫ్యాషన్ అని తరువాత మానలేకపోతున్నామనే స్థితికి చేరుతున్నారు. విచక్షణ కోల్పోతున్నారు. ఇది ప్రమాదకర పరిణామం. దీన్ని నియంత్రించడం అనేది కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదు. విద్యా సంస్థలు, తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. తీరప్రాంతంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు గంజాయి సేవించి మోటారు సైకిల్ పందేలు పేరుతో ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. ఆ సమయంలో అటుగా రాకపోకలు సాగించే వాహన చోదకులు కూడా ప్రమాదంలోకి వెళ్లే పరిస్థితి. ఈ నేపథ్యంలో తగిన చర్యలతో ప్రభుత్వ ప్రతిష్టను ఇనుమడింపజేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.



కార్పొరేషన్ మేనేజర్ శ్రీహరికి వినతి పత్రం అందజేస్తున్న అడ్వకేట్ కాట్రగడ్డ శ్రీనివాసరావు

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 29 : నగరంలో వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని అడ్వకేట్ కాట్రగడ్డ శ్రీనివాసరావు కార్పొరేషన్ మేనేజర్ శ్రీహరికి వినతి పత్రం అందజేశారు. నగరంలోని 50 డివిజన్‌ల పరిధిలో సుమారు 20 వేల వరకు వీధి కుక్కలు ఉన్నాయని తెలిపారు. వాటి నియంత్రణ కోసం స్టెరిలైజేషన్ కార్యక్రమం సక్రమంగా చేపట్టాలని కోరారు. గతంలో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు మొక్కుబడిగా జరిగాయని తెలిపారు. ఆ కారణంగా కుక్కల సంతతి మరింత పెరిగిపోయిందన్నారు. వీధి కుక్కల ద్వార ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అందులో పేర్కొన్నారు.

నుచ్చుపొద చేపల లీజును రద్దు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 29 : పొమూరు మండలంలోని నుచ్చుపొద ప్రాజెక్టు లీజు కాలం ముగిసినందున ఆ లీజును రద్దుచేసి చేపలు పట్టకుండా చర్యలు తీసుకోవాలని యానాదిహక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పి.లక్ష్మయ్య డిమాండ్ చేశారు. యానాది హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. జిల్లా మత్స్యశాఖ ద్వారా ఈ ఏడాది మార్చి 13న నైపుణ్యత టెస్టును నిర్వహించారన్నారు. వాటిలో అర్హులైన సభ్యులను ప్రకటించాలని కోరారు. ఆ లీజు కాలం జూన్ 30తో ముగిసినందున గత లీజుదారులు చేపలు పట్టకుండా ఆపేయాలని డిమాండ్ చేశారు. ఎంపికైన సభ్యులకు నుచ్చుపొద చెరువులో లైసెన్సులు ఇప్పించి ఆదుకోవాలన్నారు. నైపుణ్యత పరీక్షల్లో అర్హులైన సభ్యులకు షేర్ ధనం కట్టించి ఆ చెరువులో చేపలు పట్టుకొనే అనుమతి ఇప్పించి ఆదుకోవాలని ఆయన కోరారు. అంతకు ముందు ఒంగోలు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమలో చేవూరి కోటయ్య, చేవూరి భాస్కర్, యల్లయ్య, బి.రమేష్, రామాంజనేయులు, ఎం. హరికృష్ణ, సూర్యనారాయణ, జే వెంకట్రావు తదితరులు ఉన్నారు.

టిప్పరు ఢీకొని వృద్ధుడి మృతి



మృతిచెందిన వెంకటేశ్వర్లు

పొదిలి, జూలై 29 : టిప్పరు ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన సోమవారం కంభాలపాడు పంచాయతీ పరిధిలోని పోతవరం వద్ద చోటుచేసు కొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంభాలపాడు గ్రామానికి చెందిన తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు (72) తన ద్విచక్రవాహనంపై గ్రామం నుంచి పొదిలి వస్తున్నాడు. గిద్దలూరు వైపు నుండి పొదిలి వైపుకు వస్తున్న టిప్పరు ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి కొట్టింది. దీంతో వెంకటేశ్వర్లు అక్కడిక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వర్లుకు భార్య ఆదెమ్మ, నలుగురు కుమారులు ఉన్నారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

- వాట్సాప్‌లో కలెక్టరుకు గుర్రపుసాల గ్రామస్థుల వినతి



అరకొరగా వస్తున్న నీటిని పట్టుకుంటున్న మహిళలు

ఎర్రగొండపాలెం, జూలై29: మండలంలోని గుర్రపుసాల గ్రామంలోని తాగునీటి బోరులో నీళ్లు రావడం లేదు. దీంతో 200 కుటుంబాలకు నీరు అందడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. తమ బాధను వాట్సాప్ గ్రూపులో జిల్లా కలెక్టరుకు సోమవారం వినతి పంపించారు. ఎస్సీకాలనీలోని ఒక తాగునీటి బోరులో నెల రోజులు గా భూగర్భజలాలు అడుగంటాయని వారు పేర్కొన్నారు. బిందెడు నీటి కోసం గంటలు తరబడి నిరీక్షిస్తున్నామని కాలనీ మహిళలు వాపోతున్నారు. ఎన్నికల వరకు ట్యాంకర్లతో నీటి సరఫరా చేశారని ఎన్నికల అనంతరం జూన్ 6వ తేదీ నుంచి ట్యాంకర్లు నిలిపివేశారన్నారు. గ్రామ సర్పంచికి ట్యాంకర్లు ఏర్పాటు చేయించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసిన తమ మొర ఆలకించలదేన్నారు. సర్పంచి గ్రామంలో నివాసం లేకపోవడంతో తమ సమస్యను ఆలకించేవారు కరువయ్యారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకర్లు ఏర్పాటు చేయించాలని గ్రామీణ నీటి సరఫరా అసిస్టెంటు ఇంజనీరుకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ట్యాంకర్లు ఏర్పాటు చేయలేదన్నారు. జిల్లా కలెక్టరు తమ విజ్ఞప్తి పరిశీలించి తాగునీటి సరఫరాకు ట్యాంకర్లు ఏర్పాటు చేయించాలని కాలనీ మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మధ్యాహ్న భోజన అమలు పరిశీలన

ఒంగోలు నగరం, జూలై 29: రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి సోమవారం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ముందుగా ఆమె స్థానిక నెల్లూరు బస్టాండ్ సెంటర్‌లోని డీఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూలు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్ధేశించిన మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా అనే దిశగా పరిశీలన జరిపారు. బాలల విషయంలో అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు మండల విద్యాశాఖాధికారి సరస్వతి, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఉదయభాస్కర్, ప్రధానోపాధ్యాయులు వెంకటరావు పాల్గొన్నారు. అనంతరం ఆ మె నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కబాడీపాలెం, ఎన్జీవో కాలనీ, ఇందిరా కాలనీ, మరాఠీపాలెం, క్రిస్టియన్ పాలెం, వడ్డిపాలెం,మిరియాల పాలెంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న లోపాలను సరిదిద్దాలని సీడీపీవో ఫణిరాజకుమారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ కమిటీ సభ్యురాలు డి.నీలిమ వంశీలత,జిల్లా బాలల సంరక్షణ విభాగం లీగల్ కం ప్రొబేషన్ ఆఫీసర్ రత్నప్రసాదు, సోషల్ వర్కర్ వీరాంజనేయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

సంతనూతలపాడు, జూలై 29: ఫోర్‌వీలర్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం మండలంలోని మిట్టమీదపాలెం సమీపంలోని టపాచెట్లు వద్ద చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ భాస్కరరావు తెలిపిన సమాచారం మేరకు పి.గుడిపాడుకు చెందిన సిహెచ్.రాకేష్‌రెడ్డి(19), తనతల్లి శ్రీదేవితో చీమకుర్తి మండలం బండ్లమూడికి ద్విచక్రవాహనంపై పనిమీద వెళ్లారు. తిరిగి స్వగ్రామం వెళ్లేందుకు తిరుగు ప్రయాణంలో మిట్టమీదపాలెం సమీపంలోని టపాచెట్లు వద్దకు రాగానే ఒంగోలు వైపునుంచి వస్తున్న ఫోర్ వీలర్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రాకేష్‌రెడ్డిని చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతిచెందాడు. తల్లి శ్రీదేవిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ భాస్కరరావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను విచారించిన ఏపీడీ

టంగుటూరు, జూలై 29 : మండలంలోని అనంతవరం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ సునీతపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ఎన్‌ఆర్ఈజీఎస్ ఒంగోలు క్లస్టర్ ఏపీడీ పాలేటి వెంకటస్వామి సోమవారం విచారణ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఉపసర్పంచ్ కసుకుర్తి భాస్కర్ ఇటీవల కలెక్టర్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టారు.

దివ్యాంగునికి శ్రవణ యంత్రం అందజేత

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 29 : ఒంగోలుకు చెందిన దివ్యాంగునికి జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ శ్రవణ యంత్రాన్ని అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన మీ కోసం కార్యక్రమంలో ఒంగోలుకు చెందిన లక్కవరపు భాస్కర్ అనే దివ్యాంగుడు పుట్టకతో వినికిడి సమస్యతో బాధపడుతున్నట్లు జేసీ దృష్టికి తెచ్చారు. మరో వైపు కురిచేడు మండలం నాయుడుపాలెకు చెందిన ఎం. మనీంద్ర వీల్ చైర్ ఇప్పించాలని జేసీకి విజ్ఞప్తి చేశారు దీనిపై స్పందించిన జేసీ గోపాలకృష్ణ వెంటనే న్యాయం చేయాలని దివ్యాంగుల సంక్షేమశాఖ సహాయసంచాలకులు అర్చనను ఆదేశించారు దీంతో దివ్యాంగుల సంక్షేమ శాఖద్వారా భాస్కర్‌కు శ్రవణ యంత్రాన్ని జేసీ గోపాలకృష్ణ అందజేశారు. మహేంద్రకు త్వరలో వీల్‌చైర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

పాసుపుస్తకాలపై రాజముద్ర

మంత్రి గొట్టిపాటి హర్షం



అద్దంకి, జూలై 29 : రాజముద్రతో భూ యజమానులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకోవడంపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు.ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి పట్టాదారు పాసుపుస్తకంపై రాజముద్ర వేసి ఇస్తామని చెప్పిన మాటకు కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జగన్‌రెడ్డి పట్టాదారు పాసుపుస్తకాలపై తన బొమ్మను ముద్రించుకున్నారు. ఇది జగన్‌రెడ్డి ప్రచార పిచ్చికి పరాకాష్ట అన్నారు. దీనికి రూ.15కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారన్నారు. పొలాల సరిహద్దు రాళ్లపై తన బొమ్మను ముద్రించి జగన్‌రెడ్డి రూ.700కోట్లు ప్రజాధనం వృథా చేశారన్నారు. ఈ నిధులు సరిగ్గా వినియోగించుకొని ఉంటే రాష్ట్రంలో ఏదో ఒక ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటు లోకి వచ్చి ఉండేదన్నారు. చంద్రబాబు నాయకత్వంలో ఏర్పాటు అయిన ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, గతంలో వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను పోల్చి చూస్తే ప్రజాస్వామ్యానికి, నియంతృత్వానికి మధ్య ఉన్న తేడా స్పష్టంగా కనిపిస్తుందని రవికుమార్ అన్నారు.

సోలార్ పంప్‌సెట్ ప్యానల్స్ చోరీ



నాగులపాడులో చోరీకి గురైన సోలార్ పంప్‌సెట్ ప్యానల్స్

అద్దంకి, జూలై 29 : మండలంలోని నాగులపాడు పొలాల్లో వ్యవసాయ సోలార్ పంప్‌సెట్ ప్యానల్స్ చోరీకి గురయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు అడుసుమల్లి భూషయ్యకు చెందిన పొలంలో రెండు సోలార్ వ్యవసాయ మోటార్‌లకు సంబంధించి ప్యానల్స్ ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తు తెలియని వ్యక్తులు మూడు చక్రాల ఆటోలో పొలం లోకి వచ్చి రెండు మోటార్‌లకు సంబంధించిన ప్యానెల్స్ దొంగలించుకొని తీసుకుపోయారు. అప్పటికే వర్షపు జల్లులు పడి ఉండడంతో ఆటో వెళ్లిన జాడ స్పష్టంగా కనిపిస్తోంది. ఆటో నామ్ రోడ్డుకు వెళ్లినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. చోరీకి గురైన సోలార్ ప్యానల్స్ ఖరీదు బహిరంగ మార్కెట్‌లో సుమారు మూడు, నాలుగు లక్షల రూపాయల వరకు ఉంటుందని అంచనా. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై రైతులకు బిగించిన సోలార్ ప్యానల్స్‌ను దొంగలు దొంగలించుకు పోయి ఒక్కొక్కటి రూ.60 నుంచి రూ.70 వేలకు అమ్ముకుంటున్నారు. తరచూ చోరీలు జరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సాయిప్రసాద్

అంబడిపూడిలో వైద్య శిబిరం

బల్లికురవ, జూలై 29 : పక్షం రోజుల నుంచి విష జ్వరాలు, చికున్ గున్యాతో బాధపడుతున్న అంబడిపూడి గ్రామంలో డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు సోమవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన జనరల్ ఫిజీషియన్ వైద్యాధికారి సాయిప్రసాద్ పర్యవేక్షణలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ జ్వరాలతో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా మందులను వాడాలన్నారు. అలానే కాచి చల్లార్చిన నీటిని సేవించాలన్నారు. నొప్పులు కూడా తగ్గుతాయని ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. ఇంటి పరిసరాలలో దోమ తిరగకుండా మురుగు నిల్వలు లేకుండా చేసుకోవాలన్నారు. గ్రామంలో జ్వరాలు అదుపులోకి వచ్చే వరకూ ప్రతి రోజు వైద్య శిబిరం అందుబాటులో ఉంటుందన్నారు. ఈసందర్భంగా పలువురికి రక్త నమునాల పరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు కొందరు వైద్య శిబిరంతో పాటు శానిటేషన్ పనులు కూ డా ప్రతి రోజు జరిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ శిబిరంలో వైద్యాధికారులు రమీజ్, రవితేజ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తుల దాడి

ఒకరికి తీవ్రంగా, ఇద్దరికి స్వల్పంగా గాయాలు

చీరాలటౌన్, జూలై 29 : గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటనలో పలువురు గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం రాత్రి వేటపాలెం వద్ద జాతీయ రహదారిలోని పెట్రోల్ బంకు వద్ద చోటుచేసుకుంది. అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేటపాలెంకు చెందిన గుమ్మడి చైతన్య ఓ రిసార్ట్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఈక్రమంలో రాత్రి సమయంలో విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై మిత్రుడు పసుపులేటి నాగార్జునతో కలిసి పెట్రోల్ బంకులో ఆయిల్ కొట్టించుకుని నగదును ఫోన్ పే చేస్తుండగా గుర్తుతెలియని సుమారు 10 మంది అకస్మాత్తుగా వచ్చారు. వీరి పట్ల దురుసుగా ప్రవర్తించారు. ఈక్రమంలోనే ఇద్దరిని, పక్కనే ఉన్న జర్నలిస్ట్ అశోక్‌ను దాడి చేసి గాయపరిచారు. దీంతో చైతన్యకు తీవ్రంగా, మిగిలిన వారికి స్వల్పంగా గాయాలయ్యాయి. దీంతో బాధితులు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు వివరాలు నమోదు చేసుకుని పెట్రోల్ బంకులో సీసీ కెమెరా ఫుటేజీ ఆధారాలను సేకరిస్తున్నారు.

పేస్‌లో జాతీయ విద్యా విధానంపై సదస్సు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 29 : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ విద్యావిధానం-2020 నాల్గో వార్షికోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కెఎల్ యూనివర్శిటీ డీన్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డాక్టర్ రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం - 2020 ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ విద్యావ్యవస్థలో వస్తున్న సరికొత్త మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వీరాంజనేయులు, డీన్ సీవీ సుబ్బారావు, ఎస్. శ్రీనివాసరావు, డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, శిరీష తదితరులు ఉన్నారు.

దశదిన కర్మలో ఎమ్మెల్యే బీఎన్

నాగులుప్పలపాడు, జూలై 29 : అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ముప్పా సుబ్బయ్య ఇటీవల మృతిచెందారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన దశదిన కర్మలో ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పాల్గొని సుబ్బయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి, మండల పార్టీ అధ్యక్షులు తేళ్ల మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యాచకుడు మృతి



టంగుటూరు, జూలై 29 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన యాచకుడు రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. జాతీయ రహదారిలో వల్లూరమ్మ దేవస్థానానికి ఎదురు ఆదివారం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో యాచకుడు గాయపడ్డాడు. ఆయన్ను పోలీసులు ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. ఎస్సై సూర్యారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలి

కలెక్టర్ వెంకటమురళి

చీరాల, జూలై 29 : ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అధికారులు పూర్తిస్థాయిలో అరికట్టాలని కలెక్టర్ జే వెంకటమురళి హెచ్చరించారు. ఆగని ఇసుక అక్రమ రవాణా అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం ప్రచురితమైంది. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకట మురళి అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుకను ఇష్టానుసారంగా తవ్వకుని వెళ్తుంటే అధికారులు తమకేమీ పట్టనట్లు చూస్తూ ఊరుకుంటారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని కొనసాగించాలన్నారు. దళారీల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో ప్రత్యేక కమిటీలు నియమిస్తామన్నారు. నియమించిన కమిటీలు క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తదుపరి ఇచ్చే నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకట మురళి స్పష్టం చేశారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మకత పెంపు

విద్యార్థులకు సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా సూచన



విద్యార్థులను ప్రశ్నిస్తున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

తర్లుపాడు, జూలై 29: విజ్ఞాన ప్రదర్శనలతో విద్యార్థులలో సృజనాత్మకశక్తి పెరుగుతుందని, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా అన్నారు. కలుజువ్వలపాడు జవహర్ నవోదయ విద్యాలయం-2 లో క్లస్టర్‌స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. సైన్స్, గణితం, పర్యావరణం, పరిసరాల విజ్ఞానానికి సంబంధించి విద్యార్థులు తయారు చేసిన నమోనాలు ప్రదర్శించారు. కార్యక్రమానికి సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు రూపొందించిన నమూనాలు పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకో వాలన్నారు. ఏ అంశంలోనైనా ప్రయోగాత్మకంగా అధ్యయనం చేయడం నేర్చుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తయారుచేసిన ఎన్‌సీఎఫ్ఏవోఈ్ఎలలో చెప్పినట్లు 21వ శతాబ్దపు నైపుణ్యాలను పెంచుకొనేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతా యన్నారు. విద్యార్థుల భవిష్యత్‌లో దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ గణేష్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల కృషి, పట్టుదలతో జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఈ విజ్ఞాన ప్రదర్శనకు నవోదయ విద్యాల యాల సమితి నుంచి అనంతపురం, చిత్తూరు, కడప, కర్రెకుల, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం-1, 2, పుదుచ్చేరి విద్యాలయాలలో చదువుతున్న విద్యార్థు లు ఫోటో ఎగ్జిబీషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పీఆర్ శంకరి, రాయవరం ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆశాలత, పలు నవోదయ విద్యాలయాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

- సత్వరమే సమస్యలను పరిష్కరించాలని సూచన

గిద్దలూరుటౌన్, జూలై 29 : ప్రజా సమస్యలను ఎప్పటి కప్పుడే పరిష్కరిస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సూచించారు. సోమవారం ఆయన కార్యాలయంలో పంచాయతీరాజ్, పశుసంవర్ధకశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో రాజీపడే ప్రసక్తే లేదని ఆయన అధికారులకు సూచించారు. బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందాలని పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు.

ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షుడు విల్సన్ రాజీనామా

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 29 : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఒంగోలు నగర అధ్యక్షుడుగా గద్దల విల్సన్ కుమార్ రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. వ్యక్తిగత కారణాల వలన తాను పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. గడిచిన ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో కార్యకర్త స్థాయి నుంచి తాను పనిచేశానని తెలిపారు. అలాగే గడిచిన ఏడు సంవత్సరాలుగా ఒంగోలు నగర అధ్యక్షుడుగా పనిచేశానన్నారు. ఇకపై తాను నగర అధ్యక్షుడుగా కొనసాగలేనని, తన వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఆ బాధ్యల నుంచి విరమించుకుంటున్నట్లు విల్సన్ కుమార్ తెలిపారు.

నాణ్యమైన విద్యను అందిస్తాం


భోజనాలు చేస్తున్న విద్యార్థులు

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు
- ప్రభుత్వ పాఠశాలలో శిక్షసప్తాహ్ భోజన్ కార్యక్రమం

పెద్దదోర్నాల, జూలై 29: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షసప్తాహ్ శుభదిన్ భోజన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఉన్నత విద్య ద్వారా మనిషికి ఔన్నత్యం లభిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డలను విధిగా పాఠశాలకు పంపించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. పుస్తకాలు, బూట్లు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం వసతి ఏర్పాటు చేసి కేజీ నుండి పీజీ, విదేశీ విద్య వరకు లక్షలు రూపాయలు అందజేస్తోందని విద్యార్థులు ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగ పర్చుకోవాలన్నారు. పాఠశాలల్లో ప్రధానంగా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయుల నియామకం చేపట్టే క్రమంలో అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి సంతకం మెగా డీఎస్సీపైనే సంతకం చేసిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడిదేనన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్న చోట అధికంగా ఉన్న పాఠశాలల నుండి డిప్యుటేషన్ విధానంలో సర్దుబాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నూతనంగా ఈ ఏడాది ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ ఉచితంగా అందజేస్తోందన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదవాలని సూచించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం శుభదిన్ భోజన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన భోజనం విద్యార్థులకు వడ్డించారు. కార్యక్రమంలో ఎంఈవో మస్తాన్‌నాయక్, ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీ నారాయణరెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది, టీడీపీ నాయకులు షేక్ మాబు, బట్టు సుధాకర్‌రెడ్డి, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, దేసు నాగేంద్రబాబు, షేక్ మంజూర్, కే.సుబ్బారెడ్డి, కే.రాజేంద్ర, చల్లా వెంకటేశ్వర్లు, ఎలకపాటి చెంచయ్య, షేక్ ఇస్మాయిల్, షేక్ బాష జనసేన అధ్యక్షులు కే వెంకటమోహన్ మురళి, వేమా దాసయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : స్థానిక ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాల, కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సమస్యలు పరిష్కరించాలని ప్రిన్సిపాల్‌లు శంకర్, ఎస్.సావిత్రి గూడూరి ఎరిక్షన్‌బాబుకు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన శిక్ష సప్తాహ్ శుభదిన్ భోజన్ కార్యక్రమానికి ఎరిక్షన్‌బాబు సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏకలవ్యలో రెండురోజులుగా నీటికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సర్దుబాటు ధోరణిలో ఒకటి రెండు ట్రిప్పులు ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్నారని, అవి సరిపోవడం లేదని పేర్కొన్నారు. రోజూ ఎవరినో ఒకరిని అడగాల్సి రావడం విద్యార్థుల అత్యవసరానికి నీటి ఇక్కట్లు తీరడం లేదన్నారు. వెంటనే పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేసి రెండేళ్లు పూర్తి కావస్తున్నా విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవని వసతులు లేమితో విద్య కుంటుపడుతోందన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.., ప్రిన్సిపాల్ ఎస్. సావిత్రి అధ్యాపకుల బృందం ఎరిక్షన్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఆయన్ను శాలువాతో సత్కరించారు. అనంతరం ఎరిక్షన్‌బాబు స్పందిస్తూ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఇప్పటికే పూర్తి వివరాలతో నివేదికలు అందజేశానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు అరటిపండ్ల పంపిణీ

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో టీడీపీ ఒంగోలు పార్లమెంటరీ అధ్యక్షులు, పట్టణ ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు తాళ్లపల్లి సత్యనారాయణ సహకారంతో విద్యార్థులకు భోజన సమయంలో అరటిపళ్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు బొంతల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం : శిక్షా సప్తాహ విద్యా వారోత్సవాలలో భాగంగా మండలంలోని అన్ని పాఠశాలలో విద్యార్థులకు సోమవారం విందుభోజనాలు వడ్డించారని ఎంఈవో పి ఆంజనేయులు అన్నారు. దాతలు, ఉపాధ్యాయుల సహకారంతో భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. తద్వారా విద్యార్థులలో ఉత్సాహం నింపుతున్నామన్నారు. ఎర్రగొండపాలెం అంబేద్కర్‌నగర్ పాఠశాలలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు మెడబలిమి అచ్యుతరావు విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టిప్పరు ఢీకొని వృద్ధుడి మృతి


మృతిచెందిన వెంకటేశ్వర్లు

పొదిలి, జూలై 29 : టిప్పరు ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన సోమవారం కంభాలపాడు పంచాయతీ పరిధిలోని పోతవరం వద్ద చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంభాలపాడు గ్రామానికి చెందిన తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు (72) తన ద్విచక్రవాహనంపై గ్రామం నుంచి పొదిలి వస్తున్నాడు. గిద్దలూరు వైపు నుండి పొదిలి వైపుకు వస్తున్న టిప్పరు ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి కొట్టింది. దీంతో వెంకటేశ్వర్లు అక్కడిక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వర్లుకు భార్య ఆదెమ్మ, నలుగురు కుమారులు ఉన్నారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

- వాట్సాప్‌లో కలెక్టరుకు గుర్రపుసాల గ్రామస్థుల వినతి


అరకొరగా వస్తున్న నీటిని పట్టుకుంటున్న మహిళలు

ఎర్రగొండపాలెం, జూలై29: మండలంలోని గుర్రపుసాల గ్రామంలోని తాగునీటి బోరులో నీళ్ల రావడం లేదు. దీంతో 200 కుటుంబాలకు నీరు అందడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. తమ బాధను వాట్సాప్ గ్రూపులో జిల్లా కలెక్టరుకు సోమవారం వినతి పంపించారు. ఎస్సీకాలనీలోని ఒక తాగునీటి బోరులో నెల రోజులు గా భూగర్భజలాలు అడుగంటాయని వారు పేర్కొన్నారు. బిందెడు నీటి కోసం గంటలు తరబడి నిరీక్షిస్తున్నామని కాలనీ మహిళలు వాపోతున్నారు. ఎన్నికల వరకు ట్యాంకర్లతో నీటి సరఫరా చేశారని ఎన్నికల అనంతరం జూన్ 6వ తేదీ నుంచి ట్యాంకర్లు నిలిపివేశారన్నారు. గ్రామ సర్పంచికి ట్యాంకర్లు ఏర్పాటు చేయించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసిన తమ మొర ఆలకించలదేన్నారు. సర్పంచి గ్రామంలో నివాసం లేకపోవడంతో తమ సమస్యను ఆలకించేవారు కరువయ్యారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకర్లు ఏర్పాటు చేయించాలని గ్రామీణ నీటి సరఫరా అసిస్టెంటు ఇంజనీరుకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ట్యాంకర్లు ఏర్పాటు చేయలేదన్నారు. జిల్లా కలెక్టరు తమ విజ్ఞప్తి పరిశీలించి తాగునీటి సరఫరాకు ట్యాంకర్లు ఏర్పాటు చేయించాలని కాలనీ మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.359


టంగుటూరులో కొనసాగుతున్న పొగాకు వేలం

టంగుటూరు, జూలై 29 : టంగుటూరు వేలం కేంద్రంలో పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.359 పలికింది. శనివారం నుంచి అదనంగా పండించిన పంట కొనుగోళ్లు జరుగుతున్నాయి. సోమవారం తూర్పునాయుడుపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాల రైతులకు చెందిన 971 పొగాకు బేళ్లను వేలానికి అనుమతించారు. అందులో 861 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించారు. కనిష్ఠ ధర రూ.205 లభించింది. సరాసరి ధర కిలో రూ.296.43గా ఉంది.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు : మండలంలోని పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం అమ్మకాలకు చీమకుర్తి క్లస్టర్ నుంచి 1,055 పొగాకు బేళ్లు రాగా 913 బేళ్లు అమ్ముడయ్యాయి. 142 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయని ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. గరిష్ఠ ధర కేజీ రూ.359లు పలకగా, కనిష్ఠ ధర రూ.205లు పలికింది. సరాసరి ధర రూ.312.17 వచ్చినట్లు తెలిపారు. కొనుగోలులో 25 కంపెనీల ప్రతినిధులు, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

- సత్వరమే సమస్యలను పరిష్కరించాలని సూచన


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరుటౌన్, జూలై 29 : ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడే పరిష్కరిస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన కార్యాలయంలో పంచాయతీరాజ్, పశుసంవర్ధకశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో రాజీపడే ప్రసక్తే లేదని ఆయన అధికారులకు సూచించారు. బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందాలని పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు.

సచివాలయాలను అందుబాటులో ఉంచాలి


వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గిద్దలూరు, జూలై 29 : పట్టణంలోని పాత రెవెన్యూ కార్యాలయం ఆవరణను శుభ్రం చేసి అందులోకి పట్టణం లోని 1, 2 సచివాలయాలను మార్చాలని ప్రజాసంఘాల నాయకులు మున్సిపల్ అధికారులకు కలిసి వినతిపత్రం అందజేశారు. 1, 2 సచివాలయాలు గణేష్‌నగర్‌లోని పై అంతస్తుల్లో ఉండడంతో వృద్ధులు, వికలాంగులు మేడపైకి ఎక్కాలంటే ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని సమీపంలోని పాత రెవెన్యూ కార్యాలయ బిల్డింగ్‌లో ఏర్పాటు చేస్తే అద్దె భారం తగ్గడమే కాకుండా అందరికీ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అలాగే పెద్ద కూరగాయల మార్కెట్ వెనుక వైపు ఖాళీగా ఉన్న ప్రభుత్వ పాఠశాల బిల్డింగ్‌లోకి అద్దె భవనంలో నడిచే మరో సచివాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల ప్రతినిధులు టి.ఆవులయ్య, థామస్, నరసింహులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులను కొనసాగించాలి


నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 29: మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను కొనసాగించాలని స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదురు సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం ఆధ్వర్యంలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకంలో కార్మికులు గత 23 ఏళ్లుగా పనిచేస్తున్నారన్నారు. వీరిని అకారణంగా రాజీనామాలు చేయమని బలవంతం చేస్తూ బెదిరిస్తున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు వారి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కరించక పోగా ఉన్న ఉపాధి ఊడగొట్టే చర్యలకు పూనుకోవడం విచారకరం అన్నారు. అక్రమ తొలగింపులు మానుకొని తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకో వాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు సుబ్బలక్షమ్మ, ఈశ్వరమ్మ, బాలనాగమ్మ, కొండమ్మ, లక్ష్మీ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మకశక్తి పెంపు

విద్యార్థులకు సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా సూచన


విద్యార్థులను ప్రశ్నిస్తున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

తర్లుపాడు, జూలై 29: విజ్ఞాన ప్రదర్శనలతో విద్యార్థులలో సృజనాత్మకశక్తి పెరుగుతుందని, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా అన్నారు. కలుజువ్వలపాడు జవహర్ నవోదయ విద్యాలయం-2 లో క్లస్టర్‌స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. సైన్స్, గణితం, పర్యావరణం, పరిసరాల విజ్ఞానానికి సంబంధించి విద్యార్థులు తయారు చేసిన నమోనాలు ప్రదర్శించారు. కార్యక్రమానికి సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు రూపొందించిన నమూనాలు పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఏ అంశంలోనైనా ప్రయోగాత్మకంగా అధ్యయనం చేయడం నేర్చుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తయారుచేసిన ఎన్‌సీఎఫ్ఏవోఈ ఎలలో చెప్పినట్లు 21వ శతాబ్దపు నైపుణ్యాలను పెంచుకొనేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతా యన్నారు. విద్యార్థుల భవిష్యత్‌లో దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ గణేష్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల కృషి, పట్టుదలతో జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఈ విజ్ఞాన ప్రదర్శనకు నవోదయ విద్యాలయాల సమితి నుంచి అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం-1, 2, పుదుచ్చేరి విద్యాలయాలలో చదువుతున్న విద్యార్థులు ఫోటో ఎగ్జిబీషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పీఆర్ శంకరి, రాయవరం ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆశాలత, పలు నవోదయ విద్యాలయాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈనాం భూమికి ప్రైవేటు వ్యక్తుల ఫెన్సింగ్

రెవెన్యూ అధికారులకు కనుమళ్ల ప్రజల ఫిర్యాదు

సింగరాయకొండ, జూలై 29 : మండలంలోని కనుమళ్ల చెరువు సమీపంలో కందుకూరు వెళ్లే రోడ్డు పక్కన సర్వే నెం.323లో 50 సెంట్ల భూమిని రెండు రోజుల క్రితం కందుకూరు మండలం పోకూరుకు చెందిన వ్యక్తులు చదును చేయించారు. చుట్టూ ఫెన్సింగ్ వేశారు. అయితే శ్మశాన వాటిక, పంట చెరువు, డంపింగ్ యార్డుకు వెళ్లే దారిని ఆక్రమించారని కనుమళ్ల గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమికి నకిలీ పట్టాలు సృష్టించి అమ్ముకున్నారని ఆరోపించారు. దీనిపై సోమవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు విచారణ చేపట్టారు. ఫెన్సింగ్ వేసిన భూమిని పరిశీలించారు. అక్కడ కొలతలు వేశారు. సర్వే నెంబర్ 323లో 11.76 సెంట్ల భూమి దేవదాయ శాఖకు చెందినదిగా గుర్తించారు. ఆర్ఐ ప్రవీణ్, ఇరిగేషన్ ఏఈ హరిబాబు, సర్వేయర్ బ్రహ్మం, వీఆర్వో విజయ పాల్గొన్నారు. దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్ తన్నీరు వెంకటేశ్వర్లును వివరణ కోరగా ఫెన్సింగ్ వేసిన భూమి కందుకూరు మండలం పోకూరుకు చెందిన రావి వెంకయ్య అనుభవంలో ఉన్నదని తెలిపారు. ఆయన 2011లో 40 సెంట్లు కొనుగోలు చేసినట్లు పత్రాలు చూపుతున్నారన్నారు. రికార్డుల్లో ఈనాం భూమిగా ఉందని వివరించారు. దీనిపై లోతుగా విచారణ చేపడుతున్నట్లు వెల్లడించారు.


సర్వే నెం. 323 ఫెన్సింగ్ వేసిన ఈనాం భూమి


భూమికి వేసిన ఫెన్సింగ్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ , అధికారులు

శుద్ధిజలం.. ఎంతవరకు సురక్షితం

- అరకొర అనుమతులతో నడిపిస్తున్న వైనం
- ప్రమాణాలు పాటించకుండా నీటి సరఫరా
- అధికారుల పర్యవేక్షణ కరువు

పొదిలి, జూలై 29 : మండల పరిధిలో నీటిని శుద్ధిచేసి అందించే కేంద్రాలు (ఆర్‌వో ప్లాంట్లు) పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. పొదిలి ప్రాంతం లో తాగునీటి సమస్య జఠిలంగా ఉంటోంది. ఈ సమస్యకు అధికారులు పరిష్కారం చూపక పోవడంతో ప్రజలు ఎక్కువగా శుద్ధి చేసిన ఆర్‌వో నీటిపైనే ఆధారపడుతున్నారు. దీంతో వ్యాపారు లకు ఈ రంగం కాసులు వర్షం కురిపిస్తోంది. అదేవిధంగా ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలు కావడంతో తాగునీటి సరఫరా వ్యాపారులకు ఆదాయవనరుగా మారింది. సాగర్‌నీరు వారం నుండి 15 రోజుల వ్యవధిలో ఒకసారి వస్తు న్నాయి. అవి కూడా రంగుమారి వస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అయినా అనధికారిక కొళాయిలు ఎక్కువగా ఉండడంతో శివారు ప్రాంతాలకు సాగర్ నీరు చేరడం లేదు. దీంతో అధికశాతం మంది మినరల్ వాటర్‌నే వినియోగించక తప్పడం లేదు. మినరల్ వాటర్ సరఫరా చేసే వారు తూతూమంత్రంగా నీటిని శుద్ధిచేసి విక్రయిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలో సుమారుగా 10కి పైగా నీటిశుద్ధి కేంద్రాలు ఉన్నాయి. వీటిలో చాలా వరకు పంచాయతీ అనుమతులు లేవు. గతంలో రూ.10 ఉన్న 20లీటర్ల బబుల్ ఇప్పుడు రూ.15కు పెరిగింది. నిబంధనల ప్రకారం ఉండాల్సిన ప్రమాణాలు, కలపాల్సిన మినరల్ లేదన్న ఈ నీటిలో కలపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. నీటిశుద్ధి విషయంలో పాటించాల్సిన ప్రమాణాలు పాటించకపోతే ఆరోగ్య సమస్యలు తప్పవని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినా ఆయా కేంద్రాల యజమానులు నిపుణుల సూచనలను పెడచెవిన పెడుతు న్నారు. లీటర్‌నీటిలో నైట్రేట్‌లు 45 మిల్లీ గ్రాములు కంటే ఎక్కువగా ఉంటే బ్లూబేబీస్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. నీటిలో 0.8 మిల్లీగ్రాములకు తక్కువ కాకుండా 1.2 మి.గ్రా మించకుండా ఫ్లోరైడ్ శాతం ఉండాలి. తక్కువ ఉంటే దంత సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. అదేవిధంగా ఎక్కువైతే ఫ్లోరోసిస్ ఎముకల వ్యాధి వస్తుంది. అయోడిన్ తగినశాతం లేకపోతే గైటర్ సమస్య తలెత్తు తుంది. క్లోరైడ్ ప్రమాణాలకు మించి ఉంటే జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపి అలర్జీ సమస్యలు తలెత్తుతాయి. ఇనుప ధాతువు ఎక్కువైతే నీటి రుచి తుగ్గుతుంది. మరింత చల్లని నీటిని తాగితే జీర్ణవ్యవస్థ, కాలేయంపై ప్రభావం చూపుతుం దని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయినా నీటిశుద్ధి కేంద్రాల యజమానులు ఎవరేమైతే మాకేం మా ఆదాయం మాకువస్తుంద నే రీతిలో వ్యాపారం చేస్తున్నారు.

మనంతాగే నీటిలో ఉండాల్సినవి

మనం తాగే నీటిలో భౌతిక, రసాయన, జీవ పదార్థాలు, ఖనిజాలు ఉంటాయి. అవి ఉండా ల్సిన పరిమాణంలో ఉంటే ఆరోగ్యకరమన్నది భారత ప్రామాణికాల వ్యవస్థ నిర్ధారణ చేసింది. ఆర్వోట్రీటెడ్ చేసిన ఒకలీటరు నీటిలో 75 మి.గ్రాములు కాల్షియం, క్లోరిన్ 0.2, సల్ఫేట్ 200ల మి.గ్రా, నైట్రేట్ 45 మి.గ్రా, ఫ్లోరైడ్ 0.8 - 1.2 మి. గ్రా, ఇనుము 0.3 మి గ్రా చొప్పున ఉండాలి.

ఐఎస్ఐ మార్కు ఉండదు

ఏ నీటిశుద్ధి కేంద్రానికి ప్రభుత్వం అనుమతి ఉందోలేదో తెలీదు. ఆవిధంగా పెద్ద ఎత్తున నీటివ్యాపారం చేసే కంపెనీలు ముడినీటిని సేకరించి మినరల్ ఏ స్థాయిలో వాడాలో ఆ స్థాయిలో కలిపి ఆ తరువాత బాటిల్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అందుకోసం అన్ని శాఖల నుండి ఐఎస్ఐ గుర్తింపు పొందుతారు. అయితే గ్రామాల్లో, చిన్న మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసే ఆర్వో ప్లాంట్లలో మినరల్స్ ఊసే ఉండదు. తాగునీరు రుచిరావడం కోసం ఏవో కొన్ని రసాయనాలు వినియోగిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. కేంద్రాల ఏర్పాటు సమయంలో నీటినమూన పరీక్షలు చేయిస్తారు. ఏటా నీటిలో కాఠిన్యత మరుతుంది. ఈ నేపథ్యంలో నిర్ణీత కాలవ్యధిలో పరీక్షలు చేయడం తప్పనిసరి అవుతుంది. కానీ ఈతంతు మాత్రం ఎక్కడ సక్రమంగా జరగడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.


పొదిలిలో సరఫరా చేస్తున్న తాగునీరు

అవీ.. ఇవీ..

రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలి


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

కొమరోలు, జూలై 29 : మండలంలోని అన్ని విత్తన దుకాణాల్లో రైతులకు ఇచ్చే విత్తనాలు కల్తీ లేకుండా నాణ్యమైనవి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇవ్వాలని కనిగిరి ఏడీఏ వెంకటరమణ, ఏవో రాజశ్రీలు తెలిపారు. మండలంలోని అన్ని ఎరువుల దుకాణాలను సోమవారం వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. వారికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఇచ్చే విత్తనాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. దుకాణదారులు నాణ్యమైన, ప్రభుత్వ అనుమతి ఉన్న సీడ్స్ ఏజెన్సీలద్వారానే కొనుగోలు చేసి రైతులకు ఇవ్వాలన్నారు. ప్రతి రైతుకు కచ్చితంగా రశీదు ఇస్తూ ఇందులో ఏ కంపెనీకి సంబంధించిన విత్తనాలనే విషయాన్ని స్పష్టంగా పొందుపరచాలన్నారు. దీని వల్ల ఏదైనా పంట సరిగా రాకపోయినా, విత్తనాలు సరిగా మొలవకపోయిననూ ఆయా కంపెనీలతో ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పిస్తుందని తెలుసుకోవాలన్నారు. గడువు ముగిసిన విత్తనాలనుగాని, కల్తీ విత్తనాలను రైతులకు అమ్మినట్లు తెలుస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


సమస్యలను వివరిస్తున్న ఆర్జీదారులు

కొమరోలు, జూలై 29: ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అన్నిశాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ మల్లిఖార్జున నాయుడు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అన్ని శాఖల అధికారులతో గ్రీవెన్స్ సెల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మల్లిఖార్జుననాయుడు మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌కు మండల స్థాయి అధికారులు నేరుగా హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాల న్నారు. ప్రజలు ఒంగోలు వెల్లకుండా కొమరోలులోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. సోమవారం ఐదు అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

నేడు తిరునాళ్ల మహోత్సవం

గిద్దలూరు, జూలై 29 : మండలంలోని ముండ్లపాడు గ్రామంలోని పోలేరమ్మ దేవాలయంలో మంగళవారం తిరునాళ్ల మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామ నడిబొడ్డున ఉన్న బొడ్డురాయికి 108 బిందెలతో జలాభిషేకం నిర్వహిస్తానారు. అనంతరం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ ప్రతినిధులు తెలిపారు.

నేడు సూరవారిపల్లిలో పగలు సరిగేసు


ముస్తాబైన సూరవారిపల్లి పీర్లచావిడి

కొమరోలు, జూలై 29: మండలంలోని సూరవారిపల్లి గ్రా మంలోని శ్రీరంతూ బాదుల్లా స్వామి, ఖాశింస్వామి, పెద్ద పీరయ్య స్వాముల పీర్ల పండుగ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. సోమవారం చిన్న సరిగేసు రోజు రాత్రి పాటకచేరి కార్యాక్రమాన్ని నిర్వహించారు, 30న మంగళవారం పగలు సరిగేసు రోజు స్వాములను ఉదయం, మరోసారి సాయంత్రం పీర్లను గుండం చుట్టు ప్రదర్శిస్తారు. ఉదయం గ్రామంలో రాష్ట్రస్థాయి నాలుగు పళ్ల బండపందెమును నిర్వహిస్తారు. 31న బుధవారం రోజు పెద్దసరిగేసు సందర్భంగా చావిడిలోని పీర్లను ప్రత్యేకపూలతో, విద్యుత్ దీపాలతో అలంకరిస్తారు. స్వాములను దర్శించుకునేందుకు రెండురాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుంటారు. ఉదయం గ్రామంలో రాష్ట్ర సీనియర్ ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తారు. రాత్రి వివిధ రూపాల్లో బాణసంచా కాలుస్తారు, రాత్రి పాటకచేరి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆగస్టు1న గురువారం పీర్లను స్నానానికి తీసుకెళ్లడంతో పండుగ ముగుస్తుంది.

జాతీయ ఆహార భద్రతపై మాగుంట ప్రశ్న

ఒంగోలు(కలెక్టరేట్),జూలై 29 : దేశంలో జాతీయ ఆహారభద్రత చట్టం ప్రజా పంపిణీ పథకానికి సంబంధించి ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ శాఖ సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్ సమాధానం ఇస్తూ దేశంలో 75శాతం వరకు గ్రామీణ జనాభాకు, 50శాతం వరకు పట్టణ జనాభాకు అధిక సబ్సిడీపై ఆహార ధాన్యాల సరఫరాను జాతీయ ఆహార భద్రత చట్టం ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు రాష్ట్రాలకు సలహాలు ఇచ్చామన్నారు. లబ్ధిదారుల గుర్తింపుపై ఏదైనా పునఃపరిశీలన చేయడమనేది తదుపరి జనాభా లెక్కల ప్రకటనపై ఆధారపడి ఉంటుందని మాగుంట ప్రశ్నకు కేంద్రమంత్రి వివరణ ఇచ్చారు.

స్కేటింగ్ పోటీలో విజయకేతనం

ఒంగోలు(విద్య), జూలై 29 : గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలలో స్థానిక హైదరాబాద్ పబ్లిక్ స్కూలు విద్యార్థి విజయకేతనం ఎగురవేశారు. ఈ పోటీల్లో ఆరు నుంచి ఎనిమిది సంవత్సరాల వయస్సు గల పిల్లలకు పోటీలు నిర్వహించగా హైదరాబాద్ పబ్లిక్ స్కూలు విద్యార్థి రేయాన్ష్ బ్రాంజ్‌మెడల్ సాధించారు. తక్కువ సమయంలో శిక్షణ తీసుకొని మెడల్ సాధించిన విద్యార్థిని స్కూలు యాజమాన్యం, తల్లిదండ్రులు అభినందించారు.

రొచ్చురొచ్చుగా...!

అధ్వానస్థితిలో వేములబండ గ్రామ రహదారులు

కాలు తీసి కాలు పెట్టలేక అవస్థలు పడుతున్న గ్రామస్థులు

వృద్ధులు, వాహనచోదకుల ఇబ్బందులు అన్నీఇన్నీ కావు

ముండ్లమూరు, జూలై 24 : మండలంలో మారుమూల గ్రామమైన వేములబండకు వెళ్లే ప్రధాన రహదారులన్నీ చినుకుపడితే బురదగా మారిపోతున్నాయి. ప్రజలు కాలు తీసి కాలు పెట్టలేని దుస్థితి ఏర్పడింది. పట్టించుకోవాల్సిన అధికారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. రహదారిపై వెళ్తున్న వృద్ధులు, చిన్నపిల్లలు, ద్విచక్రవాహన చోదకులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి రామాలయం వీధి, వేములబండ నుంచి రమణారెడ్డి పాలెం వెళ్లే రహదారి,



వేములబండ నుంచి రమణారెడ్డిపాలెం వెళ్లే ప్రధాన వీధి బురదమయం



ఉమామహేశ్వర అగ్రహారం వెళ్లే రోడ్డు బురదమయం

వేములబండ నుంచి ఉమామహేశ్వర అగ్రహారం వెళ్లే రోడ్డు, గ్రామం నుంచి పసుపుగల్లు వచ్చే రహదారితో పాటు ఎస్సీ, బీసీ కాలనీల్లోని పలురోడ్లు రొచ్చురొచ్చుగా మారాయి. నేటికీ ఆ బురద తగ్గలేదు. ఈ మధ్యనే వేములబండ గ్రామ పంచాయతీ కొత్తగా ఏర్పడటంతో పంచాయతీలో నిధులు లేవు. రహదారులపై నిలబడిన వర్షపు నీరు వల్ల దుర్వాసన వెదజల్లుతుండడంతో బ్లీచింగ్ పౌడరైనా చల్లటానికి నిధులు లేవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అనారోగ్యాలకు కేరాఫ్.. ఖాళీ స్థలాలు

ఇళ్ల మధ్యలో ఉండడంతో మురుగునీరు నిల్వ

విషజ్వరాలు ప్రబలుతాయంటున్న పామూరు ప్రజలు

పామూరు, జూలై 29 : పామూరు మేజర్ పంచాయతీ పరిధిలోని ఎన్జీవోకాలనీ, నేతాజీనగర్ అంకాలమ్మవీధి, ఎర్రచేలు, ఉర్దూ పాఠశాల, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఇళ్ల మధ్య నిల్వ ఉంటున్న మురుగుతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇళ్ల మధ్యలో అక్కడక్కడా ఖాళీ స్థలాలు కూడా ఉన్నాయి. ఈ స్థలాలపై యజమానుల పర్యవేక్షణ లేకపోవడంతో అవి డంపింగ్ యార్డులుగా మారాయి. దీనికితోడు ఇళ్లల్లో వాడిన నీరు, వర్షపు నీరు, ఖాళీ స్థలాల్లో నిలిచి మురుగుగుంతలుగా మారాయి. వాటిలో పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరుగుతున్నాయి. అంతటితో ఆగక వాడేసిన కొబ్బరిబొండాలు,ఇరిగిన ప్లాస్టిక్ సామగ్రి, లాంటివి పారవేస్తున్నారు.



ఎన్జీవో కాలనీలోని ఖాళీ స్థలంలో మురుగు



నేతాజీనగర్‌లో ఖాళీ స్థలంలో మురుగు నీరు

వర్షాలు కురవగానే వాటిలో నీరు చేరడంతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారయ్యాయి. దీంతో ప్రమాదకరమైన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు ప్రబలుతాయనే భయాందోళనలో ప్రజలు ఉన్నారు. ఖాళీ స్థలాల యజమానులకు తమ ప్లాట్లను మెరక చేసుకోవాలని పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నా కొందరు స్పందించడం లేదని సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ముండ్లమూరు, జూలై 29 : ముండ్లమూరు గ్రామానికి చెందిన ఎస్‌కే ఖాజావలి(60) రోడ్డు ప్రమాదంలో గాయ పడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... ముండ్లమూరుకు చెందిన ఖాజావలి ద్విచక్రవాహనంపై ఆదివారం అద్దంకి వెళ్తుండగా పోలవరం సమీపంలోకి వెళ్లే సరికి దర్శి వైపు వెళ్తున్న పాల ట్యాంకర్ ఢీకొంది. తీవ్ర గాయాలైన ఖాజావలిని కుటుంబ సభ్యులు గుంటూరులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని ఎస్‌ఐ వీ నాగమల్లేశ్వరరావు సందర్శించి కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నిజాయితీ చాటుకున్న రైతు



డబ్బులు అందజేస్తున్న బాలయ్య

కురిచేడు, జూలై 29 : కురిచేడు మండలం గంగదొనకొండ గ్రామానికి చెందిన వరికూటి బాలయ్య ఫోన్‌పే నంబరుకు రాజమండ్రికి చెందిన వీరవల్లి జగదీశ్వర ప్రసాద్ పొరబాటున రూ.30,000 పంపించారు. ఆ తరువాత బాలయ్యకు ఫోన్ చేసి పొరబాటు జరిగిందని, తన డబ్బులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బాలయ్య ఈ విషయం కురిచేడు పోలీస్ స్టేషన్‌లో తెలిపారు. జగదీశ్వర ప్రసాద్‌ను కురిచేడు పోలీస్‌స్టేషన్‌కు సోమవారం పిలిపించారు. ఆ మొత్తాన్ని పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు జగదీశ్వరప్రసాద్‌కు అప్పగించారు. తన ఖాతాకు వచ్చిన మొత్తాన్ని నిజాయితీతో అప్పగించిన బాలయ్యను పోలీసులు అభినందించగా రాజమండ్రికి చెందిన జగదీశ్వర ప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు.

బోర్లకు మరమ్మతులతో తీరిన తాగునీటి ఎద్దడి



బోరు రిపేరు చేస్తున్న మెకానిక్‌లు

దొనకొండ, జూలై 29 : దొనకొండలోని వీవీపురం ఎస్సీ కాలనీలో ఏడాదిన్నర నుంచి మరమ్మతులకు గురైన మూడు బోర్లకు మండల టీడీపీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు చొరవతో సోమవారం నుంచి వినియోగంలోకి వచ్చాయి. మూడు బోర్లు పనిచేయడం లేదని ఎన్నోసార్లు పాలకులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ నాయకుడు షేక్ మస్తాన్ ప్రజల తాగునీటి సమస్యను మండల టీడీపీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే సమస్యను ఎంపీడీవో వసంతరావుకు తెలిపారు. స్పందించిన ఎంపీడీవో బోర్ మెకానిక్ అన్వర్‌కు పూర్తి మెటీరియల్ అందించి మూడు బోర్లకు రిపేర్లు చేయించి వినియోగంలోకి తెచ్చారు.

ఉర్దూ పాఠశాలలో జయసింహారెడ్డి జన్మదిన వేడుకలు

పామూరు, జూలై 29 : ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తనయుడు జయసింహారెడ్డి జన్మదిన వేడుకలను స్థానిక ఉర్దూ పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు షేక్ హాజీగౌస్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం విద్యార్థులకు ప్రత్యేకంగా తయారు చేయించిన భోజనాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, టీడీపీ ఒంగోలు పార్లమెంట్ మైనార్టీ కార్యదర్శి ఆర్‌ఆర్ రఫి, షేక్ గౌస్ బాష, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు దోలా శేషు, పత్తు మస్తాన్ మాచర్ల రహిమాన్, నాయబా, రహంతుల్లా, జిలాని, అస్లీం, రసూల్ హెచ్‌ఎం ఖాదర్‌బాష పాల్గొన్నారు.

గణిత ఉపాధ్యాయున్ని తొలగించవద్దు



వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

సీఎస్‌పురం(పామూరు) జూలై 29 : మండలంలోని కోవిలంపాడు యూపీ పాఠశాలలో అవసరమైన గణిత ఉపాధ్యాయున్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం తొలగించరాదని ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు టీ శ్రీనివాసులు, జే ఆనంద్‌లు కోరారు. ఈ మేరకు మార్కాపురం ఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలోని సీసీకి సోమవారం వినతిపత్రం అందజేశారు. కోవిలంపాడు పాఠశాలలో పనిచేస్తున్న ఏడుకొండలు అనే టీచరు మిగులు కారని, అదే పాఠశాలలో కొనసాగించాలని అందులో పేర్కొన్నారు. ఆ కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ జి. రామకృష్ణ, షేక్ హమ్మద్ లు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన



విద్యార్థులతో కలిసి భోజనాలు చేస్తున్న తహసీల్దార్

సీఎస్‌పురం(పామూరు), జూలై 29 : ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫై అయిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యా బోధన అందుతోందని తహసీల్దార్ షేక్ నాగూల్‌మీరా చెప్పారు. సీఎస్‌పురంలోని ఎస్టీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నూతన విద్యవిధానం అమలులోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వారోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజల సహకారంతో విద్యార్థుల నమోదును పెంచి మంచి ఫలితాలు రాబట్టాలని సూచించారు. మండలంలోని 64 పాఠశాలల్లో దాతల సహకారంతో భోజన కార్యక్రమం అందిస్తున్నట్లు ఎంఈవో రాజాల కొండారెడ్డి చెప్పారు. అనంతరం విద్యార్థులతో కలిసి తహసీల్దార్ మధ్యాహ్న భోజనం రుచి చూశారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

విద్యుత్ ఈఈ ఎస్‌కే కరీం



మాట్లాడుతున్న ఈఈ కరీం

ముండ్లమూరు, జూలై 29 : వ్యవసాయ మోటార్లకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని దర్శి డివిజన్ ఈఈ ఎస్‌ఏ కరీం చెప్పారు. ఆయన సోమవారం ఉమామహేశ్వర అగ్రహారం, ముండ్లమూరు సబ్‌స్టేషన్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లతో పాటు గ్రామాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. పెండింగ్ విద్యుత్ బకాయిలను కూడా త్వరితగతిన వసూలు చేయాలన్నారు. దాదాపు కోటి రూపాయల మేర బకాయిలు పేరుకుపోయాయని చెప్పారు. ఎక్కువ బకాయిలున్న వినియోగదారుల కనెక్షన్‌లను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రధానంగా తహసీల్దార్, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు స్టేషన్ కార్యాలయాలు బకాయిలు పేరుకుపోయాయన్నారు. మూడు నెలల పాటు వరుసగా బిల్లులు చెల్లించని వారు ఉంటే కనెక్షన్ తొలగించాలని చెప్పారు. సాగుకు నిరంతరం తొమ్మిది గంటల పాటు కరెంటు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ముండ్లమూరుకు 24 గంటల విద్యుత్ సరఫరాతో పాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కల్పించామన్నారు. ఈ మధ్య కాలంలో మండల పరిధిలో 40కి పైగా విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు చోరీకి గురయ్యాయని, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈ వీరబ్రహ్మం, లైన్ ఇన్‌స్పెక్టర్ ఎస్ సాంబయ్య, లైన్‌మెన్ ఆంజనేయులు, నాయక్, కోటేశ్వరరావు, మస్తాన్ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలి



ధర్నా చేస్తున్న ఫుట్‌పాత్ వ్యాపారులు

కనిగిరి, జూలై 29 : ఫుట్‌పాత్ వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలని సీఐటీయూ జిల్లా నాయకులు పీసీకేశవరావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం ఫుట్‌వ్యాపారులతో నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణ నేపథ్యంలో నగరంలో ఫుట్‌పాత్ వ్యాపారుల బంకులను తొలగించారన్నారు. కానీ ఉపాధి కోల్పోయి ఆయా కుటుంబాలు ప్రస్తుతం రోడ్డుపాలయ్యాయని చెప్పారు. ఫుట్‌పాత్ వ్యాపారంతోనే 5 దశాబ్దాలుగా జీవనం సాగిస్తున్న కుటుంబాలకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. వీధి వ్యాపారుల చట్టం ప్రకారం నడుచుకోవాల్సిన అధికారులు ఆయా చట్టాన్ని ఉల్లంఘించి బంకులను తొలగించటం న్యాయం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో మంది నిరుపేదలకు ఉపాధి కోల్పోయేలా చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు సర్వే నిర్వహించి ఉపాధి కోల్పోయిన ఫుట్‌పాత్ వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బషీరా, లక్ష్మీప్రసన్న, నరేంద్ర, ఏడుకొండలు, ఫుట్‌పాత్ వ్యాపారులు పాల్గొన్నారు.

నారాయణస్వామికి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో భక్తులు

సీఎస్‌పురం(పామూరు), జూలై 29 : మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆరాధన మహోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం శ్రీదేవి భూదేవి విష్ణుమూర్తి స్వామివార్ల గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముప్పా రామయ్య, అక్కమ్మల జ్ఞాపకార్థం విజయవాడకు చెందిన వారు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామిని మేళతాళాల నడుమ ఊరేగించారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థాన చైర్మన్ కొమ్మి ఆదినారాయణ, ఈవో గిరిరాజు నరసింహబాబు, పాములపాటి మాధవప్రసాదు, పోలవరపు రమేష్, సీహెచ్ గోపాల్, చావా తిరుపాలు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు

డీఈ శ్యాంప్రసాద్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాళ్లూరు, జూలై 29 : దోసకాయలపాడు-తోటవెంగన్నపాలెం రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వానికి నిధులు మంజూరు ప్రతిపాదనలు పంపామని తాళ్లూరు పీఐయు(పీఆర్) సబ్ డివిజన్ డీఈ శ్యాంప్రసాద్ తెలిపారు. 'తోటవెంగన్నపాలెం రోడ్డుకు మోక్షంలేదా' అన్న కథనం ఈ నెల 29వ తేదీ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీనిపై ఆ శాఖ అధికారులు స్పందించారు. పీఐయు డీఈ శ్యాంప్రసాద్ వివరణ ఇచ్చారు. తోటవెంగన్నపాలెం రోడ్డు నిర్మాణానికి ఏపీఆర్‌ఆర్‌పీ(ఏఐఐబీ) గ్రాంట్ కింద ప్యాకేజ్ నంబర్ 23లో కోటి 10లక్షల 57వేల నిధులు మంజూరయ్యాయన్నారు. నిధులు సకాలంతో విడుదల కాకపోవటంతో కాలపరిమితి పొడగింపునకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఆమోదం రాగానే పనులు ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగరప్పమ్మతల్లి కొలుపులు

పామూరు, జూలై 29 : మండతంలోని అక్కంపేటలో రెండు రోజులుగా జరుగుతున్న నాగరప్పమ్మతల్లి కొలుపుల కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానానికి వేపాకుల తోరణాలు కట్టి పసుపు నీళ్లను వారుగా పోస్తూ అమ్మవారికి శాంతి పూజలు చేశారు. సమృద్ధిగా వర్షాలు కురిసి గ్రామస్థులను చల్లంగా చూడాలని భక్తులు వేడుకొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం చేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ దాసరి మాలకొండయ్య, దొడ్డా కోటిలింగం, దాసరి రత్తయ్య, మల్లికార్జున పాల్గొన్నారు.

దేవాలయ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



దేవాలయ ప్రాంగణాన్ని శుభ్రపరుస్తున్న భజరంగ్‌దళ్ సభ్యులు

పామూరు, జూలై 29 : దేవాలయ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని భజరంగదళ్ మార్కాపురం జిల్లా కన్వీనర్ జమకాల నరేష్ చెప్పారు. జాతీయ విశ్వహిందుపరిషత్ భజరంగదళ్ ఆదేశాల మేరకు స్థానిక మదనవేణుగోపాలస్వామి దేవస్థానంలో సేవ సప్తాహిక్ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్ర కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కన్వీనర్ మంజునాథ, పందిటి హరీష్, మెంటా ఆనంద్, యాటా వీరస్వామి, ఎం హేమంత్, బండ్లా సేరేష్, ఈశ్వర్, చక్రి, చైతన్య పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు తరలిన వృద్ధులు

కనిగిరి, జూలై 29 : ఉచిత కంటి ఆపరేషన్ చేయించుకునేందుకు 103 మంది వృద్ధులు గుంటూరు పెదకాకానిలోని శంకర కంటి ఆసుపత్రికి సోమవారం స్థానిక అమరావతి గ్రౌండ్స్ నుంచి తరలి వెళ్లారు. ఇటీవల జననీ చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మెగాఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించిన విషయం విదితమే. ఈ శిబిరంలో జరిగిన పరీక్షల్లో తొలి విడతగా 103 మంది వృద్ధులను రెండు ప్రత్యేక వాహనాల్లో గుంటూరు ఆసుపత్రికి తరలించారు.

పంటను ధ్వంసం చేసిన వైసీపీ నేత మల్లయ్య ముఠాను అరెస్టు చేయాలి

తాళ్లూరు, జూలై 29 : తాళ్లూరు మండల చింతపాలేనికి చెందిన ప్రభుత్వ భూమిని తరతరాలుగా సాగు చేసుకుంటుండగా ఆ భూమిపై కన్నేసిన వైసీపీ నేత ఎడ్ల మల్లయ్య కులంపేరుతో దూషించి సజ్జ పంటను ధ్వంసం చేసిన అతని ముఠాను అరెస్టు చేసి దళిత గిరిజనులకు న్యాయం చేయాలని జిల్లా ఏఎస్పీకి ఆగ్రామ దళిత గిరిజన మహిళలు సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. తాము సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమిపై కొందరు అగ్రవర్ణకులస్తులు కన్నేసి తమను వెళ్లగొట్టేందుకు తమపై 2021లోనే దాడి చేశారన్నారు. ఈ ఘటనపై తాళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైందని చెప్పారు. ఇదిలా ఉండగా ఈనెల 22వ తేదీ మల్లయ్య తన ముఠాతో వచ్చి తాము సాగు చేసుకుంటున్న పంటను ధ్వంసం చేశాడన్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని స్థానిక ఎస్సైకు ఈనెల 23వతేదీ ఫిర్యాదు చేయగా ఇంతవరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని వాపోయారు. స్పందించిన ఏఎస్పీ వారి సమక్షంలోనే దర్శి సీఐకు ఫోన్ చేసి విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏఎస్పీని కలిసిన వారిలో జిల్లా మాలమహానాడు అధ్యక్షులు దారా అంజయ్య, ఇట్టా కోటేశ్వరరావు, ఇట్టా రూతమ్మ, బూదాల ఏసమ్మ, వేము నాగమ్మ తదితరులు ఉన్నారు.

సబ్సిడీ దుర్వినియోగం ఆరోపణపై ఏవో సస్పెన్షన్

పర్చూరులో ఘటన

పర్చూరు, జూలై 29 : సబ్సిడీ శనగల నగదు దుర్వినియోగానికి సంబంధించి పర్చూరు వ్యవసాయాధికారి ఎస్.రామ్మోహన్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. 2022-23 సంవత్సరానికి సంబంధించి జాతీయ ఆహార భద్రతా పథకం (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం) కింద రైతులకు రాయితీపై శనగ విత్తనాలను పంపిణీ చేశారు. అయితే రూ.7.32లక్షల సబ్సిడీ నగదను సీడ్స్‌కు చెల్లించాల్సి ఉంది. రైతుల వద్ద సేకరించిన నగదును ఏవో చెల్లించకపోవడంపై ఏపీ సీడ్స్ అధికారులు జేడీఏకు ఫిర్యాదు చేశారు. దీనిపై వివరణ కోరుతూ ఏవోకు మూడుసార్లు నోటీసులు ఇచ్చారు. దీనిపై వీఏఏలు విచారించారు. ఈనేపథ్యంలో నగదును తన సొంత ఖర్చులకు వినియోగించుకున్నట్లు ఏవో తెలిపారు. ఏపీ సీడ్స్ ఫిర్యాదుతో కమిషన్ కార్యాలయం నుంచి జేడీఏకు చర్యలకు ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో జేడీఏ ఆదేశాల మేరకు ఏవోను సస్పెండ్ చేస్తూ జిల్లా వ్యవసాయాధికారి ఏడీఏకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

ఆ పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టడం హర్షణీయం

దర్శి, జూలై 29 : విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి టీడీపీ కూటమి ప్రభుత్వం డొక్కా సీతమ్మ పేరు పెట్టటం అభినందనీయమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వం భావితరాలకు స్ఫూర్తిదాతలైన వారి పేర్లు పథకాలకు పెట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. అదేవిధంగా విద్యాకానుక పథకానికి మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరు, విద్యార్థుల ప్రతిభా పురస్కారాలకు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పేర్లు పెట్టటం ఆనందదాయకమని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలకు జగన్ తన పేర్లు పెట్టుకొని స్వంత డబ్బా కొట్టుకున్నారని విమర్శించారు.

ఇష్టంతో చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

పామూరు, జూలై 29 : రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులు ఇష్టంతో చదివి మంచి మార్కులు తెచ్చుకొని ర్యాంకులు సాధించాలని టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి సూచించారు. మండలంలోని బొట్లగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేషనల్ ఎడ్యుకేషనల్ ప్రోగ్రాం చివరి రోజున శుభ్‌దీన్ భోజన్ కార్యక్రమం సందర్భంగా ఒంగోలు మానసతల్లి పిల్లల హాస్పిటల్ డాక్టర్ అడుసుమల్లి నాగమనాయుడు, డాక్టర్ మాధవీలత సౌజన్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం బాలకృష్ణ అధ్యక్షతన సోమవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వై బాల, మండల తెలుగు యువత అధ్యక్షులు రాయవరపు శ్రీకాంత్, కోటపాటి రామ్మోహన్‌రావు, ఎ మురళి, కే శ్రీనివాసులు పాల్గొన్నారు. పామూరు మేజర్ పంచాయతీ పరిధిలోని గోపాలపురం పాఠశాలలో హెచ్‌ఎం ఎం ముసలయ్య అధ్యక్షతన శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా వివిధ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దాత పాలపర్తి రమణయ్య, ఆర్థిక సహకారంతో తిథి భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ షేక్ నాయబ్‌రసూల్, అంచూరి సత్యంరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు శుభదిన్ భోజనం

ముండ్లమూరు, జూలై 29 : మండలంలోని మారెళ్ల, ముండ్లమూరు జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో శుభదిన్ భోజనం కార్యక్రమం సోమవారం జరిగింది. మారెళ్ల గ్రామానికి చెందిన డాక్టర్ పాశం వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పాలపర్తి సుబ్బారావులు భోజనం అందించారు. ముండ్లమూరులో బేతపూడి రామారావు సహకారంతో విద్యార్థులకు ఆహార పదార్థాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు సుంకర రాఘవరెడ్డి, సొసైటీ మా జీ అధ్యక్షుడు మట్టా సుబ్బారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూముల పరిశీలన

తాళ్లూరు, జూలై 29 : మండలంలోని బెల్లకొండవారిపాలెం సమీపాన ఆక్రమణకు గురైన ప్రభుత్వభూమిని ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ జూనియర్ ప్లానింగ్ అధికారి వై. అంకయ్య, సిబ్బంది సోమవారం పరిశీలించారు. ఆ ప్రాంతంలో 0.20 సెంట్ల సాగర్ కాలువ భూమి 0.50 సెంట్ల ఆర్‌అండ్‌బీ స్థలం ఆక్రమించినట్లు అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. ఆక్రమణ స్థలానికి ఆనుకుని ఉన్న స్థలంలో వెంచర్లు వేసినట్లు ఫిర్యాదులు అందటంతో అధికారులు విచారణకు వచ్చారు. ఈకార్యక్రమంలో ప్లానింగ్ సెక్రటరీలు బి.అశోక్, బి.బాలకోటయ్య, ఇన్‌చార్జి వీఆర్‌వో ఎం శివప్రసాద్, డి. శ్రీవల్లి పాల్గొన్నారు.





నాడు మొక్కుబడి

నెరవేరని జలసిరి

రైతుల కల మన వైఎస్ఆర్ జలకళ అనే నినాదంతో ప్రవేశ పెట్టిన జలకళ పథకం కలగానే మిగిలింది. వైసీపీ ప్రభుత్వం వ్యవ సాయ బోర్ల నిర్మాణాన్ని అటకెక్కిం చింది. మొక్కుబడిగా ఈ పథకాన్ని అమలు చేసి ఆ ప్రభుత్వం చేతు లు దులుపుకుంది. రైతుల ప్రయోజనా లకు పెద్ద పీట వేశా మని గొప్పలు చెపుకున్న ప్రభుత్వం బోర్ల నిర్మాణాన్ని చేపట్టలేదు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో 15,341 మంది రైతు లు దరఖాస్తులను ఆమోదించిన ప్పటికీ గత ఐదేళ్లలో 2,208 బోర్లు మాత్రమే నిర్మించారు. విద్యుత్ కనెక్షన్‌లు లేక వందలాది బోర్లు నిరుప యోంగా ఉన్నాయి. నాడు టీడీపీ హయాంలో ఎన్‌టీఆర్ జలసిరి పథకాన్ని ప్రవేశపెట్టి రైతులకు వ్యవసాయ బోర్లు నిర్మించారు. సోలార్ పంపు సెట్లను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జలసిరిని మళ్లీ అమలు చేస్తారని, బోర్ల నిర్మాణంపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయం కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు.

- తూతూమంత్రంగా బోరుల నిర్మాణం
- వైసీపీ ప్రభుత్వంలో అంతులేని నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వ నిర్ణయం కోసం రైతుల చూపు

బోర్ల నిర్మాణం క్లస్టర్‌ల వారీగా ఇలా ..

క్లస్టర్	దరఖాస్తులు	ఆమోదించినవి	నిర్మించినవి
నరసరావుపేట	823	715	104
సత్తెనపల్లి	1,894	1,532	134
మాచర్ల	5,061	4,170	741
వినుకొండ	2,563	1,954	200
గుంటూరు	197	157	11
తెనాలి	279	229	122
బాపట్ల	314	236	75
చీరాల	4210	3492	821
మొత్తం	15,341	12,485	2,208

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

చిన్న సన్న కారు రైతుల ప్రయోజనాల కోసం వ్యవ సాయం బోరు బావులను ఉచితంగా నిర్మించేందుకు ఈ పథ కాన్ని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రవేశపెట్టి అమలులోకి తీసు కొచ్చింది. చిన్న, సన్న కారు రైతుల వ్యవసాయ భూమిని సేద్యానికి అనుకూలంగా మార్చేందుకు, భూగర్భ జలాలను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకొనేందుకు ప్రవేశ పెట్టిన బోర్ల నిర్మాణం పథకం వారికి అక్కరకు రాలేదు. బోర్ల నిర్మాణం కోసం ఆశగా ఎదురు చూసిన అన్నదాతలకు అడియాసే మిగిలింది. ఈ పథకానికి ప్రధానంగా నిధుల కొరత వెంటాడింది. నిర్మించిన బోర్లకు పూర్తి స్థాయిలో బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో బోర్ల నిర్మాణాలు నిలిచి పోయాయి. నిర్మాణం పూర్తయిన బోర్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వలేకపోయారు. దీంతో వందలాది బోర్లు నిరూపయోగంగా మారాయి. నెలల తరబడి విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వక పోవడంతో అవి పూడి పోయే పరిస్థితులు నెలకొం టున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా వదిలేసిన బోరు

- పల్నాడు జిల్లాల్లో 10,341 మంది రెతులు బోర్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేశారు. వీటిలో 8,371 దరఖాస్తులను ఆమోదించి నప్పటికీ 1,179 బోర్లు మాత్రమే నిర్మిం చారు. నిధుల కొరతతో బోర్లు నిర్మాణం నిలిచిపోయింది. బోర్లకు మోటార్లు అమ ర్చడంలో, విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరిగింది. విద్యుత్ కనె క్షన్‌లు లేక వందలాది బోర్లు నిరుపయోగంగా ఉన్నా యి. ఖరీఫ్ సీజన్‌లలో బోర్లు అందుబాటులోకి రాకపోవడంతో వేలాది మంది రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
- బాపట్ల జిల్లాలో 4524 మంది రైతులు దరఖాస్తు చేసు కున్నారు. వీటిలో 3,728 దరఖాస్తులను ఆమోదిం చారు. 2279 భూగర్భ జలాల లభ్యతకు సంబంధించి సర్వే పూర్తి చేశారు. సర్వే నివేదిక ఇచ్చిన దరఖాస్తులలో 2105 బోర్లు నిర్మాణానికి అనుమతి చ్చారు. వీటిలో 1779 బోర్లకు పరి పాలన అనుమతి ఇచ్చారు. 896 బోర్లను మాత్రమే నిర్మిం చారు. నిర్మించిన బోర్లలో 63 బోర్లు విఫలమైనట్లు గుర్తిం చారు. 42 బోర్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చారు.
- గుంటూరు జిల్లాలో 476 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా 386 దరఖాస్తులను అమోదించారు. 181 భూగర్భ జలాల లభ్యతకు సంబంధించి సర్వే పూర్తి చేశారు. సర్వే నివేదిక ఇచ్చిన దరఖాస్తులలో 197 బోర్లు నిర్మాణానికి అను మతిచ్చారు. వీటిలో 170 బోర్లకు పరిపాలన అనుమతి ఇచ్చారు. 133 బోర్లను మాత్రమే నిర్మించగా వీటిలో 34 బోర్లు పనిచేయడం లేదని నిర్ధారించారు. 44 బోర్లకు విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చారు.





తెలుగుదేశం ప్రభుత్వం నిర్మించిన వ్యవసాయ బోర్లు.. సోలార్ పంపు సెట్లు

ఎన్‌టీఆర్ జలసిరిని పునరుద్ధరించేనా ?

నాడు తెలుగుదేశం ప్రభుత్వం ఎన్టీఆర్ జలసిరి పథకం పేరుతో వ్యవసా య బోర్ల నిర్మాణాన్ని పథకాన్ని అమలు చేసింది. ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న సన్న, చిన్న కారు రైతుల కోసం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టి విజయవంతంగా నిర్వహించారు. బోరు నిర్మించడంతో పాటు దీనికి సోలార్ పంపు సెట్ కూ డా ఏర్పాటు చేశారు. జలసిరి పథకాన్ని జలకళగా మార్చిన వైసీపీ ప్రభుత్వం బోర్ల నిర్మాణం నామమాత్రంగా కూడా చేయలేదు. తెలుగుదేశం కూటమి ప్రభు త్వం తిరిగి అధికారంలోకి రావడంతో బోర్ల నిర్మాణంపై రైతుల్లో ఆశలు చిగురించాయి. జలసిరి పథకం మళ్లీ అమలు చేస్తారని ఎదరు చూస్తున్నారు. ము ఖ్యంగా పల్నాడు జిల్లా లో సాగు నీటి కరువు నెలకొంటోంది. దీంతో సాగుకు వ్యవసాయ బోర్లు ఆధారమవుతు న్నా యి. ప్రభుత్వం జలసిరి అమలుపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ప్రభు త్వం నిర్ణయం కోసం అన్న దాతలు ఎదురు చూస్తున్నారు.

నాడు-నేడు అక్రమాలపై

విచారణ

- ఉమ్మడి జిల్లాలోరూ. 600 కోట్లకు పైగా వ్యయం
- తల్లిదండ్రుల కమిటీ పేరుతో వైసీపీ నేతలకు కాంట్రాక్టులు
- నేటికి నిర్మాణ దశలోనే భవనాలు... వాటర్‌ప్లాంట్స్ నిర్వహణ గాలికి

గుంటూరు (విద్య)జులై 29: ఉమ్మడి జిల్లాలో మన బడి నాడు-నేడుపేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన అక్రమాలపై విచారణకు రంగం సిద్ధం అయింది. ఇటీవల అసెంబ్లీ లో సైతం జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు నాడు నేడు అక్రమాలపై విచార ణ చేయాలని విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో అక్రమాలపై విచారణకు కార్యచరణ సిద్ధం అయింది. క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించి అక్రమాలను నిగ్గుతేల్చనున్నా రు. ఇందుకు బాధ్యు లైన అధికారులపై వేటు వేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

ఉమ్మడి జిల్లాలో మన బడి, నాడు నేడు తొలి దశలో 1149 పాఠశాలలను ఎంపిక చేసి దాదాపు రూ. 325 కోట్లుకుపైగా ఖర్చుచేసినట్లు సమాచారం. రెండో దశలో 1344 పాఠశాలలను ఎంపిక చేసి మరో 340 కోట్లు వె చ్చించి ఆధునీకరణ పనులు ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుల ప్రమాణాలు పెంచటం, మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా గత ప్రభుత్వంలో మొదలైన పనులు ఇంకా పూర్తికాలేదు. శిథిలమైన ప్రభుత్వ పాఠ శాలను అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దుతున్నా మనే ముసుగుతో అస్మదీయులకు తల్లిదండ్రుల కమిటీ మాటున కాంట్రాక్టులు కట్టబెట్టి భారీ స్థాయిలో వైసీపీ నాయకులు దోచుకున్నారనే ఆరోపణలు మొదటి నుంచి వస్తున్నాయి. తాగునీరు, టాయిలెట్, ఫర్నిచర్, కాంపౌండ్ వాల్, పెయింటింగు, మరమ్మతులు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు, వంటగది నిర్మాణం, ఇంగ్లీషు మీడియం ల్యాబ్‌లు ఏర్పాటు పేరుతో పెద్ద మొత్తంలో కమీషన్లు దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సైతం కార్పొరేట్ కట్ట డాలకు దీటుగా తీర్చి దిద్ది విద్యా వికాసానికి బాటలు వేస్తున్నామని నాటి ప్రభుత్వం చేసిన వాగ్దా నాలు నీటిమీద రాతలేనని స్పష్టం అయింది. దానికి ప్రత్యక్ష నిదర్శనం నేటికి పూర్తికాని భవనాలే.



గుంటూరు కేవీపీ కాలనీలో ఇంకా సిద్ధం కానీ పాఠశాల భవనం

నిర్మాణ దశలోనే పనులు..

ఉమ్మడి జిల్లాలో నాడు నేడు పనులు 2021లో ప్రారంభిం చారు. అంటే దాదాపు అయిదేళ్ళు పూర్తి కావస్తున్నా పనులు ఇంకా పూర్తికాలేదు. ప్రతి నియోజక వర్గంలో వైసీపీ నేతలే ఈ పనులు చేశారు. అనేక చోట్ల పనుల్లో నాణ్యత లోపం కని స్తున్నా బిల్లులు చెల్లింపు మాత్రం యధేచ్ఛగా సాగించారు. జిల్లాలో మొదటి విడత ఏర్పాటు చేసిన మినరల్‌వాటర్ ప్లాంటులు ఇప్పడు దాదాపు మూతపడ్డాయి. కాంట్రాక్టు ఏజన్సీ ఐదేళ్ల పాటు మరమ్మతులు చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. రెండో దశలో కూడా సంవత్సరం క్రితం అనేక స్కూల్స్ కు వాటర్ ప్లాంట్లు వచ్చా యి. వీటిని ఇంత వరకు వినియోగంలోకి తీసుకురాలేదు.


తూతూ మంత్రంగా పర్యవేక్షణ

నాడు నేడు పనుల పర్యవేక్షణను ఇటు విద్యాశాఖ, అటు సమగ్రశిక్ష అధికారులు అసలు పట్టించుకోవడం లేదు. పను ల పురోగతిని యాప్‌లో నమోదు చేయమని ఉపాధ్యాయు లకు ఆదేశాలు ఇవ్వడం తప్ప క్షేత్రస్థాయిలో నాణ్యత, పనుల వేగం గురించి ప్రశ్నించిన దాఖలాలు లేవు. దీంతో నాడు నేడు పనులు జిల్లాలో ఇష్టారాజ్యంగా సాగాయి. కొంతమంది అధికారులు ఇందుకు ఇతోధికంగా సహకారం అందించి బిల్లుల మంజూరులో భారీ స్థాయిలో కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇందులో మిలాఖత్ అయ్యారని ఫిర్యాదులు ఉన్నాయి.

పాసు పుస్తకాలపై రాజముద్ర

- రెవెన్యూ శాఖను ఆదేశించిన సీఎం చంద్రబాబు నాయుడు
- కొత్త పుస్తకాలకు క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆస్తి వివరాలు, అడ్రస్
- తన బొమ్మ కోసం రూ.15 కోట్లు వృధా చేసిన జగన్

గుంటూరు సిటీ ,జూలై 29 : భూ యజ మాను లకు శుభవార్త. త్వరలో కొత్త పాసు పుస్తకాలు ఇచ్చేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోం ది. ఇవ్వబోయే పాసు పుస్తకాలపై రాజముద్రను ముద్రిం చనున్నారు.ఈ మేరకు రెవెన్యూ శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు పలు సూచనలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కీలకమైన విషయాలపై దృష్టి సారిం చిన సీఎం పాసు పుస్తకాలపై జగన్ బొమ్మను ముద్రించి పంపిణీ చేయటం వల్ల భూ యజమాను ల్లో నెలకొన్న ఆందోళనపై చర్య లు చేపట్టారు. పాసు పుస్తకాల పై వ్యక్తుల ఫొటోలు ఉండటం వల్ల ప్రజల్లో అనేక రకాల భయభ్రాంతులు నెలకొన్న సం గతి ఎన్నికల సందర్భంగా బహి ర్గతం అయ్యింది. చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో కూడా చాలా మంది రైతులు, భూ యజమానులు ఈ విషయాన్ని ఆయ న దృష్టికి తీసుకెళ్లారు. తమ ఆస్తుల పత్రాలపై జగన్ బొమ్మలు ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. అధికా రంలోకి వచ్చాక పాసు పుస్తకాలు మారుస్తా మని చంద్రబాబు నాయుడు హామీ కూడా ఇచ్చారు. ఈ నేపథ్యంలో ప్రచార పిచ్చి తో జగన్ ప్రభుత్వం అడ్డగోలుగా రెవెన్యూ శాఖలో తీసుకున్న నిర్ణయా లపై సీఎం సమీక్ష నిర్వహించి కొత్త పుస్తకా లు రాజ ముద్రతో ఉండాలని అధి కారులను ఆదేశించారు.



లోన్లు ఇవ్వని బ్యాంకర్లు

ప్రస్తుతం భూ యజమానుల వద్ద వున్న పాసు పుస్తకాలపై జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మను ము ద్రించారు. కేవలం ముందు పేజీ లో మాత్రమే కాకుండా, లోపల ఉన్న ప్రతి పేజీలోను ఆయన బొమ్మలు ఉన్నాయి. ఈ పుస్తకాలు తీసుకొని బ్యాంకర్ల వద్దకు వెళ్తే రుణాలు ఇవ్వమని మొఖం మీదే చెప్పేసి రైతుల ను బ్యాంకుల నుండి బయటకు పంపారు. ఇది అన్ని పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమా నులకు బాగా ఇబ్బంది కరంగా అనిపించింది. జగన్ బొమ్మ పాసు పుస్తకాలపై వేయటం వల్ల కొందరు అసలు తమకు ఆ పుస్తకాలు వద్దని తిరిగి గ్రామ సచివాల యంలో నే వాటిని ఇచ్చేసి వెళ్లారు. తమ తాతలు, తండ్రులు కష్టపడి సంపాదించిన ఆస్తులపై జగన్ బొమ్మ వేస్తే పాసు పుస్తకాలు ఎందుకు తీసుకుం టామని చాలా మంది భూ యజమానులు అధికారు లకు ఎదురు తిరిగారు.గత ఎన్నికల్లో జగన్ ఓటమికి ఇదొక కారణంగా కనపడుతుంది.

గతంలో ఎన్నడూ లేదు..

పాసు పుస్తకాలపై 2019 కి ముందు ఉన్న ప్రభుత్వాలు సీఎంల ఫోటోలను ముద్రించిన దాఖ లాలు లేవు. ఏ ప్రభుత్వం ఉన్న రాజముద్రతోనే పాసు పుస్తకాలు పంపిణీ చేసేవారు. జగన్ అధి కారంలోకి వచ్చాక భూ యజమానులు అత్యంత భద్రంగా చూసుకునే పాసు పుస్తకాలపై సీఎం ఫొటో ను ముద్రించారు. అందుకోసం రూ. 15 కోట్లు వరకు వృధా చేసినట్లు తెలుస్తోంది.

ఆధునిక హంగులు

కొత్త పాసు పుస్తకా లు ఆధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్నాయి. నకిలీవి తయారు చేయటా నికి వీలు లేకుండా కొత్త పుస్త కాలకు క్యూఆర్ కోడ్‌ను ఇస్తా రు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆస్తి వివరాలు, అడ్రస్ కూడా తె లుస్తుంది. క్యూఆర్ కోడ్‌స్కాన్ చేసి ఆస్తి ఉన్న అడ్రస్ వద్దకు తీసుకువెళ్లే మ్యాప్ కూడా వచ్చేలా ఏర్పాటు చేశారని తెలు స్తోంది .ప్రస్తుతం ట్రెండింగ్ లో ఉన్న క్యూ ఆర్ కోడ్ విధానం వల్ల భూ యజమానుల ఆస్తులకు భద్ర త వంటి ప్ర యో జనం కలుగు తుంది.

ఇసుక అక్రమ తవ్వకాలు అరికట్టండి

- పింఛన్ పంపిణీ అయ్యేవరకు ఎవరికీ సెలవు లేదు
- అధికారులకు కలెక్టర్ జె.వెంకటమురళీ ఆదేశాలు

బాపట్ల, జూలై 29 : బాపట్ల జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అధికా రులు పూర్తిస్థాయిలో అరికట్టాలని కలెక్టర్ వెంకట మురళి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం అధి కారులతో ఆయన సమావేశమయ్యారు. ఇసుకను ఇష్టా నుసారంగా తవ్వకొని వెళుతుంటే అధికారులు నిర్లిప్తంగా చూస్తూ ఉంటున్నారా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్ర భుత్వం అమలులోకి తెచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని కొన సాగించాలన్నా రు. దళారీల అక్రమాలను పూర్తి స్థాయిలో ని యంత్రించాలన్నారు. మండలస్థాయిలో ప్రత్యేక కమిటీలు ని యమిస్తామన్నారు. నియమించిన కమిటీలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి తదుపరి ఇచ్చేనివేదిక ఆధారంగా సదరు వ్యక్తులపై కఠినచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకానికి మార్గదర్శకాలు విడుదలైన నేపథ్యంలో ప్రజాప్రతినిధు లు, పంచాయతీ తీర్మానాల ఆధారంగా పనులు కేటాయించాల న్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకానికి ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సచివాలయం సిబ్బందితో లబ్ధిదా రులను మ్యాపింగ్ చేసి బ్యాంక్‌లు నుంచి నగదు డ్రా చేసి ఇవ్వాల న్నారు. పిం చన్ నగదు పంపిణి చేసే వరకు ఎంపీడీవోలకు, సదరు సిబ్బందికి సెలవులు మంజూరు చేయరాదన్నారు. జిల్లా స్థాయి అధికారులు సైతం కలెక్టర్ అనుమతి పొందాలన్నారు. మండల కేంద్రాన్ని విడిచి అధికారులు వెళ్ళరాదని సూచించా రు. ఆగస్టు 15 వేడుకలలో శకటా లు, స్టాల్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు తెలి పారు. సమావేశంలో జాయింట్ కలె క్టర్ బీ సుబ్బారావు, జిల్లా రెవెన్యూఅధికారి సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో గంధం రవీందర్, ఆయాశాఖల జి ల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జే వెంకటమురళీ

చట్టపరిధిలో విచారించి సమస్యలు పరిష్కరించాలి

ఎస్పీ తుషార్ డూడీ • పరిష్కారవేదికకు 58అర్జీలు

బాపట్ల, జూలై 29 : ప్రజా సమస్యల పరిష్కారవేదికకు వచ్చే ఫిర్యాదుదారుల సమ స్యలను చట్టపరిధిలో విచా రించి పరిష్కరించాలని ఎస్పీ తుషార్ డూడీ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరి ష్కారవేదిక కార్యక్రమానికి వచ్చిన దివ్యాంగుడి వద్దకు స్వయంగా ఎస్పీ వెళ్ళి అర్జీ తీసుకొని సమ స్యను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మహిళల సమస్య లను తెలుసుకొని వాటి పరిష్కారినికి సంబంధిత స్టేషన్ అధికారు లకు ఆదేశాలు జారీచేశారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 58 మంది తమ ఫిర్యాదులను అందజేశారు. వీటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు.



దివ్యాంగుడి సమస్య అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు



శ్రీశైలం నుంచి సాగర్‌కు కృష్ణమ్మ పరుగులు

- శ్రీశైలం నుంచి లక్షన్నర కూసెక్కుల నీరు విడుదల
- ఖరీఫ్‌లో పంటల సాగుకు అనుకూలం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కృష్ణానది పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో జలా శయాలను వరద పోటె త్తుతోంది. శ్రీశైలం జలా శయం నిండు కుండలా మారింది. శ్రీశైలం మూ డు గేట్లు తెరచి నాగా ర్జున సాగర్ జలాశయా నికి నీటిని సోమవారం విడుదల చేశారు. విద్యు త్ ఉత్పత్తి, గేట్లు తెరచి దాదాపు లక్షన్నర క్యూసె క్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఖరీఫ్ పంటల సాగుకు సాగర్ నీటిపై అన్నదాతల్లో ఆనందం వెల్లువిరుస్తోంది. శ్రీశైలం జలాశయంలోకి సాయంత్రం 6 గంటలకు 4,51,080 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశై లంలో 215.81 టీఎంసీలకుగాను నీటి నిల్వ 184.28 టీఎంసీలకు చేరింది. శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 63,466 కూసెక్కులు, గేట్ల తెరచి 81,000 కూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డి పాడుకు 18,000 కూసెక్కుల నీటిని విడుదల చేస్తు న్నారు. శ్రీశైలం జలశయానికి ఇదే స్థాయిలో వరద మూడు రోజులు కొనసాగుతుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. ఇక్క డ నుంచి సాగర్‌కు నీటి విడుదల మంగళ వారం మూడు లక్షల కూసెక్కులకు చేరు తుందని అంచనా వేస్తున్నారు.

ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగ భద్ర జలాశయాల నుంచి దాదాపు నాలుగున్నర లక్షల కూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలంలో నీటి మట్టం గంటగంటకు పెరుగుతోంది. సాగర్‌లో కూడా నీటి నిల్వ ఆశాజనకంగా పెరుగుతోంది. సాగర్‌లో నా లుగు రోజుల్లో 16 టీఎంసీల నీటి నిల్వ పెరిగింది. సాగర్ పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 312.50 టీఎంసీలు కాగా సా యంత్రం 137.60 టీఎంసీలకు చేరింది. సాగర్ నుంచి కుడి కాలువకు 5,944 కూస్కెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

విద్యుత్ ఏఈ అక్రమాలపై విజిలెన్స్ విచారణ



వినియోగదారులతో విచారణ చేస్తున్న అధికారులు

మార్టూరు, జూలై 29 : మండలంలో విద్యుత్ వినియోగం అవసరం ఉన్న రైతులు, వ్యక్తుల వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలపై ఏఈ ఎస్.శ్రీనివాసరావుపై సోమవారం మార్టూరులో విజిలెన్స్ విచారణ అధికారి డీఈ సంజీవరావు విచారణ చేశారు. కొణిదెన రోడ్‌లో ఉన్న విద్యుత్ డీఈ కార్యాలయంలో ఏఈ బాధితులతో ఆయన విచారణ చేపట్టారు. వారి దగ్గర నుంచి లిఖిత పూర్వకంగా విచారణలు స్వీకరించారు. విద్యుత్ ఏఈపై పలువురు వ్యక్తులు, రైతులు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో అధికారుల ఆదేశాలు మేరకు ఏఈపై విజిలెన్సు అధికారులు విచారణ చేపట్టారు.దాంతో పలు గ్రామాలకు చెందిన వ్యక్తులు డీఈ కార్యాలయానికి వచ్చి ఏఈ పై ఫిర్యాదు చేయడం జరిగింది. అంతేగాకుండా అక్రమంగా ఏఈ డబ్బులు వసూలు చేసిన వైనాన్ని కూడా వారు విజిలెన్స్ అధికారికి తెలియచేశారు. రైతుల ట్రాన్స్‌ఫారం ఏర్పాటు, కొత్తగా ఏర్పాటు చేసే విద్యుత్ స్తంభాల విషయంలో కూడా ఏఈ అక్రమాలకు పాల్పడ్డారని వారు అధికారులకు తెలిపారు. మండలంలోని నాగరాజుపల్లి, కోలలపూడి, రాజుపాలెం, ద్రోణాదుల, మార్టూరు తదితర గ్రామాల నుంచి బాధితులు విజిలెన్సు అధికారిని కలిశారు. ఈ విచారణలోని అంశాలను ఉన్నత అధికారులకు నివేదికను పంపిస్తానని సంజీవరావు విలేకరులకు తెలిపారు. ఈ విచారణలో డీఈ సురేంద్రబాబు, జేఈ హనుమంతరావు పాల్గొన్నారు.

కుమారుడి ఆచూకీ లేదంటూ ఫిర్యాదు

మార్టూరు, జూలై 29 : నెలరోజుల కిందట కాలేజీకి వెళ్లిన కుమారుడు ఆచూకీ తెలియలేదని గన్నవరపు చెన్న కేశవులు అనే వ్యక్తి సోమవారం మార్టూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ వివరాలను ఏఎస్ఐ మహమ్మద్ బాషా తెలిపారు. తాటివారిపాలెం గ్రామానికి చెందిన చెన్నకేశవులు కుమారుడు శివశంకర్ వైజాగ్‌లోని రఘు ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అతను నెలరోజుల కిందట ఇంటికి వచ్చి వెళ్లాడు. అయితే వైజాగ్ వెళ్లిన తర్వాత తరచూ కుమారునికి ఫోన్ చేయడానికి చెన్నకేశవులు ప్రయత్నించగా కుమారుడు క్లాస్‌లో ఉన్నానని, బిజీగా ఉన్నానని సమాధానం మెసేజ్ రూపంలో సమాధానం వస్తున్నట్లు చెప్పారు. అడపాదడపా ఫోన్‌కు డబ్బులు పంపిస్తున్నానని, వారం రోజుల నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుందన్నారు. వైజాగ్‌లో ఉన్న బంధువులకు ఈ విషయాన్ని చెప్పడంతో వారు కాలేజీకి వెళ్లి విచారించగా నెల రోజుల నుంచి శివశంకర్ కాలేజీకి రావడం లేదని సిబ్బంది చెప్పినట్లు చెప్పారు. దీనిపై ఆందోళన చెందిన చెన్నకేశవులు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు.

మంత్రి స్వామికి వైద్య పరీక్షలు

విశ్రాంతి తీసుకోవాలని సూచించిన వైద్యులు



మంత్రికి స్కానింగ్ తీస్తున్న సిబ్బంది

ఒంగోలు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామికి సోమవారం నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించారు. కొండపి నియోజకవర్గంలోని జరుగుమల్లి మండలం పాలేటిపాడులో ఆదివారం తిరునాళ్ల సందర్భంగా ఎండ్లబండి వద్ద అభిమానులు మంత్రితో ఫొటోలు దిగారు. ఆ సమయంలో డీజే సౌండ్లకు ఎద్దు బెదరడంతో మంత్రి స్వామి కిందపడి పోగా ఎద్దు కాలుతో తొక్కింది. సెక్యూరిటీ అప్రమత్తంతో స్వామికి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఆ ఘటనలో వీపుపై ఎద్దు తొక్కడంతో అక్కడ వత్తిడి పడింది. సోమవారం ఉదయానికి తీవ్రంగా నొప్పులు వచ్చాయి. దీంతో నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో డాక్టర్ స్వామికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రమాదం ఏమీ లేదని తేల్చిన వైద్యులు నాలుగైదు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అయితే మంగళవారం సాంఘిక సంక్షేమం, సచివాలయాల శాఖలపై సీఎం ఉన్నత స్థాయి సమీక్ష చేయనున్నారు. ఈ నేపథ్యంలో వైద్య పరీక్షలు అనంతరం మంత్రి స్వామి అమరావతికి బయలుదేరి వెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ముండ్లమూరు, జూలై 29 : ముండ్లమూరు గ్రామానికి చెందిన ఎస్‌కే ఖాజావలి(60) రోడ్డు ప్రమాదంలో గాయ పడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... ముండ్లమూరుకు చెందిన ఖాజావలి ద్విచక్రవాహనంపై ఆదివారం అద్దంకి వెళ్తుండగా పోలవరం సమీపంలోకి వెళ్లే సరికి దర్శి వైపు వెళ్తున్న పాల ట్యాంకర్ ఢీకొంది. తీవ్ర గాయాలైన ఖాజావలిని కుటుంబ సభ్యులు గుంటూరులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని ఎస్ఐ వీ నాగమల్లేశ్వరరావు సందర్శించి కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సబ్సిడీ దుర్వినియోగం ఆరోపణపై ఏవో సస్పెన్షన్

పర్చూరు, జూలై 29 : సబ్సిడీ శనగల నగదు దుర్వినియోగానికి సంబంధించి పర్చూరు వ్యవసాయాధికారి ఎస్.రామ్మోహన్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. 2022-23 సంవత్సరానికి సంబంధించి జాతీయ ఆహార భద్రతా పథకం (ఎన్ఎఫ్ఎస్ఎం) కింద రైతులకు రాయితీపై శనగ విత్తనాలను పంపిణీ చేశారు. అయితే రూ.7.32లక్షల సబ్సిడీ నగదును సీడ్స్‌కు చెల్లించాల్సి ఉంది. రైతుల వద్ద సేకరించిన నగదును ఏవో చెల్లించకపోవడంపై ఏపీ సీడ్స్ అధికారులు జేడీఏకు ఫిర్యాదు చేశారు. దీనిపై వివరణ కోరుతూ ఏవోకు మూడుసార్లు నోటీసులు ఇచ్చారు. దీనిపై వీపీఏలు విచారించారు. ఈనేపథ్యంలో నగదును తన సొంత ఖర్చులకు వినియోగించుకున్నట్లు ఏవో తెలిపారు. ఏపీ సీడ్స్ ఫిర్యాదుతో కమిషన్ కార్యాలయం నుంచి జేడీఏకు చర్యలకు ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో జేడీఏ ఆదేశాల మేరకు ఏవోను సస్పెండ్ చేస్తూ జిల్లా వ్యవసాయాధికారి ఏడీఏకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

నిజాయితీ చాటుకున్న రైతు



డబ్బులు అందజేస్తున్న బాలయ్య

కురిచేడు, జూలై 29 : కురిచేడు మండలం గంగదొనకొండ గ్రామానికి చెందిన వరికూటి బాలయ్య ఫోన్‌పే నంబరుకు రాజమండ్రికి చెందిన వీరవల్లి జగదీశ్వర ప్రసాద్ పొరబాటున రూ.30,000 పంపించారు. ఆ తరువాత బాలయ్యకు ఫోన్ చేసి పొరబాటు జరిగిందని, తన డబ్బులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బాలయ్య ఈ విషయం కురిచేడు పోలీస్ స్టేషన్‌లో తెలిపారు. జగదీశ్వర ప్రసాద్‌ను కురిచేడు పోలీస్‌స్టేషన్‌కు సోమవారం పిలిపించారు. ఆ మొత్తాన్ని పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు జగదీశ్వరప్రసాద్‌కు అప్పగించారు. తన ఖాతాకు వచ్చిన మొత్తాన్ని నిజాయితీతో అప్పగించిన బాలయ్యను పోలీసులు అభినందించగా రాజమండ్రికి చెందిన జగదీశ్వర ప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు.

కృష్ణమ్మ పరవళ్లతో భరోసా

- జిల్లాలోని అన్నదాతల్లో ఆశలు
- బేసిన్‌లోని ప్రాజెక్టులకు భారీగా వరద
- ఇప్పటికే నిండిన కర్ణాటక రిజర్వాయర్లు
- శ్రీశైలానికి 4.70 లక్షల క్యూసెక్కులు రాక
- మూడు గేట్లు ఎత్తిన డ్యాం అధికారులు
- సాగర్ వైపు పరుగెడుతున్న జలాలు
- ఈ సీజన్ సాగు, తాగునీటికి ఢోకా లేనట్లే!

అన్నదాతలలో ఆశలు చిగురించాయి. ఈ సీజన్ సాగు, తాగునీటికి భరోసా లభించింది. ఏడాది నుంచి తీవ్ర ఇబ్బందులు పడ్డ సాగర్ ఆయకట్టు రైతులకైతే ఖచ్చితంగా మంచి కబురే. కృష్ణా నదిలో వరద పోటెత్తుతోంది. ప్రాజెక్టులు జలాలతో కళకళలాడుతున్నాయి. ఎగువ ప్రాంతంలో కర్ణాటక, మహారాష్ట్రలలో కురుస్తున్న భారీవర్షాలతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. నదికి ఎగువ ప్రాంతంలోని కర్ణాటక, తెలంగాణల్లో ఉన్న ప్రాజెక్టులు ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల ఇప్పటికే నిండటంతో శ్రీశైలానికి భారీగా వరదనీరు వస్తోంది. డ్యాం మూడు గేట్లు ఎత్తడంతో అక్కడి నుంచి కూడా దిగువకు ఉన్న అత్యంత కీలకమైన నాగార్జునసాగర్ డ్యామ్ వైపు ప్రస్తుతం వరద పరుగుపెడుతోంది.



శ్రీశైలం డ్యాం వద్ద విడుదలైన నీటి హోయలు

ఒంగోలు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లావాసులకు ఈ ఏడాది నీటికష్టాలు తప్పాయి. ఎట్టకేలకు కృష్ణా నదికి పైనుంచి వరద నీరు వస్తోంది. కృష్ణా బేసిన్‌లో వారం, పదిరోజులు క్రితం మహారాష్ట్ర కర్ణాటక రాష్ట్రాల్లో భారీవర్షాలు కురిశాయి. అప్పటికే ఆ ప్రాంతంలో కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులలో భారీగానే నీరు ఉండటంతో వస్తున్న వరద నీటిని ఒక్కొక్క ప్రాజెక్టు నుంచి దిగువకు వదులుతున్నారు. అలా రాష్ట్రంలోని శ్రీశైలం ప్రాజెక్టుకు ఈనెల 17న స్వల్పంగా నీరు రావడం ప్రారంభం కాగా నాలుగైదు రోజులుగా వరద పెరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు నీటిమట్టం 885 అడుగులు కాగా నీటి సామర్థ్యం 215 టీఎంసీలు. కాగా వరద నీరు రాకతో గత ఐదు రోజుల్లో దాదాపు 123 టీఎంసీల మేర ప్రాజెక్టులోకి చేరింది. ఇక సోమవారం నాటికి వరద నీటి ప్రవాహం మరింతగా పెరిగింది.

మూడు గేట్లు ఎత్తి..

సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రాజెక్టులోకి దాదాపు 4.17 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా ఆ సమయానికి ప్రాజెక్టు నీటిమట్టం 879.90 అడుగులకు చేరింది. దాదాపు 180 టీఎంసీలకు నీరు నిల్వ చేరింది. దీంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమయ్యారు. భారీగా వరద నీరు వస్తున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం ప్రాజెక్టు మూడు గేట్లను అధికారులు ఎత్తి సుమారు 81వేల క్యూసెక్కుల నీరు దిగువకు వదిలారు. ఎగువ నుంచి నీరు రాక పెరిగే కొద్ది మరి కొన్ని గేట్లను మంగళవారం ఎత్తే అవకాశం ఉంది. శ్రీశైలం గేట్లు ఎత్తి 81వేల క్యూసెక్కులను నీరు వదలగా అప్పటికే కుడి, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాల ద్వారా మరో 80వేల క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. అలా ప్రస్తుతం శ్రీశైలం నుంచి సోమవారం సాయంత్రం ఇంచుమించు 1.61లక్షల క్యూసెక్కుల నీరు సాగర్ డ్యామ్ వైపు పరుగులు తీస్తున్నది. ఆ నీరు రెండు రోజుల్లో సాగర్ డ్యామ్‌లోకి చేరే అవకాశం ఉంది.


బుధవారం ఉదయానికి సాగర్‌కు..

ఇక సాగర్ డ్యామ్ పరిస్థితిని పరిశీలిస్తే 590 అడుగుల నీటిమట్టం కాగా 312 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న సాగర్ డ్యామ్‌లో ప్రస్తుతం నీటిమట్టం 512 అడుగులు ఉండగా సుమారు 136 టీఎంసీలు నీరు ఉంది. అలాగే 55 వేల క్యూసెక్కుల నీరు ప్రస్తుతం డ్యామ్‌లోకి వస్తోంది. శ్రీశైలం నుంచి సోమవారం సాయంత్రం వరద నీరు బుధవారం ఉదయానికి డ్యామ్‌కు చేరే అవకాశం ఉండగా అప్పటి నుంచి సాగర్ డ్యామ్ నీటి నిల్వ క్రమంగా పెరుగుతుంది.ప్రస్తుతం కృష్ణా ఎగువ ప్రాంతంలోని కర్ణాటక, తెలంగాణ ప్రాజెక్టులో నీటి నిల్వ, వాటిలోకి వస్తున్న వరద, అక్కడి నుంచి దిగువకు నీటి విడుదల పరిశీలిస్తే శ్రీశైలం ప్రాజెక్టు మంగళవారానికే నిండనుంది. ఆ తర్వాత మరింత భారీగా సాగర్ డ్యామ్‌కు శ్రీశైలం నుంచి వరదనీరు అధికారులు వదులుతారు.

ఈ సీజన్‌కు భరోసా

వస్తున్న వరదను పరిశీలిస్తే రానున్న వారంరోజుల్లో సాగర్‌కు భారీగా వరదనీరు వచ్చి చేరి డ్యామ్ నిండే పరిస్థితి కనిపిస్తోంది. దాని వల్ల జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు సాగునీరు, ప్రజలకు తాగునీరు ఈ సీజన్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా అందే అవకాశం ఉంది. గత ఏడాది కృష్ణా బేసిన్‌లో వర్షాలు లేక ప్రాజెక్టుల్లోకి నీరు రాక డ్యామ్‌ల నుంచి నీటి విడుదల జరగలేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో సాగర్ ఆయకట్టులోని 4.42 లక్షల ఎకరాలకు సాగునీరు అందక రైతులు నష్టపోయారు. అంతేకాక తాగునీటికి సైతం నీరు సరిపడారాక ప్రజానీకం అవస్థలు పడ్డారు ప్రస్తుతం కూడా జిల్లాలో తాగునీటి అవసరాలకు సాగర్ నీరు అరకొరగానే వస్తోంది. అయితే ప్రస్తుతం కృష్ణమ్మ పరవళ్ల జిల్లాలోని ప్రజలకు తాగునీరు, ఆయకట్టుకు ఈ సీజన్ సాగునీరుపై పూర్తిభరోసా కనిపిస్తోంది.

వసూల్ రాజాలకు బ్రేక్..!



- జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో ఐడీ పార్టీలను రద్దు చేస్తూ ఎస్పీ దామోదర్ ఉత్తర్వులు
- పోలీసు శాఖలో ఆ విభాగానికి డిమాండ్
- చీమకుర్తి పోలీసు స్టేషన్‌లో పంచాయితీ
- ఆ పోస్టుల్లో చేర్చుకోవాలని సిఫార్సులు

ఒంగోలు(క్రైం),జూలై 29: పోలీసు శాఖలో యూనిఫామ్ వేయకుండా చేసే విధులకు డిమాండ్ ఎక్కువ. అందులో ఐడీ పార్టీ అంటే భలే మోజు. పోలీసు స్టేషన్లలో ఎలాంటి బాధ్యతలు ఉండవు, బందోబస్తులకు అస్సలు వెళ్లరు. స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఎస్సై, సీఐ ఎవరున్నా సరే వారి వెంట నిత్యం కారులో తిరుగుతూ ఉండవచ్చు. అదేసమయంలో ఎస్సైలు సీఐలు యూనిఫామ్‌లో ఉన్నప్పటికి ఐడీ పార్టీ కానిస్టేబుళ్లు మాత్రం మఫ్టీలో ప్రత్యక్షమవుతారు. అంతేకాదు స్టేషన్ మొత్తం తమేదే అన్నట్లు ప్రవర్తిస్తారు. అక్కడ పెత్తనం చెలాయిస్తుంటారు. మాట వినని సిబ్బందిపై ఎస్సైలకు చెప్పి పనిష్‌మెంట్ కూడా ఇప్పిస్తుంటారు. మరోకోణం ఏమిటంటే వసూల్ రాజాలు కూడా వారే. స్టేషన్లకు నెల మామూళ్ల నుంచి ఇతర కేసులలో వచ్చే మొత్తాలు కూడా వారి ద్వారానే అధికారులకు చేరుతుందని సమాచారం. ఇలాంటి పనులు చేసేందుకు కొంతమంది పోటీలు పడుతుంటారు. వారి పని కేవలం వసూలు చేయడం అవసరమైన చోట ఖర్చు పెట్టడంతోపాటు మిగిలిన లెక్క అధికారికి అప్పగించడమే. అంతా అమ్యామ్యా వ్యవహారం నేపథ్యంలో వారు ఇచ్చిందే లెక్క కావడంతో కాస్తోకూస్తో వెనుకేసుకునే అవకాశం ఉంటుంది. అందుకోసం ఐడీ పార్టీలోకి వెళ్లేందుకు పెద్దపెద్ద వారి సిఫార్సులు చేయించుకుంటారు. ఇందుకు చీమకుర్తి ఘటన నిదర్శనం. ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ పురిలో ఉన్న పోలీసు స్టేషన్‌లో ఇలాంటి వసూల్ రాజా పోస్టుకు ఓ కానిస్టేబుల్ ఏకంగా పొరుగు జిల్లాకు చెందిన రాష్ట్రంలో కీలకంగా ఉన్న ప్రజాప్రతినిధి ద్వారా సిఫార్సు చేయించుకోవడం చర్చకు దారితీసింది. దీంతో పోలీసు స్టేషన్‌లో పంచాయితీ జరిగింది. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేసి జిల్లాలో ఉన్న ఐడీ పార్టీ సిబ్బంది రోజు వారి విధులకు హాజరు కావాలని ఆదేశాలు జారీచేశారు.



ఎస్పీ దామోదర్

ఐడీ పార్టీలు అంటే..

గతంలో పోలీసు స్టేషన్లలో ఐడీ పార్టీలు అంటే అత్యంత గోప్యమైన సమచారాన్ని తెలుసుకుని ఎప్పటికప్పుడు అధికారులకు చేరవేస్తుంటారు. ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీలు, నేరస్థులు, అసాంఘిక శక్తుల వివరాలు వారు చేసే కుట్రలు ముందుగా పసిగట్టి శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా వాటిని భగ్నం చేస్తుంటారు. ప్రజలతో మమేకమై క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలు, అంతర్గత కలహాల గురించి సమాచారం సేకరిస్తారు. అధికారులను అప్రమత్తం చేస్తారు. అయితే అందుకు విరుద్ధంగా ప్రస్తుతం ఐడీ పార్టీలు వసూల్ రాజాలుగా మారారు. బయట సమాచార సేకరణ వదిలేసి నేరుగా ఎస్సై, సీఐలతో వ్యవహారాలు మాత్రమే చేస్తున్నారు. తమకు ఇబ్బంది లేకుండా ఉండటంతో అధికారులు కూడా ఐడీ పార్టీలను పోత్సహిస్తూ లాభపడుతున్నారు.

చీమకుర్తిలో ఇదీ పంచాయితీ

చీమకుర్తి పోలీసు స్టేషన్‌లో ఐడీ పార్టీ విషయంలో పంచాయితీ జరిగింది. ఆర్మ్‌డ్ రిజర్వుడు నుంచి కన్వర్షన్‌తో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వ్యక్తి ఐడీ పార్టీ కానిస్టేబుల్ కోసం పోటీ పడ్డారు. పొరుగు జిల్లాకు చెందిన కీలక ప్రజాప్రతినిధి సిఫారుసు మేరకు విధులు నిర్వహించేందుకు సిద్ధమయ్యాడు. ఈ విషయం బయటకు పొక్కింది. దీంతో స్థానిక రాజకీయ నాయకులు జోక్యం చేసుకున్నారు. ఇలాంటి సిఫార్సులు వస్తుంటే తామెందుకు ఇక్కడ అంటు స్టేషన్‌లో పంచాయితీ జరిగింది. అయినా వసూళ్ల కోసం కానిస్టేబుల్ ఏమిటి అంటూ స్థానిక నాయకులు ప్రశ్నించారు. ఈ వ్యవహారం మొత్తం పోలీసు బాస్‌కు చేరింది. దీంతో ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ఐడీ పార్టీలు రద్దు : ఎస్పీ

జిల్లాలో పోలీసు స్టేషన్లలో ఐడీ పార్టీలు రద్దుచేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలు జారీచేశారు. చీమకుర్తి స్టేషన్‌లో జరిగిన పంచాయితీ పోలీస్ శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగే విధంగా ఉంది. ఈ మేరకు సోమవారం ఎస్పీ, పోలీసు అధికారులకు మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. ఐడీ పార్టీలలో ఉన్న వారు అంతా రోజు వారి విధులకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. దీంతో ఈ విషయం జిల్లా పోలీసు శాఖలో చర్చనీయంశంగా మారింది.

వైసీపీ నేత విల్లాల్లో అవినీతి బీటలు..!

- మాజీ మంత్రి బాలినేని వియ్యంకుడు ఫ్లాట్లలో తనిఖీలు
- నిర్మాణ విషయంలో వచ్చిన ఆరోపణలపై కదిలిన యంత్రాంగం
- రెవెన్యూ మైనింగ్, ఎస్ఈబీ నేతృత్వంలో రికార్డులు పరిశీలన

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 29 : మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు కుండా భాస్కర్‌రెడ్డి విల్లాలు వివాదాల్లో చిక్కుకున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఒంగోలు సమీపంలో నిర్మాణాలు చేపట్టిన శ్రీకరి ఎంపైర్ కట్టడాలపై గత రెండు సంవత్సరాలుగా అనేక ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వ నిధులతో యరజర్ల కొండను తవ్వి ఆ మట్టిని అనుమతుల్లేకుండా అడ్డగోలుగా విల్లాలకు తరలించారనే ఫిర్యాదులతోపాటు, ఇసుక అక్రమ వినియోగం, అలాగే సమీప గ్రామానికి చెందిన రైతుల భూములను బలవంతంగా రాయించుకున్నారనే ఆరోపణలు ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ దుమారాన్ని రేపాయి. ఇదిలాఉండగా బాలినేని వియ్యకుండి విల్లాల్లో అంతా అడ్డగోలు వ్యవహారమే నడిచిందంటూ టీడీపీ నేతలు కూడా ధ్వజమెత్తారు. మరోవైపు ఆర్య వైశ్య నాయకుడు సుబ్బారావుగుప్తా ఇటీవల విల్లాల సమీపంలో అవినీతిపై అక్రమాలు తేల్చాలని నిరసనకు దిగిన విషయం తెలిసిందే.

ఎట్టకేలకు అధికారుల దాడులు

కాగా గడిచిన రెండు నెలల క్రితం వరకు వైసీపీ అధికారంలో ఉండగా, విల్లాల వైపు కన్నెత్తి చూడని యంత్రాంగం సోమవారం సాయంత్రం ఎట్టకేలకు కదలింది. నిర్మాణంలో ఉన్న విల్లాల్లో మైనింగ్, రెవెన్యూ, ఎస్ఈబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సుమారు రెండు గంటలపాటు రికార్డులు పరిశీలనతోపాటు, నిర్మాణం కోసం ఉపయోగించిన ఇసుక, మట్టి, ఇతర మెటీరియల్‌తోపాటు, ఇసుక డంప్‌లు, ప్రారంభం నుంచి ఇప్పటివరకు జరిగిన పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించినట్లు సమాచారం. అయితే బృందంలో ఉన్న అధికారులను తనిఖీలకు సంబంధించిన అంశాలపై వివరణ కోరగా, తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు. అయితే కలెక్టర్ ఆదేశాల మేరకు తాము భౌతిక పరిశీలనకు విచ్చేసినట్లు మాత్రమే వెల్లడించారు. మొత్తంగా మూడేళ్లుగా శ్రీకర అంపైర్ విల్లాలు నిర్మాణాలకు సంబంధించి భారీగానే విమర్శలు, ఆరోపణలు, అవినీతి కట్టడాలంటూ ఫిర్యాదులు అందాయి. కాగా సోమవారం అధికారులు చేసిన తనిఖీలపై అటు రాజకీయవర్గాల్లోనూ, ఇటు వైసీపీ శ్రేణుల్లోనూ కలవరం మొదలైంది.

తప్పు ఎవరిది..నిజం నిగ్గు తేల్చాలి..!

- కాలం తీరిన మందులున్నాయని డాక్టర్ బాలరాజు ఫార్మసిస్టుపై ఆరోపణ
- డాక్టర్ ఉద్దేశపూర్వకంగా వేరే ఔషధాలను చూపించారంటూ ప్రత్యారోపణ
- వైద్యుడిపై ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వెళ్లిన ఫార్మసిస్టు, మరికొందరు
- డీఎంహెచ్‌వో ఆదేశాలతో మాత్రలను పరిశీలించిన ఇద్దరు అధికారులు



మందులను పరిశీలిస్తున్న సభ్యులు

వేటపాలెం (చీరాల), జూలై 29 : వేటపాలెం పీహెచ్‌సీలో వైద్యుడు బాలరాజు, ఫార్మసిస్టు మధ్య నెలకొన్న వివాదం తార స్థాయికి చేరింది. ఈ క్రమంలో సోమవారం తాను ఫార్మసిస్టు రూములో మందులను పరిశీలించగా కాలం చెల్లిన మందులు ఉన్నాయని, గతంలో కూడా పలుమార్లు తాను గమనించానని డాక్టర్ బాలరాజు విలేకరుల సమావేశం నిర్వహించి వెల్లడించారు. తాను సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన సమయంలో డాక్టర్ బాలరాజు తన తండ్రితో కలసి నా రూంలో నా దగ్గరలేని మందులు కొన్ని పెట్టి, కొందరితో కలసి వెళ్లి ఉద్దేశ పూర్వకంగా తనపై నిందలు వేస్తూ ఒక సిరప్‌ను చూపించి తనపై నిందలు వేస్తున్నారని ఫార్మసిస్టు వెంకటప్రసాద్ ఓ వీడియో విడుదల చేశారు. ఇదిలావుండగా డాక్టర్, సిబ్బంది ఆరోపణ, ప్రత్యారోపణల నేపథ్యంలో తప్పు ఎవరిదో నిగ్గు తేల్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆసుపత్రిలో ఇంత జరుగుతుంటే ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాలం చెల్లిన మందులు ఇచ్చి ఏదన్నా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని మండి పడుతున్నారు. ఈ క్రమంలో డీఎంహెచ్‌వో విజయమ్మ ఆదేశాల మేరకు డాక్టర్ భూషణరావు, ఫార్మసిస్టు సూపర్‌వైజర్ ఇద్దరూ సోమవారం సాయంత్రం వేటపాలెం పీహెచ్‌సీలోని ఫార్మసిస్టు గదిలో ఉన్న మందులను పరిశీలించారు. వాటికి సంబంధించిన నివేదికను డీఎంహెచ్‌వోకు నివేదిస్తామని తెలిపారు.

నేడు సమస్యను పూర్తిగా పరిష్కరిస్తాం - డీఎంహెచ్‌వో విజయమ్మ

కాలం చెల్లిన మందులను ఎవరు కూడా పేషెంట్లకు ఇవ్వరు. అయితే అక్కడ వైద్యుడు, ఇతర సిబ్బంది మధ్య వివాదం దీర్ఘకాలంగా నెలకొన్న విషయం బహిరంగ రహస్యమే. ఏదేమైనా సమస్యను మంగళవారం పరిష్కరిస్తాం. మందుల తనిఖీకి వెళ్లిన ఇద్దరు అధికారులకు వివరాలు తెలిపేందుకు ఇతర వైద్య సిబ్బంది అందుబాటులో లేరు. వారంతా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చారు. అన్ని కోణాల్లో విచారించి, వాస్తవాలను పరిగణలోకి తీసుకుని సమస్యను పరిష్కరిస్తాం.

లిక్కర్ పరవళ్లు

- ఆగని సారా, గంజాయి వినియోగం
- జగన్ బ్రాండ్లను ఆపాలని మద్యం ప్రియుల డిమాండ్
- రెస్టారెంట్, బార్‌లలో అధిక ధరలకు విక్రయాలు
- పట్టించుకోని అధికారులు

చీరాల, జూలై 29 : ఎన్‌డీపీ (నాన్ డ్యూటీ పెయిడ్) లిక్కర్ చీరాల నియోజకవర్గంలో, ప్రధానంగా తీరప్రాంతంలో పరవళ్లు తొక్కుతోంది. నాటుసారా, గంజాయి వినియోగం కొనసాగుతూనే ఉన్నాయి. రెస్టారెంట్ అండ్ బార్లలో నిబంధనలకు విరుద్ధంగా మద్యంను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. లూజ్ సేల్స్‌లో చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వీటిపై చర్యలు చేపట్టాల్సిన సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఒక వైపు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోం మినిస్టర్ వంగలపూడి అనితలు నార్కోటిక్స్ వినియోగంతో వైసీపీ పాలనలో నెలకొన్న పరిణామాలపై పూర్తిస్థాయిలో ఉక్కుపాదం మోసేందుకు కసరత్తు చేస్తున్నారు. నిర్దిష్టంగా సంబంధిత అధికారులకు కూడా ఆదేశాలకు జారీ చేసిన విషయం తెలిసిందే. క్షేత్రస్థాయిలో మార్పు రాకుండా సత్ఫలితాలు రావని పలువురు అంటున్నారు.

ఆగని ఎన్‌డీపీ లిక్కర్ దిగుమతి

ఎన్‌డీపీ లిక్కర్ దిగుమతి జరుగుతూనే ఉంది. గతంలో గోవా, కర్నాటక, తెలంగాణ నుంచి దిగుమతయ్యే ఎన్‌డీపీ లిక్కర్‌పై పోలీస్ ఉన్నతాధికారులకు అందిన సమాచారంతో పోలీస్, ఎస్‌ఈబీ, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన దాడులలో భారీగా పొరుగు మద్యం ఒకటికి పలుమార్లు పట్టుబడింది. అయితే ఆ తరువాత అధికారుల మధ్య సమన్వయం లోపించింది. అందుకు పలు రకాల కారణాలనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ క్రమంలో ఎన్‌డీపీ దిగుమతులపై పెద్దగా దృష్టి కేంద్రీకరించటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జగన్ బ్రాండ్లు ఆపండి

వైసీపీ హయాంలో జగన్ బ్రాండ్లుగా పేరుపడ్డ నాసికరం మద్యంను వెంటనే ఆపాలని మద్యపాన ప్రియులు ముక్తకంఠంతో కోరుతున్నారు. కూటమి ప్రభుత్వ గెలుపులో తమ భాగస్వామ్యం కూడా గణనీయంగా ఉందని, అయితే ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా జగన్ బ్రాండ్లను తాగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర ఎక్కువ, నాణ్యత సున్నా, దీంతో తాము నాటుసారా వినియోగానికి మరలామని కొందరు చెప్తున్నారు. వెంటనే నాణ్యమైన మద్యం సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.

సిండికేట్‌గా మారిన బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు

మద్యం అధిక ధరలకు విక్రయాలు

బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహకులు సిండికేట్‌గా మారారు. సాధారణంగా వైన్ షాపుల కన్నా నిబంధనల మేరకు మద్యంను అధిక ధరలకు విక్రయించుకునే వెసులుబాటు ఉంది. అయితే సిండికేట్‌గా మారి నిబంధనలను


పట్టుబడ్డ అక్రమ మద్యం, నిందితుడితో అధికారులు (ఫైల్)

తుంగలో తొక్కుతూ ఇష్టారీతిన అదనపు ధరలు వసూలు చేస్తున్నారు. దీంతో తమకు తీరని అన్యాయం జరుగుతోందని మద్యం సేవించేవారు వాపోతున్నారు.

గంజాయి వినియోగంతో లోపిస్తున్న విచక్షణ..!

గతంలో గంజాయి అంటే ఎక్కడో ఒకరు, అర సాధువులు లాంటి వారు సేవించేవారు. అది పరిమితుల్లో కన్పించేవారు. అయితే ప్రస్తుతం గంజాయి వినియోగం వైపు కొందరు యువకులు ఆకర్షితులవుతున్నారు. మొదట ఫ్యాషన్ అని తరువాత మానలేకపోతున్నామనే స్థితికి చేరుతున్నారు. విచక్షణ కోల్పోతున్నారు. ఇది ప్రమాదకర పరిణామం. దీన్ని నియంత్రించడం అనేది కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదు. విద్యా సంస్థలు, తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. తీరప్రాంతంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు గంజాయి సేవించి మోటారు సైకిల్ పందేలు పేరుతో ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. ఆ సమయంలో అటుగా రాకపోకలు సాగించే వాహన చోదకులు కూడా ప్రమాదంలోకి వెళ్లే పరిస్థితి. ఈ నేపథ్యంలో తగిన చర్యలతో ప్రభుత్వ ప్రతిష్టను ఇనుమడింపజేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.


రాత పుస్తకాలను అందజేస్తున్న జ్యోత్స్న

దివ్యాంగ విద్యార్థుల సంఖ్య పెంచాలి

చినగంజాం, జూలై 29 : భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల సంఖ్యను పెంచాలని జిల్లా ఐఈ కోఆర్డినేటర్ ఎం.జోత్స్న ఐఆర్టీలను ఆదేశించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. భవిత కేంద్ర నిర్వహణ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఐఈ కోఆర్డినేటర్ అన్నారు. కేంద్ర నిర్వహణ రికార్డులను ఆమె పరిశీలించి, ఐఆర్టీలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం భవిత కేంద్రంలోని విద్యార్థులకు దాతలు భారత్ నిర్మాణ్ వలంటీర్ గోవిందస్వామి, టి.ముసలయ్య అందజేసిన రాత పుస్తకాలు, పెన్సిళ్లు, స్వీట్స్‌లను ఆమె పంపిణీ చేశారు. ఐఈ కోఆర్డినేటర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేవీ నాగజ్యోతి, అసిస్టెంట్ జీసీడీవో చారులతలు స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రసూల్ ఇన్సాబేగం, ఐఆర్టీలు తాళ్లూరి బాలకృష్ణ, డి.నాగార్జున, ఆయా రాజేశ్వరి, సీహెచ్ కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

పాడి రైతులకు ఉచిత పశుగ్రాస విత్తనాలు

బల్లికురవ, జూలై 29 : పాడి రైతులకు పశు సంవర్థక శాఖ ద్వారా ఒక్కో రైతుకు 3 కేజీల గడ్డి జొన్న విత్తనాలను అందిస్తుందని పశువైద్యాధికారులు మహేశ్వరరావు, పావని తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ బల్లికురవ, అంబడిపూడి, ఉప్పుమాగులూరు గ్రామాల పశువైద్యశాలల పరిధిలో ఉన్న గ్రామాల పాడి రైతులకు ఉచితంగా గడ్డి విత్తనాలను అందిస్తామని రైతులు ఆధార్ కార్డు, ఫోను నెంబర్, పాల కేంద్రానికి పాలు పోసే కార్డును తీసుకొని వైద్యశాలలను సంప్రదించాలని వారు కోరారు.



ఇన్వర్టర్లను అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

గురుకులాలకు ఇన్వర్టర్ల అందజేత

అద్దంకిటౌన్, జూలై 29 : ప్రభుత్వ పాఠశాలలో వసతుల కల్పనలో భాగంగా క్యూబ్ హైవేస్ ఆధ్వర్యంలో క్యూబ్ రూట్ ఫౌండేషన్‌కు చెందిన నామ్ రోడ్డు ప్రతినిధులు సోమవారం గురుకుల పాఠశాలలకు ఇన్వర్టర్లను అందజేశారు. అద్దంకిలోని హైవే పక్కనే ఉన్న డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలకు క్యూబ్ హైవేస్ వారు పాఠశాలకు అవసరమైన 300 ఏఎన్‌హెచ్ఎస్ ఇన్వర్టర్స్‌ను అందజేశారు. రాష్ట్రీయ రహదారికి అనుకున్న ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన వసతులు కల్పిస్తున్నట్లు క్యూబ్ రూట్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.దుర్గా గాయత్రి, ఉపాధ్యాయులు, సిబ్బంది ఫౌండేషన్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేశారు.

హెపటైటీస్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న మోహనరావు

అద్దంకిటౌన్, జూలై 29 : హెపటైటీస్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు అన్నారు. సోమవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూవాలజీ, కామర్స్ విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ హెపటైటీస్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ కలుషిత నీరు, రక్తం ద్వారా కాలేయం దెబ్బతిని పసికర్లు, లివర్‌వాపు వంటి వ్యాధులు వస్తాయన్నారు. హెపటైటీస్ వ్యాధి వచ్చిన వారి నుంచి సంపర్కం ద్వారా కూడా ఇతరకులకు వ్యాపిస్తతందన్నారు. మత్తు, మద్యం ద్వారాను ఈ వ్యాధి ప్రబలుతుందన్నారు. విద్యార్థులు తమ పరిసరాలను, నీటిని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ హనుమంతరాజు, బి. అశోక్‌కుమార్, ఏ. శిఖామణి, గంగాధర్, నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

చేతిబోరు బాగుచేయండి..!

- మునిసిపల్ అధికారులకు వినతి
- కొద్ది రోజులకే ఆనవాళ్లు మాయం
- నర్రావారిపాలెంలో సంఘటన

అద్దంకిటౌన్, జూలై 29 : ఎన్నో ఏళ్లగా చేతి బోరు నీళ్లతో కాలం గడుపుకుంటున్నాం. మూడు సంవత్సరాల నుంచి చేతి బోరు మరమ్మతులకు గురైంది. మరమ్మతులు చేసి నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందించారు. అంతే కొన్ని రోజులు గడిచే సరికి ఆ చేతి బోరు ఆనవాళ్లు కూడా


నర్రావారిపాలెంలో గతంలో ఉన్న చేతి బోరు


మాయమైన బోరు

లేకుండా చేశారు. ఇది అద్దంకిలోని నర్రావారిపాలెం బట్టీ బడికి వెళ్లే దారిలో జరిగింది. కాలనీ వాసులు చేతి బోరు ద్వారా తమ నీటి అవసరాలు తీర్చుకునేవారు. అయితే ఆ చేతిబోరు మూడు సంవత్సరాలుగా మరమ్మతులకు గురైందని, దానిని బాగు చేయించి ఉపయోగంలోకి తేవాలని మహిళలు కొందరు మున్సిపల్ అధికారులు వినతిపత్రం అందించారు. చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ప్రస్తుతం ఆ చేతి బోరు ఆనావాళ్లు కూడా లేకుండా చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు చేతిబోరును కింద వరకు మిషన్‌తో కట్ చేయించి దినిపై రాయిని పెట్టారు. దీనిపై మహిళలు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లల్లో నీటి అవసరాలకు ఉపయోగపడే చేతిబోరును ఇలా చేయడం ఏమిటని, వెంటనే సంబంధిత మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని చేతిబోరును ఏర్పాటు చేయకుంటే ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

గీత కార్మికుడి పైకి దూసుకెళ్లిన ఆటో

చీరాలటౌన్, జూలై 29 : గీత కార్మికుడి పైకి ఆటో దుసూకెళ్లడంతో క్షతగాత్రుడికి పలు రక్త గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే వేటపాలెం మండలం అక్కాయిపాలెంకు చెందిన ఉప్పాల వెంకటేశ్వర్లు గీత కార్మికుడు. ఇతను కుటుంబ అవసరాల నిమిత్తం సోమవారం ఉదయం కూరగాయాలు తెచ్చేందుకు ద్విచక్ర వాహనంపై జాండ్రపేట వెళ్లారు. ఆ ప్రాంతంలోని శివాలయం సమీపంలో గుర్తుతెలియని ఆటో వేగంగా పైకి దూసుకు వచ్చింది. దీంతో ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడగా, పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. 108లో చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈమేరకు అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.


చికిత్స పొందుతున్న కార్మికుడు

ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలి

కలెక్టర్ వెంకటమురళి

చీరాల, జూలై 29 : ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అధికారులు పూర్తిస్థాయిలో అరికట్టాలని కలెక్టర్ జే వెంకటమురళి హెచ్చరించారు. ఆగని ఇసుక అక్రమ రవాణా అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం ప్రచురితమైంది. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకట మురళి అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుకను ఇష్టానుసారంగా తవ్వుకుని వెళ్తుంటే అధికారులు తమకేమీ పట్టనట్లు చూస్తూ ఊరుకుంటారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని కొనసాగించాలన్నారు. దళారీల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో ప్రత్యేక కమిటీలు నియమిస్తామన్నారు. నియమించిన కమిటీలు క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తదుపరి ఇచ్చే నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకట మురళి స్పష్టం చేశారు.

పాసుపుస్తకాలపై రాజముద్ర

మంత్రి గొట్టిపాటి హర్షం



అద్దంకి, జూలై 29 : రాజముద్రతో భూయజమానులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకోవడంపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు.ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి పట్టాదారు పాసుపుస్తకంపై రాజముద్ర వేసి ఇస్తామని చెప్పిన మాటకు కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జగన్‌రెడ్డి పట్టాదారు పాసుపుకాలపై తన బొమ్మను ముద్రించుకున్నారు. ఇది జగన్‌రెడ్డి ప్రచార పిచ్చికి పరాకాష్ట అన్నారు. దీనికి రూ.15కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారన్నారు. పొలాల సరిహద్దు రాళ్లపై తన బొమ్మను ముద్రించి జగన్‌రెడ్డి రూ.700కోట్లు ప్రజాధనం వృథా చేశారన్నారు. ఈ నిధులు సరిగ్గా వినియోగించుకొని ఉంటే రాష్ట్రంలో ఏదో ఒక ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటు లోకి వచ్చి ఉండేదన్నారు. చంద్రబాబు నాయకత్వంలో ఏర్పాటు అయిన ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, గతంలో వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను పోల్చి చూస్తే ప్రజాస్వామ్యానికి, నియంతృత్వానికి మధ్య ఉన్న తేడా స్పష్టంగా కనిపిస్తుందని రవికుమార్ అన్నారు.

సోలార్ పంప్‌సెట్ ప్యానల్స్ చోరీ


నాగులపాడులో చోరీకి గురైన సోలార్ పంప్‌సెట్ ప్యానల్స్

అద్దంకి, జూలై 29 : మండలంలోని నాగులపాడు పొలాల్లో వ్యసాయ సోలార్ పంప్‌సెట్ ప్యానల్స్ చోరికి గురయ్యాయి. స్థానికులు తెలిపిన విరాల మేరకు అడుసుమల్లి భూషయ్యకు చెందిన పొలంలో రెండు సోలార్ వ్యవసాయ మోటార్‌లకు సంబంధించి ప్యానల్స్ ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తు తెలియని వ్యక్తులు మూడు చక్రాల ఆటోలో పొలం లోకి వచ్చి రెండు మోటార్‌లకు సంబంధించిన ప్యానెల్స్ దొంగలించుకొని తీసుకుపోయారు. అప్పటికే వర్షపు జల్లులు పడి ఉండడంతో ఆటో వెళ్లిన జాడ స్పష్టంగా కనిపిస్తోంది. ఆటో నామ్ రోడ్డుకు వెళ్లినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. చోరీకి గురైన సోలార్ ప్యానల్స్ ఖరీదు బహిరంగ మార్కెట్‌లో సుమారు మూడు, నాలుగు లక్షల రూపాయల వరకు ఉంటుందని అంచనా. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై రైతులకు బిగించిన సోలార్ ప్యానల్స్‌ను దొంగలు దొంగలించుకు పోయి ఒక్కొక్కటి రూ.60 నుంచి రూ.70 వేలకు అమ్ముకుంటున్నారు. తరచూ చోరీలు జరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సాయిప్రసాద్

అంబడిపూడిలో వైద్య శిబిరం

బల్లికురవ, జూలై 29 : పక్షం రోజుల నుంచి విష జ్వరాలు, చికున్ గున్యాతో బాధపడుతున్న అంబడిపూడి గ్రామంలో డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు సోమవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన జనరల్ ఫిజీషియన్ వైద్యాధికారి సాయిప్రసాద్ పర్యవేక్షణలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ జ్వరాలతో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా మందులను వాడాలన్నారు. అలానే కాచి చల్లార్చిన నీటిని సేవించాలన్నారు. నొప్పులు కూడా తగ్గుతాయని ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. ఇంటి పరిసరాలలో దోమ తిరగకుండా మురుగు నిల్వలు లేకుండా చేసుకోవాలన్నారు. గ్రామంలో జ్వరాలు అదుపులోకి వచ్చే వరకూ ప్రతి రోజు వైద్య శిబిరం అందుబాటులో ఉంటుందన్నారు. ఈసందర్భంగా పలువురికి రక్త నమునాల పరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు కొందరు వైద్య శిబిరంతో పాటు శానిటేషన్ పనులు కూ డా ప్రతి రోజు జరిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ శిబిరంలో వైద్యాధికారులు రమీజ్, రవితేజ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తుల దాడి

ఒకరికి తీవ్రంగా, ఇద్దరికి స్వల్పంగా గాయాలు

చీరాలటౌన్, జూలై 29 : గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటనలో పలువురు గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం రాత్రి వేటపాలెం వద్ద జాతీయ రహదారిలోని పెట్రోల్ బంకు వద్ద చోటుచేసుకుంది. అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేటపాలెంకు చెందిన గుమ్మడి చైతన్య ఓ రిసార్ట్స్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఈక్రమంలో రాత్రి సమయంలో విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై మిత్రుడు పసుపులేటి నాగార్జునతో కలిసి పెట్రోల్ బంకులో ఆయిల్ కొట్టించుకుని నగదును ఫోన్ పే చేస్తుండగా గుర్తుతెలియని సుమారు 10 మంది అకస్మాత్తుగా వచ్చారు. వీరి పట్ల దురుసుగా ప్రవర్తించారు. ఈక్రమంలోనే ఇద్దరిని, పక్కనే ఉన్న జర్నలిస్ట్ అశోక్‌ను దాడి చేసి గాయపరిచారు. దీంతో చైతన్యకు తీవ్రంగా, మిగిలిన వారికి స్వల్పంగా గాయాలయ్యాయి. దీంతో బాధితులు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు వివరాలు నమోదు చేసుకుని పెట్రోల్ బంకులో సీసీ కెమెరా ఫుటేజీ ఆధారాలను సేకరిస్తున్నారు.

పాఠశాలల్లో సామూహిక భోజనాలు

అద్దంకిటౌన్, జూలై 29 : అద్దంకి పట్టణంలోని సత్రం బడిలో సోమవారం శిక్షా సప్తాహ్ 2020 కార్యక్రమంలో భాగంగా సామూహిక శుభ దిన్ భోజన్ కార్యక్రమాన్ని అధికారులు విద్యార్థులతో కలిసి నిర్వహించారు. హెచ్ఎం ఇట్టా రామారావు అధ్యక్షతన జరిగిన సామూహిక భోజన కార్యక్రమంలో ఎంఈవో బి. సుధాకరరావు, 12వ వార్డు కౌన్సిలర్ అత్తులూరి రమేష్‌బాబు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కాశీలక్ష్మీ, పూర్వ విద్యార్థులు చామర్తి మల్లికార్జునరావు, మస్తాన్, తల్లిదండ్రు భోజనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేదవతి, కొండమ్మ, జగన్నాథం బాబురావు, ధనలక్ష్మి, జయకుమారి, స్వర్ణత, సిఆర్‌పిలు పుణ్యవతి, రమేష్, రామకృష్ణ, శంకరరావు, గురవయ్య, ఐఈఆర్‌టీలు శ్రీనివాస్, యోనా పాల్గొన్నారు. బొమ్మనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో జరిగిన సామూహిక భోజన కార్యక్రమంలో ఎంఈవో 1 డి. గంగాధరరావు విద్యార్థులతో కలిసి సామూహిక భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నూజెళ్లపల్లి పాఠశాలలో ప్రత్యేక తినుబండారాలతో భోజనం చేస్తున్న విద్యార్థులు

పంగులూరు, జూలై 29 : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల్లో సోమవారం తిథి ప్రత్యేక భోజన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. బాల బాలికలకు దాతలు సమకూర్చిన ప్రత్యేక పదార్థాలను మధ్యాహ్న భోజనంలో ఒడ్డించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు తల్లీబిడ్డలతో మొక్కలు నాటించారు. మధ్యాహ్న భోజనంలో ప్రత్యేక పదార్థాలను అందించిన దాతలను అభినందించారు. నూజెళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పచ్చిపులుసు నాగేశ్వరరావు బాల బాలికలకు స్వీట్స్ సమకూర్చారు. పలు పాఠశాలల్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక భోజన కార్యక్రమంలో అధికారులు, దాతలు, పిల్లల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

కొత్తపేట(చీరాల : సహపంక్తి భోజనాలతో పాఠశాల విద్యార్థులపాటు, ప్రజల మధ్య సత్సంబంధాలు పెంపొందుతాయని సమగ్ర శిక్ష జిల్లా సీఎంవో శ్రీనివాస రెడ్డి అన్నారు. జడ్పీ హైస్కూల్లో వారంరోజులుగా జరుగుతున్న శిక్షా సప్తా కార్యక్రమం ముగింపు సందర్భంగా సోమవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహపంక్తి భోజనాలు అన్ని వర్గాల పిల్లల్లో సమానత్వ భావన కలగటానికి దోహదపడతాయన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. న్యూట్రిషీన్లతో కూడిన భోజనం అం దించటం ద్వారా పిల్లల్లో వ్యాధినిరోధరక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వేటపాలెం ఎంఈవో పురుషోత్తమరావు, హెచ్ఎం గుమ్మా శ్రీనివాసరావు, సీఆర్పీ బత్తుల సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేస్తున్న సీఎంవో శ్రీనివాసరెడ్డి

విద్యార్థినులకు ప్రతిభ ప్రోత్సాహకాలు


విద్యార్థికి నగదు అందజేస్తున్న కోటా

పర్చూరు, జూలై 29: ప్రతిభ కల్గిన విద్యార్థినులను గుర్తించి వారి అభ్యున్నతికి తోడ్పాటు నందించడం అభినందనీయమని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు క్రిష్ణంశెట్టి పార్వతి అన్నారు. సోమవారం బాలికల పాఠశాలలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు బాలికలకు గ్రామానికి చెందిన రొటేరియన్ కోటా శ్రీనివాసరావు ఒకొక్కరికీ రూ.5000 చొప్పున నగదును అందజేశారు. తన కుమార్తె ఎంబీబీఎస్‌లో ఉత్తీర్ణత సాధించడం నిరుపేద విద్యార్థులకు తమ వంతు సహకారం అందించాలన్న సంకల్పంతో ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, పాబోలు ఉదయ్‌భాస్కర్, నాగబైరు శ్రీనివాసరావు, కోమట్ల ఆంజనేయులు, పంబి సదానందరెడ్డి, క్రిష్ణంశెట్టి రమేష్ బాబు, శ్రీనివాసరావు, హెచ్ఎం అవని, సిబ్బంది పాల్గొన్నారు.

ఎత్తిపోతలను పరిశీలించిన ఎస్ఐ

బల్లికురవ, జూలై 29 : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో ఎత్తిపోతల పథకంలో మోటార్లు చోరీ జరిగిన ప్రదేశాన్ని సోమవారం బల్లికురవ ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఎత్తిపోతల పథకంలో ఎన్ని మోటార్లను దొంగలు ఎత్తుకెళ్లారని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయ సీజన్ కావడం వలన కొందరు దొంగలు రాత్రుళ్లు పొలాల్లో ఉన్న మోటార్లను చోరీలు చేస్తున్నారన్నారు. తాము కూడా రాత్రుళ్లు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి బీట్ డ్యూటీలు చేయిస్తామన్నారు. ఎక్కడైనా కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే తమకు సమాచారం అందించాలని అయన రైతులకు సూచించారు. ఈ పరిశీలనలో పలువురు రైతులు పాల్గొన్నారు.


చోరీకి గురైన పరికరాలను పరిశీలిస్తున్న ఎస్ఐ

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ

పర్చూరు, జూలై 29 : రోటరీ క్లబ్ ఆఫ్ సెంట్రల్ ఆధ్వర్యంలో పర్చూరులోని ఎఎన్‌వీఎస్ బాలికల పాఠశాలలోని విద్యార్థినులకు సోమవారం నోటు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యకు ప్రాధాన్యత కల్పించాలన్న సంకల్పంతో రోటరీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు పాబోలు ఉదయ భాస్కర్, నాగబైరు శ్రీనివాసరావు, కోమట్ల ఆంజనేయులు, కోటా శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి త పాల్గొన్నారు.

కుష్ఠుపై అవగాహన

పంగులూరు, జూలై 29 : కుష్ఠు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపరాదని, వారి పట్ల ప్రేమాభిమానాలు చూపాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్య అన్నారు. మండలంలోని కోటపాడు గ్రామంలో సోమవారం కుష్ఠుపై ప్రజలకు అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శలేని రాగి మచ్చలు, చేతులు, పాదాలలో నొప్పి లేకుండా పుండ్లు ఏర్పడినా, కాళ్లు చేతులలో కండరాల బలహీనత లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు హరిబాబు, మదర్సా, సీహెచ్‌వో బిందు, ఏఎన్ఎం మంగమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

నకారాకు నివాళి

మార్టూరు, జూలై 29 : ప్రభుత్వ ఉద్యోగులు పెన్షను పొందడానికి డీఎస్ నకారా చేసిన సేవలను పెన్షనర్లు జీవితకాలం గుర్తుంచుకుంటారని విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు ఆయనను స్మరించుకున్నారు. సోమవారం పెన్షనర్ల పితామహులు డీఎస్ నకారా వర్థంతి సందర్భంగా మార్టూరులో విశ్రాంత ఉద్యోగులు భవనం వద్ద ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రావుల బాపయ్య, శివ రామకోటేశ్వరరావు, హరిప్రసాద్, హనుమంతరావు, కే హనుమంతరావు, పుట్టా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


నకారా విగ్రహానికి నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

జిల్లా పరిపాలనకు కేంద్ర బిందువుగా ఉండే కలెక్టరేట్ కొత్త భవనాల నిర్మాణం కలగానే మారుతోంది. కొన్నేళ్ల తర్వాత కోర్టులో కేసులు క్లియర్ అయినా కొత్త కలెక్టరేట్ నిర్మాణం ఇప్పట్లో లేనట్లేనా..? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఎనిమిదేళ్ల కోర్టు కేసుల అనంతరం రెండేళ్ల క్రితం లైన్ క్లియర్ అవ్వడంతో సుమారు రూ.58 కోట్లతో 2022 సెప్టెంబరులో అప్పటి కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలకు ఇప్పటికీ అతీగతీ లేదు. దీంతో బ్రిటీషు కాలం నాటి భవనంలోనే పాలన సాగిస్తూ వస్తున్నారు. కొత్త భవనం నిర్మాణం జరగని కారణంగానే ఇప్పుడున్న వందేళ్ల నాటి భవనానికి విడతల వారీగా మరమ్మతులు చేస్తున్నారు. మరి ఎన్డీఏ ప్రభుత్వంలోనైనా కొత్త కలెక్టరేట్ నిర్మాణం సాధ్యపడు తుందా..? మంత్రులు, ఎమ్మెల్యేలు చొరవ తీసుకుంటారా..? అన్నది చూడాలి.

కొత్త కలెక్టరేట్ ఇక కలేనా!?

అంచనాలకు లభించని అనుమతులు

- వందల ఏళ్లనాటి భవనం నుంచే జిల్లా పాలన
- టీబీ ఆసుపత్రిలో భవన నిర్మాణానికి శ్రీకారం
- కోర్టు కేసులు పూర్తయినా ముందుకు సాగని ప్రక్రియ
- పాత భవనానికే మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

నెల్లూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : వందేళ్ల క్రితం బ్రిటీషు కాలంలో నిర్మించిన భవనం నుంచే ఇంకా పరిపాలన సాగుతోంది. మారుతున్న పాలనకు అనుగుణంగా అవసరాలు పెరుగుతుండటంతో ప్రస్తుతమున్న కలెక్టరేట్ భవనం ఇరుకుగా మారింది. రికార్డులు కూడా సక్రమంగా పెట్టుకోలేక అధికారులు అవస్థలు పడుతున్నారు. వర్షం కురిస్తే నీరు కారడం, ఉరవడం, పెచ్చులు ఊడుతుండటంతో ఉద్యోగులు భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. బ్రిటీషు కాలం నాటి భవనంలో ఉన్న జిల్లా పోలీసు కార్యాలయానికి కూడా అధునాతన హంగులతో కొత్త భవనాన్ని నిర్మించారు. పలు శాఖల కార్యాలయాలను, పోలీసు స్టేషన్లను కూడా నూతనంగా నిర్మించారు. కానీ జిల్లా పరిపాలన కార్యాలయానికి మాత్రం మోక్షం లభించలేదు. నెల్లూరులోని పాత టీబీ ఆసుపత్రి ప్రాంగణంలో కలెక్టరేట్‌ను నిర్మిస్తే పాలనాపరంగా చాలా ప్రయోజనాలు ఉంటాయని పదేళ్ల క్రితం అప్పటి అధికార వర్గాలు భావించాయి. ఇక్కడకు కలెక్టర్, జేసీ బంగ్లాలు పక్కనే ఉన్నాయి. సమీపంలో ఉన్న జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో కీలకమైన జడ్పీ, డీపీవో, డ్వామా, పంచాయతీరాజ్, జిల్లా ఎమర్జెన్సీ సెంటర్ ఉండడం, కార్పొరేషన్ కార్యాలయం ఉండడం కలిసొచ్చే అంశం. దీంతో వివిధ పనులపై జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలకు అధికారులందరినీ ఒకేచోట కలవడం సులభమవుతుంది. ఇక ప్రస్తుతమున్న కలెక్టరేట్ కార్యాలయం చుట్టూ నిత్యం ట్రాఫిక్ ఉంటుంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో పాటు గ్రీవెన్స్ కార్యక్రమానికి వచ్చే ప్రజలకు, అధికారుల సమావేశాలకు పార్కింగ్ సమస్య కూడా ఏర్పడుతోంది. వీటన్నిటి దృష్ట్యా ట్రాఫిక్ సమస్య లేని, విశాలమైన టీబీ ఆసుపత్రి ప్రాంగణంలో కలెక్టరేట్‌ను నిర్మిస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని భావించారు. అందుకు రూ.35 కోట్లతో కొత్త భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. 2015లో టెండర్లు కూడా పూర్తయ్యాయి. కానీ కాంట్రాక్టర్‌కు వర్క్ అగ్రిమెంటు చేసే సమయంలో టీబీ ఆసుపత్రి స్థలం కోర్టుకెళ్లింది. దీంతో కొత్త కలెక్టరేట్ నిర్మాణానికి బ్రేక్ పడింది.



కలెక్టరేట్ భవనం నిర్మించనున్న టీబీ ఆసుపత్రి ప్రాంగణం ఇదే!

● రూ.58 కోట్లతో ప్రతిపాదనలు

దాదాపు ఎనిమిదేళ్లపాటు అధికార యంత్రాంగం కోర్టులో పోరాడి విజయం సాధించింది. ఎట్టకేలకు కోర్టు కేసుల నుంచి కొత్త కలెక్టరేట్ నిర్మాణానికి రెండేళ్ల మార్గం సుగమమైంది. దీంతో మరోసారి అంచనాలు తయారు చేసి రూ.58 కోట్లు అవసరమంటూ పూర్వపు కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు ప్రభుత్వానికి నివేదించారు. కొత్త కలెక్టరేట్ ఆవశ్యకతను కూడా ఆయన తన నివేదికలో వివరించారు. ఈ నేపథ్యంలో నూతన పరిపాలన కేంద్రం తథ్యమని ఇటు ప్రజలు, అటు ఉద్యోగులు భావించారు. కానీ నెలలు.. ఏళ్లు గడిచినా ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు రాలేదు. ఎప్పటికి అనుమతులు వస్తాయో.. అసలు వస్తాయో రావో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు అవసరాలకు అనుగుణంగా కలెక్టరేట్ భవనంలో మరమ్మతులు చేయిస్తూ పాలన నెట్టుకొస్తున్నారు. కాగా ఈ అంశంపై రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులను సంప్రదించగా కొత్త కలెక్టరేట్ నిర్మాణానికి సంబంధించి ఇంతవరకు ఎటువంటి అనుమతులు రాలేదని చెప్పారు.



బ్రిటీష్ కాలం నాటి ప్రస్తుత కలెక్టరేట్ భవనం

సోమశిలకు కృష్ణమ్మ పరవళ్లు

శ్రీశైలం నుంచి 20 వేల క్యూసెక్కులు విడుదల

నెల్లూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రైతుల ఆశలు ఫలించబోతున్నాయి. డెడ్ స్టోరేజీకి చేరుకున్న సోమశిల, కండలేరు ప్రాజెక్టుల్లోకి కృష్ణా జలాలు వచ్చి చేరబోతున్నాయి. 'ఇదే అదును.. కృష్ణమ్మను ఆహ్వానిద్దాం' అన్న శీర్షికతో ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. కృష్ణా జలాలను సోమశిలకు తరలించేందుకు నిర్ణయం తీసుకుంది. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వస్తుండటంతో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నిప్పుల వాగుకు నీటిని విడుదల చేశారు. ఆదివారం సాయంత్రం 15 వేల క్యూసెక్కులను విడుదల చేసిన అధికారులు.. వరద ఉధృతి పెరగడంతో సోమవారం మరో 5 వేల క్యూసెక్కులను పెంచారు. ఇప్పటికే శ్రీశైలం జలాశయం 90 శాతం వరకూ నిండింది. ఎగువ ప్రాంతం నుంచి 4.5 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో శ్రీశైలానికి కొనసాగుతోంది. ఈ క్రమంలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటి విడుదలను మరింత పెంచాలని అధికారులు ఆలోచన చేస్తున్నారు. ప్రస్తుతం విడుదల చేసిన 20 వేల క్యూసెక్కుల నీరు కొంత కడప, కర్నూలు జిల్లాల్లోని కాలువలకు చేరగా, మరికొంత నిప్పుల వాగు ద్వారా పెన్నాకు చేరనుంది.

అన్నం కాదయ్యా.. ఆలకించండి!



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న ఫిర్యాదుదారులు, అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ తదితరులు

- 'ఎస్పీ గ్రీవెన్స్'లో సమస్యల పరిష్కారమేది!? ● కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోరే! ● బాధితుల గగ్గోలు

"నెల్లూరు రూరల్ మండలం కొత్తకాలువ గ్రామానికి చెందిన 434 రైతులు నవాబుపేటలోని శ్రీసాయిబాబా రైసుమిల్లు ఓనర్ శ్రీరామ్ శేఖర్ బాబును నమ్మి రోడ్డు మీద పడ్డాం. రూ.4.6 కోట్ల విలువ చేసే ధాన్యాన్ని కొనుగోలు చేసి పైసా కూడా ఇవ్వలేదు. ఒకటిన్నర నెల నుంచి పోలీసుస్టేషన్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలా. ఇప్పటికి మూడు సార్లు ఎస్పీ గ్రీవెన్స్‌కి వచ్చాం.. అయినా న్యాయం జరగలా! ఇంటికి వెళ్లాలంటే అప్పులోళ్లని తలుచుకుంటేనే భయమేస్తోంది. అధికారుల్లారా మీకేం కావాలో చెప్పండి మేము ఇస్తాం. మాకు న్యాయం చేయండి."

- కొత్తకాలువ గ్రామ రైతుల ఆవేదన



నెల్లూరు(క్రైం), జూలై 29: ప్రతి సోమవారం నెల్లూరులోని ఎస్పీ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌కు జిల్లావ్యాప్తంగా బాధితులు వస్తూనే ఉన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఎన్నిసార్లు వచ్చినా పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక పోలీసుస్టేషన్‌లో మమ్మల్ని పట్టించుకోవడం లేదనే బాధితులే అత్యధికంగా ఉంటున్నారు. గ్రీవెన్స్‌కు వచ్చే వారి సమస్య పెరుగుతూ ఉండటంతో ఇదేదో విజయవంతమైన కార్యక్రమంలా భావిస్తున్నారు. అయితే పదే పదే సమస్యల పరిష్కారం కావడం లేదని, చార్జీలకు డబ్బులు లేకపోయినా, అప్పులు చేసి మరీ వస్తున్నా.. బాధితుల పరిస్థితులు మాత్రం పట్టించుకోవడం లేదు. అర్జీ చూశామా.. మాట్లాడామా..ఆ పరిధిలోని పోలీసుస్టేషన్‌కు రెఫర్ చేశామా అన్నట్లుగా కాలయాపన చేస్తున్నారు. అయితే, ఎవరో దానం చేసిన భోజనాన్ని బాధితులకు పెట్టి పంపుతున్నారు తప్ప వారి సమస్యల పరిష్కారం కోసం దృష్టి సారించడం లేదు.

● పరిష్కార వేదికకు 110 ఫిర్యాదులు

సోమవారం నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 110 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ జీ కృష్ణకాంత్ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

● బెట్టింగ్ యాప్‌లను నియంత్రించండి

సింగిల్ నెంబర్ లాటరీలు, బెట్టింగ్ యాప్‌లు, దొంగతనాలను అరికట్టాలని ఇన్సాఫ్ నాయకులు పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి సయ్యద్ సిరాజ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్ మాట్లాడుతూ నగరంలో యథేచ్ఛగా సింగిల్ నెంబర్లాట సాగుతోందని, ముఖ్యంగా సంతపేట, ఆజాద్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు సింగిల్ నెంబర్లాట సాగిస్తున్నారని పేర్కొన్నారు. సంతపేట పోలీసులకు అన్నీ తెలిసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

ముత్యాలపాళెం ప్రాంతానికి చెందిన రాజకృప అనే మహిళ తన పిల్లల కోసం ఆన్‌లైన్ తరగతులు నిర్వహించే ఓ సంస్థకు నగదు చెల్లించింది. వారు ఓటీపీ చెప్పాలని కోరడంతో తెలియజేసింది. అయితే ఆ సంస్థ ఓటీపీ ద్వారా ఓ ఫైనాన్స్ సంస్థకు లింక్ చేశారే తప్ప. ఆన్‌లైన్ తరగతులు మాత్రం నిర్వహించలేదు. తాను చెల్లించిన నగదును ఇవ్వాలని కోరినా సమాధానం లేదు. దీంతో ఆమె బాలాజీనగర్ పోలీసుస్టేషన్ చుట్టూ తిరిగి తిరిగి చేసేది లేక నగర డీఎస్పీని ఆశ్రయించింది. ఆయన సూచనల మేరకు దర్గామిట్ట పోలీసుస్టేషన్‌కు వెళ్లినా ప్రయోజనం లేదు. చివరికి ఎస్పీ గ్రీవెన్స్‌కు వెళ్లినా అంతే.



రెవెన్యూ సమస్యలు వేగంగా పరిష్కరించండి

అధికారులతో వీసీలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), జూలై 29 : రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూలో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ల మంజూరు, మ్యూటేషన్ ట్రాన్సక్షన్లపై తహసీల్దార్లు దృష్టి సారించాలన్నారు. ఎటువంటి కారణాలు లేకుండా దరఖాస్తులను తిరస్కరించవద్దని సూచించారు. గ్రామాల వారీగా ఆయకట్టు వివరాలు సేకరించాలని, ఎంత మేర పొలాలకు నీరు అవసరమో లెక్క తేలిస్తే ఐఏబీ సమావేశంలో నీటి విడుదలకు అవకాశం ఉంటుందన్నారు. పెన్నానది పరివాహక మండలాల్లో కరకట్టల ఆక్రమణలను తొలగించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎంపీడీఓలు, ఈవోపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులను అందించాలని ఆదేశించారు. ఎస్టీలకు జనన సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులు ఇప్పించాలని ఆదేశించారు. వచ్చే నెల 1న 99 శాతం మేర పింఛన్ల పంపిణీ చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనిదినాలను బాగా పెంచాలన్నారు. అలాగే పాఠశాలల్లో నిర్మాణంలో ఉన్న భవనాల వద్దకు విద్యార్థులు వెళ్లకుండాచర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ, డీఆర్వో లవన్న తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ఎఫ్‌పీవోలకు లైసెన్సులు మంజూరు చేయండి

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు త్వరితగతిన లైసెన్సులు మంజూరు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జరిగిన జిల్లాస్థాయి మానిటరింగ్‌లో కలెక్టర్ మాట్లాడుతూ దళారుల బారిన పడకుండా రైతులే ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి వారికి కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తదితరాలతోపాటు పంటలకు గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు.

మెప్మా పీడీ, డీఈవోలకు సత్కారం

ఫ్లాగ్ డే సందర్భంగా జిల్లా నుంచి ఎక్కువ మొత్తంలో నిధి సేకరించి సైనిక సంక్షేమ నిధికి అందచేసిన మెప్మా పీడీ రవీంద్ర, డీఈఓ రామారావును కలెక్టర్ ఆనంద్ అభినందించారు. వారిని శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందచేశారు. మెప్మా పీడీ రూ.6.57లక్షలు, డీఈఓ రూ. 3.3 లక్షలు సేకరించి సైనిక సంక్షేమనిధికి అందచేశారని జిల్లా సైనిక సంక్షేమాధికారి రమేష్ తెలిపారు. అలాగే జిల్లాలో సైనిక సంక్షేమ నిధికోసం రూ.18 లక్షలు సేకరించి మూడవ స్థానం సాధించినందుకు రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నామని తెలిపారు.

నైపుణ్యాలను పెంపొందించండి

పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా నిరుద్యోగులు, విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించాలని కలెక్టర్ ఆనంద్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రణాళికపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. వివిధ రంగాల్లో తరచూ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు వివిధ రంగాల్లో ఉన్న ఉద్యోగావకాశాలను గుర్తించాలన్నారు. వ్యవసాయాధారిత పరిశ్రమల్లో ఉన్న అవకాశాలను గుర్తించి గ్రామీణ యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఉదయగిరి చెక్క వృత్తి కళాకారులు తయారు చేసిన స్పూన్, ఫోర్క్‌లను కలెక్టర్‌కు డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి అందచేశారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి వెంకటయ్య, ఏపీఎంఐపీ పీడీ రవీంద్ర, వివిధ కళాశాలల స్కిల్ డెవలప్‌మెంటు విభాగ అధికారులు పాల్గొన్నారు.

బకింగ్‌హామ్ బాగుపడేనా!?

తక్కువ ఖర్చుతో సరుకు రవాణా, తీరప్రాంతంలో పారిశ్రామిక ప్రగతి, వరదల నుంచి తీరప్రాంతవాసులకు రక్షణ... ఇలా బహుళ ప్రయోజనాలు కలిగిన బకింగ్‌హామ్(బీకే) కెనాల్ సమగ్రాభివృద్ధి కాగితాలకే పరిమితమైంది. ప్రస్తుతం ఇటు రాష్ట్రంలోనూ, అటు కేంద్రంలోనూ ఎన్డీఏ కూటమి అధికారంలో ఉండడంతో కేంద్రం నిధులతో చేపట్టే ఈ కెనాల్ అభివృద్ధి ఫైల్‌ను రాష్ట్ర పాలకులు కదిలిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. కెనాల్ అభివృద్ధికి సర్వే చేపట్టి ఇప్పటికి ఎనిమిదేళ్లు పూర్తయినా, సర్వే నివేదిక తుదిరూపం దాల్చలేదు. సర్వే అనంతరం కెనాల్ అలైన్‌మెంట్‌ను ఫైనల్ చేస్తే కానీ భూసేకరణ ఎంత అవసరమో తేలదు. ఈ కెనాల్ నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు తీసుకురావాల్సి ఉన్నందున జిల్లా నాయకులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- ఎనిమిదేళ్లుగా సాగుతున్న సర్వే ● నిర్ధారించని అలైన్‌మెంట్
- అలైన్‌మెంట్ అయితేనే భూసేకరణ
- తీరప్రాంత వాసులకు రక్షణగా కాలువ



పూడికతో నిండిన బకింగ్‌హామ్ కాలువ

కావలి, జూలై 29: బకింగ్ హామ్ కాలువ ప్రకాశం జిల్లా చినగంజాం నుంచి తిరుపతి జిల్లా తడ వరకు 258 కి.మీ పొడవున ఉంది. ప్రకాశం జిల్లాలో 80, నెల్లూరు జిల్లాలో 178 కి.మీ పొడవున ఉంది. సముద్రానికి సమాంతరంగా ఒకచోట దగ్గరగా, మరోచోట దూరంగా వెళుతున్న ఈ కెనాల్ నిర్వహణలేక పోవటంతో అనేకచోట్ల ఆక్రమణకు గురైంది. ఫలితంగా కుంచించుకుపోయింది. అంతేకాక పూడికతో నిండిపోయి ఉంది. దీని సబ్‌డివిజన్ కార్యాలయం ఇందుకూరుపేట మండలం మైపాడులో ఉంది. చిప్పలేరు, పెన్నా, కండలేరు, తంబలేరు, స్వర్ణముఖి, పులికాట్ నదుల మీదుగా బకింగ్‌కెనాల్ సాగుతోంది. రామాయపట్నం వద్ద కెనాల్‌పై రోడ్డు, రైల్వేవంతెనలు నిర్మించాల్సి ఉండగా, పనులు జరుగుతున్నాయి. రైల్వే వంతెన నిర్మాణానికి కేంద్రం అనుమతి కోసం ఎదురు చూస్తున్నారు.

● అలైన్‌మెంట్ ఫైనల్ అయితేనే కదలికలు

కెనాల్ సర్వే తుది రిపోర్టు అందిన తర్వాత అలైన్‌మెంట్ ఫైనల్ అయితే కాలువకు ఇరువైపులా ఎంత స్థలం అవసరమో తేలుతోంది. అప్పుడు దాని ప్రకారం సర్వే చేస్తే ప్రభుత్వ స్థలాలు ఎంత ఉన్నాయి...? వాటిలో ఆక్రమణలు ఏమేరకు ఉన్నాయి...? పట్టా భూములు ఎంత ఉన్నాయి తేలుతుంది. పట్టా భూములను రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేసి ఇస్తే కేంద్రం ఆ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేస్తుంది. ఇదంతా జరగాలంటే డబుల్ ఇంజన్ పాలనలో రాష్ట్రం చొరవ తీసుకుని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి.



కుంచించుకుపోయిన కాలువ

● బహుళ ప్రయోజనాలు

బీకే కెనాల్ నిర్మాణం చేపడితే సరుకుల రవాణా ఖర్చులు బాగా తగ్గుతాయి. పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కాలువ ఎడమ గట్టుపై రోడ్డు నిర్మాణం జరుగుతున్నందున అక్కడ నుంచి జాతీయరహదారి వరకు పారిశ్రామిక అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుంది. పారిశ్రామిక అభివృద్ధి జరిగితే ఎంతో మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడుతాయి. తీరప్రాంతం అభివృద్ధి పథంలో దూసుకు పోతుంది. తీరం వెంబడి ఎక్కువగా వ్యవసాయానికి పనికి రాని భూములు ఉన్నందున అక్కడ పారిశ్రామికంగా అభివృద్ధి జరుగుతుంది. తుఫాన్‌లు తదితర విపత్కర సమయంలో సముద్రం ఉప్పొంగి సమీపంలో ఉన్న గ్రామాల్లోకి నీరు రాకుండా కెనాల్ రక్షణగా నిలుస్తుంది. ఇన్ని ప్రయోజనాలు ఉన్న బీకే కెనాల్ నిర్మాణం ఎప్పుడు జరుగుతుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

మధ్యాహ్న భోజనంలో పండ్లు, స్వీట్లు పంపిణీ



సీతారామపురం: కస్తూర్బా విద్యాలయంలో పిల్లలకు స్వీట్లు అందిస్తున్న సర్పంచి కొడవటికంటి భాగ్యకుమారి



సంగం: ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిప్యూటీ డీఈవో గోపాల్, ఉపాధ్యాయులు

● అట్టహాసంగా

శుభ్‌దిన్ భోజన్ కార్యక్రమం

సంగం, జూలై 29: కేంద్రం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానంలో భాగంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగా సోమవారం (చివరిరోజు) శుభదిన్ భోజనం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ప్రతి పాఠశాలలో దాతలతో భోజనంలో విద్యార్థులకు స్పెషల్ ఐటెం (పండ్లు, స్వీట్, ఇతర ఆహార పదార్థాలు) ఏర్పాటు చేశారు. అందులో భాగంగా సంగం ఉన్నత పాఠశాల, తిరుమనతిప్ప పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో డిప్యూటీ డీఈవో గోపాల్ పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో జానికీరామ్, మల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా వెంగారెడ్డిపాళెంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, అంగన్‌వాడీ కేంద్రంలో స్వీట్, అరటి పండుతో స్పెషల్ భోజనం వడ్డించారు.

సీతారామపురం: స్థానిక కసూర్తార్బాగాంధీ విద్యాలయ విద్యార్థినులకు సోమవారం సీతారామపురం సర్పంచ్ కొడవటి కంటి భాగ్యకుమారి వివిధ రకాల స్వీట్లు, పండ్లు పలహారాలు మధ్యాహ్న భోజనంతో పాటు అందజేశారు. ఎంఈఓ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల తో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపాల్ షాజిదా, ఉపాధ్యాయ సిబ్బంది, కార్యదర్శి జీవన్ కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుమతి, మహిళా పోలీస్ హజీరాబేగం పాల్గొన్నారు.

కలువాయి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాజీ పెంచలకోన ట్రస్టు సభ్యులు, టీడీపీ నాయకులు చల్లా రఘురామిరెడ్డి విద్యార్థులకు లడ్లు పంపిణీ చేశారు. నాయీబ్రాహ్మణ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో మాజీ మండల విద్యాశాఖాధికారి కామిశెట్టి శ్రీనివాసులు విద్యార్థులకు స్వీట్లు, అరటి పండ్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు దండు పెంచలయ్య, టీడీపీ నాయకులు నూటేటి నరసింహులు, పిడుగు శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరి: విద్యార్థులకు మిఠాయిలు అందజేస్తున్న దాతలు

ఉదయగిరి రూరల్: ఎంఈవో-2 తోట శ్రీనివాసులు బిజ్జంపల్లి జిల్లా ఉన్నత పాఠశాలలో దాత జమ్ముల వెంకటేశ్వర్లు అందజేసిన పండ్లు, మిఠాయిలను భోజన సమయంలో పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల ప్రగతి, పలు రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే ఉదయగిరి ఉన్నత పాఠశాలలో మాజీ సర్పంచ్ షేక్ గాజుల జాఫర్‌సాహెబ్ కుమారులు విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాయబ్, బాలకేశవులు, సర్పంచ్ లక్కు రమణమ్మ, పాఠశాల చైర్మన్ సుందరరామిరెడ్డి పాల్గొన్నారు.



వింజమూరు: విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న దాతలు

వింజమూరు: చాకలకొండ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయుడు వెలుగోటి కృష్ణ. తల్లిదండ్రులు వెలుగోటి కోటిలింగం నాయుడు ధర్మపత్ని సుబరత్నం జ్ఞాపకార్థం పండ్లు, స్వీట్లను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు పొలుబోయిన రమేష్, విజయకుమారి, ఏ.సుభాషిణి, టి.సురేష్, సీతామహాలక్ష్మి, ఎస్‌కె.సమీలా బేగం, జూనియర్ అసిస్టెంట్ సూరా రామిరెడ్డి, గురుశేఖర్ పాల్గొన్నారు.

● సీతారామపురం మండలం అయ్యవారిపల్లి స్కూల్‌లో బీజేపీ నాయకురాలు జ్యోతి, మయూరిలు విద్యార్థులకు అరటిపండ్లు, అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో బి.జయమ్మ, బి.సత్యప్రకాష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషి అభినందనీయం

వింజమూరు, జూలై 29: నియోజకవర్గానికి రెండు డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కృషి చేయడం అభినందనీయం అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులిచర్ల నారాయణరెడ్డి అన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి ఈ సమస్యను తీసుకుపోగా సానుకూలంగా స్పందించిన మంత్రితో రూ.40లక్షల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు.

'ఉపాధి' పనుల పరిశీలన

కలువాయి, జూలై 29: చింతలపాలెంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను సోమవారం ఎంపీడీవో ప్రభాకర్, ఏపీవో మురళీ పరిశీలించారు. వైసీపీ హయాంలో జరిగిన ఉపాధి పనుల్లో భారీగా అవినీతి చోటు చేసుకున్న విషయం ఇటీవల చేపట్టిన సామాజిక తనిఖీలో వెలుగుచూసింది. ఈ నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. మస్టర్లలో కూలీల హాజరును తనిఖీ చేశారు.

పనులు అడ్డుకుంటున్నారని ఫిర్యాదు

కలువాయి, జూలై 29: కుల్లూరు పంచాయతీలో 2020నుంచి ఉపాధిహామీ పనులు సక్రమంగా నిర్వహించడం లేదని పలువురు కూలీలు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మూడురోజులు పనిపెట్టి ఆ తరువాత మళ్లీ నిలిపి వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన కొందరు పనులు చేయనివ్వకుండా అడ్డుపడుతున్నారని తెలిపారు. కలెక్టర్ చర్యలు తీసుకుని కూలీలకు పని కల్పించాలన్నారు.

పంటలను సంరక్షించండి

ఉదయగిరి రూరల్, జూలై 29: ఆవుల బారి నుంచి తమ పంటలను సంరక్షించాలని సోమవారం బండగానిపల్లి రైతులు కోరారు. సజ్జ, ఇతరత్రా పంటలు సాగు చేశామని సమీపంలోని జీ.చెర్లోపల్లి ఆవులు పంటలపై పడి నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.వేల పెట్టుబడులు పెట్టి సాగు చేశామన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలంటున్నారు.

న్యాయమైన నష్టపరిహారం అందించాలి



సీతారామపురం: తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బాధిత రైతులు

సీతారామపురం, జూలై 29: మండలంలో ఆరు, నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణంలో భూములు, ఇళ్లు, స్థిరాస్తులు కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారాన్ని అందించాలని రైతు న్యాయ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామాలకు చెందిన రైతులు, రైతు కూలీలతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత గిజన ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ ఏలిషా కుమార్ మాట్లాడారు. సరైన అంచనాలు వేయకుండా రెవెన్యూ సిబ్బంది తూతూ మంత్రంగా సర్వే చేపట్టడం వలన పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందడం లేదన్నారు. స్థానిక రెవెన్యూ సిబ్బంది తప్పిదాలతో ఈ సమస్య తలెత్తిందన్నారు. ప్రతి సోమవారం నెల్లూరులోని కలెక్టర్‌ను కలిసి అర్జీలు ఇస్తూ ఉన్నా చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. బాధితులకు న్యాయం జరుగకుంటే అన్ని గ్రామాల్లో రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ ఆర్డీఓ ఆధ్వర్యంలో స్థానికేతర సిబ్బందితో రీ సర్వే చేయించి ఖచ్చితమైన నష్టపరిహారాన్ని అందించాలన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలని వినతి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 29: బ్రహ్మేశ్వరం, దుత్తలూరు, రెడ్లదిన్నె రెవెన్యూ గ్రామాల పరిధిలో వందల ఎకరాల ప్రభుత్వ భూములను కొంతమంది ఆక్రమించుకుని కొన్నేళ్లుగా సాగు చేస్తుకుంటున్నారని, వాటిని కాపాడాలని టీడీపీ నాయకులు సోమవారం తహసీల్దారు యశోదకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అక్రమంగా సాగు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బ్రహ్మేశ్వరం సమీపంలో గర్భకండ్రిక భూముల్లో కొంతమంది పట్టాలు పొంది ఉన్నారని, వాటిపై పూర్తి విచారణ చేపట్టాలన్నారు.

ఎక్స్‌కవేటర్ స్వాధీనం: రెడ్లదిన్నె, దుత్తలూరు ప్రభుత్వ భూముల్లో అక్రమంగా చెట్లు తొలగించి చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను తహసీల్దారు యశోద ఆదేశాల మేరకు వీఆర్వో శ్రీను, వీఆర్‌ఏ మురళిలు యంత్రాన్ని స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తరలించారు. అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తహసీల్దారు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమణదారులపై చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

అడ్డుకట్టను తొలగించాలని రైతుల ఫిర్యాదు

సంగం, జూలై 29: తలుపూరుపాడులోని చవిటి వాగు భూమిని ఓ వ్యక్తి ఆక్రమించి సాగు చేస్తూ పొలానికి ముంపు రాకుండా ఉండేందుకు ఆదివారం వాగునకు అడ్డుకట్ట వేస్తున్నాడని ఈ పనులను వెంటనే అడ్డుకోవాలని సమీప పొలాల రైతులు సోమవారం ఇన్‌చార్జి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వాగు సమీపంలోని తమ పొలాల్లోకి వర్షపు నీరు వెళ్లే అవకాశం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. చవిటి వాగు బాట పోరంబోకు భూమి సర్వే నెంబరు 85, 86లో 3.96సెంట్లు, 3.75 సెంట్ల భూమిని కొంతకాలం క్రితం ఆక్రమించి తన ఆధీనంలో ఉంచుకున్నాడని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఉదయగిరి రూరల్, జూలై 29: పట్టణంలోని పూసలకాలనీలో సోమవారం గండిపాళెం ప్రాథమిక కేంద్రం ఆరోగ్య బోధకుడు కె.వెంకటసుబ్బయ్య సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగడం శ్రేయస్కరం అన్నారు. దోమకాటుతో డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా జ్వరాలు వస్తాయని, వాటి నివారణకు దోమతెరలు వాడాలన్నారు. ఏ చిన్నపాటి రుగ్మతకు గురైనా వెంటనే ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలన్నారు. అనంతరం కాలనీలో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు చేపట్టి బ్లీచింగ్ చల్లడంతో పాటు దోమల నివారణకు మందు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, టీబీ సూపర్‌వైజర్ భోగ్యం వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి కరీముల్లా, ఎంఎల్‌హెచ్‌పీ రామారావు, ఏఎన్ఎం నూర్జాహాన్, సిబ్బంది పాల్గొన్నారు.

'గ్రీవెన్స్'కు అధికారుల డుమ్మా

ఉదయగిరి రూరల్, జూలై 29: ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం తహసీల్దారు కార్యాలయాల్లో గ్రీవెన్స్‌సెల్ కార్యక్రమానికి అధికారులు గైర్హాజరయ్యారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి 18 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా ఉదయం 10.45 గంటలకు కేవలం 6 శాఖల అధికారులు మాత్రమే వచ్చారు. కొంత మంది అధికారులు ఆలస్యంగా వచ్చి రిజిస్టర్‌లో సంతకాలు చేసి వెళ్లారు. అధికారులే ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ప్రజా సమస్యలు ఏ మేరకు పరిష్కరిస్తారో అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

వైభవంగా గంగపెట్టె గ్రామోత్సవం

సంగం, జూలై 29: స్థానిక నిమ్మతోపులో వెలసిన అభయ గంగమ్మతల్లి జాతరను పురస్కరించుకుని సోమవారం భక్తులు గంగ పెట్టె గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభయ గంగమ్మతల్లిని పూలతో అలంకరించారు. అనంతరం పెన్నానది నుంచి గంగ పెట్టెకు పూజలు చేసి యాదవ సోదరులు ఆలయానికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అన్నపురెడ్డి పెదవెంకటరెడ్డికి సన్మానం

ఆత్మకూరు, జూలై 29: ఇటీవల స్వర్ణకంకణ, కిరీటధారణతో గౌరవం పొందిన తెలుగు భారతి సేవాసమితి ప్రధాన కార్యదర్శి అన్నపురెడ్డి పెదవెంకటరెడ్డిని సోమవారం పట్టణంలోని మేధా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో సమితి సభ్యులు ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి, సేవాసంస్థ అధ్యక్షులు సోమవరపు సుబ్బరాయుడు, గౌరవాధ్యక్షులు గోవిందరెడ్డి, సహాధ్యక్షులు కొల్లా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పాఠశాలల్లో శుభ దిన్ భోజన్

కావలిటౌన్, జూలై 29 : పట్టణంలోని ముసునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్‌లో భాగంగా టీడీపీ నాయకులు ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం పిల్లలకు భోజనాలు, మిఠాయిలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ డీఈవో రఘురామయ్య, ఎంఈవోలు గోవిందయ్య, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఉప్పు వెంకటస్వామి, టీడీపీ నేతలు బిట్రగుంట వెంకట్రావు, లింగం మాల్యాద్రి, కన్నం శ్రీధర్, సీతారామయ్య, ప్రభాకర్, కరీంబాష, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జలదంకి : శిక్షా సప్తాహ్‌లో భాగంగా సోమవారం మండలంలోని అన్నవరం ఎంపీయూపీ పాఠశాలలో భోజన కార్యక్రమం జరిగింది. గ్రామ టీడీపీ నాయకుడు పూనూరు రామక్రిష్ణారెడ్డి దాతగా వ్యవహరించగా, ముఖ్యఅతిథిగా ఎంపీటీసీ సభ్యుడు కోర్శిపాటి మాధవరెడ్డి పాల్గొని విద్యార్థులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా దాత రామక్రిష్ణారెడ్డిని హెచ్ఎం మాధవి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్, సుమతి, సుప్రియ, రాము, వెంకటరమణయ్య, టీడీపీ నాయకులు కాటంరెడ్డి మాల్యాద్రిరెడ్డి, షేక్ రసూల్ పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలు మండలంలోని పలు పాఠశాలల్లో శిక్షాసప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రధానోపాధ్యాయులు శుభదిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొండబిట్రగుంట పాఠశాలలో హెచ్ఎం మద్దులూరి ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో-12 నరసింహరావు, జయమ్మ పాల్గొన్నారు. విద్యార్థులకు భోజనంతోపాటు మిఠాయిలను పంపిణీ చేశారు. ఉమామహేశ్వరపురం పాఠశాలలో పండ్లు, స్వీట్లను స్థానిక టీడీపీ నాయకుడు గట్టాల సుబ్బయ్య పంపిణీ చేశారు.

లింగసముద్రం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వారం నుంచి జరుగుతున్న శిక్షాసప్తాహ్ ముగింపు సందర్భంగా సోమవారం పలువురు దాతలు విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందించారు. లింగసముద్రంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య, పెంట్రాల యూపీ పాఠశాలలో మాజీ సర్పంచు కిలారి కొండయ్య భోజనం అందించారు. ఈ సందర్భంగా అధికారులు, దాతలు విద్యార్థులకు భోజనం వడ్డించారు. పాఠశాలలను తహసీల్దార్ టీ ప్రసాద్, ఎంపీడీవో కే శ్రీనివాసులు, ఎంఈవో-2 శివకుమార్, ఏపీవో షేక్ సమీర్‌బాషాలు సందర్శించి భోజనం చేశారు. అనంతరం దాతలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాలంకి ప్రసాద్, అంగులూరి చినకొండయ్య, మాజీ ఎంపీపీ బాలకోటయ్య, పీ గురునాథం, గొల్లపల్లి వెంకటేశ్వర్లు, గోగుల మోహన్‌రావు, దార్ల మధు తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : మండలంలోని పొట్టిపల్లి పాఠశాలలో సోమవారం టీడీపీ నాయకులు విద్యార్థులకు భోజనాలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుంటిపల్లి మాలకొండయ్య, జీ.వెంకటేశ్వర్లు, గద్దె మాధవరావు, ఉపాధ్యాయులు గొట్టిపాటి మహేష్‌బాబు, కే.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. గొట్టిగుండాల జడ్పీ ఉన్నతపాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ వేమిరెడ్డి మల్లికార్జున, సర్పంచ్ డబ్బుగొట్టు కొండలరావు, ఇన్‌చార్జి హెచ్ఎమ్ గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



కావలి టౌన్ : మొక్కలు నాటుతున్న టీడీపీ నేతలు



బిట్రగుంట : విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేస్తున్న ఎంఈవో జయమ్మ

పింఛన్ల పంపిణీపై నేడు సమీక్ష

అల్లూరు, జూలై 29 : పింఛన్ల పంపిణీపై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జ్యోతి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ సమీక్షకు ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, రూరల్, అర్బన్ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇస్కపల్లి-1, అల్లూరు-2 సచివాలయ సిబ్బంది కచ్చితంగా హాజరు కావాలని ఆమె తెలిపారు.

సీటీ కాలిపోవడం వల్లే విద్యుత్ అంతరాయం

బిట్రగుంట, జూలై 29: సబ్‌స్టేషన్‌లోని బోగోలు 11కేవీ ఫీడర్ కరెంటు ట్రాన్స్‌ఫార్మర్ (సీటీ) కాలిపోవడంతోనే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని, త్వరలో కొత్త సీటీ ఏర్పాటు చేస్తామని ఏఈ షేక్.నాగూర్‌వల్లి తెలిపారు. బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీటీ కాలిపోవడంతోపాటు ఈదురు గాలులు వీస్తుండటం కారణంగా ఫీడర్ ట్రిప్ అవుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. మంగళవారం సీటీ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. కావున ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

జాతీయ టార్గెట్‌బాల్ పోటీలకు మల్లీశ్వరి

కావలిటౌన్, జూలై 29: కడప జిల్లా వేంపల్లిలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి టార్గెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపిన డీబీఎస్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని కొండూరి మల్లీశ్వరి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, ప్రిన్సిపాల్ టీవీ రావు, అధ్యాపకులు పీడీ సాగర్, ఏట రమేష్‌బాబు తదితరులు మల్లీశ్వరిని శాలువాతో సత్కరించి అభినందించారు.

దోమల నివారణకు ఫాగింగ్

కావలి, జూలై 29: పట్టణంలో దోమల నివారణకు మున్సిపల్ అధికారులు ఫాగింగ్ చేయిస్తున్నారు. సోమవారం పట్టణంలోని 39వ వార్డులో ఫాగింగ్ చేశారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో నిత్యం ఫాగింగ్ చేస్తూ దోమల నివారణకు చర్యలు చేపడుతున్నారు. పట్టణంలో ఇప్పటికే డ్రైనేజీలలో పూడికతీత ప్రారంభించిన అధికారులు, మరో పక్క దోమల నివారణకు చర్యలు చేపడుతున్నారు.

కందుకూరులో చోరీలను అరికట్టాలి

కందుకూరు : పట్టణంలో ఇటీవల దొంగతనాలు విపరీతంగా పెరిగాయని, చోరీల నివారణకు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్స్ ఫోరం అధ్యక్షుడు నేతి మహేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలోని ఓవీ రోడ్డులో ఉన్న తమ కార్యాలయంలో ఇటీవల బోరుకు ఉన్న మోటారు, కొంత ఇనుప సామగ్రిని దొంగలు అపహరించుకుపోయారని, చుట్టుపక్కల అనేక ఇళ్లలో కూడా చోరీలు జరిగాయని ఆయన తెలిపారు. ప్రజాప్రతినిధులు, పోలీసులు తగినచర్యలు తీసుకుని చోరీలను నిర్మూలించాలని ఆయన కోరారు.

ప్రజా ఫిర్యాదుల వేదికకు ఏడు అర్జీలు

కందుకూరు : మున్సిపాలిటీలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల వేదికలో వివిధ సమస్యలపై 7 అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయా సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా సెక్షన్ హెడ్స్‌కు ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, వీధిలైట్లు, తాగు నీటి సమస్యలపై 9177700267 నెంబరుకు ఫోన్‌చేస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

'ప్రకాశం'లో రక్తదాన శిబిరం

కందుకూరు : స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కందుకూరు, కావలి ఏరియా వైద్యశాలల రక్తఅవసరాల కోసం ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ రక్తదాన కార్యక్రమం తమ కళాశాలలో సామాజిక ఉద్యమంగా కొనసాగుతున్నదన్నారు. కార్యక్రమంలో డాక్టరు ఎండీ షావుద్దీన్, డాక్టరు వెంకటరెడ్డి, డాక్టరు విజయవాణి, ప్రిన్సిపాల్ రవికుమార్, కళాశాల ఇన్‌చార్జి జి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కారు లబ్ధిదారుల ఇబ్బందులు తొలగించాలి

కలిగిరి : సాంఘికసంక్షేమ శాఖామంత్రి బాలవీరాంజనేయస్వామిని సోమవారం ఉదయగిరి నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకుడు స్వర్ణ కొండయ్య మంత్రి స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో కలిశారు. ఈ సందర్భంగా గత టీడీపీ ప్రభుత్వంలో రాయితీపై ఎస్సీ, ఎస్టీ, ఎన్ఎస్ఎఫ్‌డీఎస్ కార్లు పొందిన లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రికి వివరించారు. ఈ సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఉప్పుటూరు సుధీర్‌బాబు, జీ రామ్మోహన్‌రావు, జీ రమేష్, ఎస్ రమేష్, రవి, లక్ష్మణ్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

టీడీపీలోకి చినలాటిరిపి గ్రామ సర్పంచి



ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరిన చినలాటిరిపి సర్పంచి శివపార్వతి తదితరులు

కందుకూరు, జూలై 29: గుడ్లూరు మండలం చినలాటిరిపి గ్రామ సర్పంచి మొగిలి శివపార్వతి సోమవారం టీడీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో ఆమె పార్టీలో చేరగా, ఆయన పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమెతో పాటు భర్త మొగిలి లక్ష్మీనారాయణ, ఉప్పలపల్లి యలమందారెడ్డి కూడా టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ అంటేనే అభివృద్ధికి చిరునామా అని, సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికోసం కక్షసాధింపులకు, వేధింపులకు ఆస్కారం ఇవ్వకుండా పాటుపడుతున్న తీరు చూసి పలువురు టీడీపీలో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిట్టేల యానాదయ్య, ముప్పా మల్లికార్జున, శోభన్‌బాబు, చిట్టేల వెంకటకృష్ణ, మూలే వెంకటేశ్వర్లు, ఎల్లంకి సుబ్బరాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడికి శిక్ష పడేలా చూస్తా : ఎమ్మెల్యే కావ్య

కావలి, జూలై 29: పట్టణంలోని వెంగళరావునగర్‌లో బాలికపై అత్యాచారం చేసిన నిందితుడికి చట్టప్రకారం శిక్షపడేలా చూస్తామని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. డీఎస్పీ ఎం. వెంకటరమణ, రెండో పట్టణ సీఐ శ్రీనివాసరావులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే కావ్య బాలిక నివాసానికి వెళ్లి వారి తల్లిదండ్రులను పరామర్శించారు. బాలికకు సత్వర న్యాయం జరిగేటట్లు చూస్తామని, కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. అక్కడకు వెళ్లిన పాత్రికేయులు కొందరు ఫొటోలు తీస్తుండగా, బాలిక ఇంటి పరిసరాలు ఫొటోలు తీయకూడదని నివారించారు.

● అత్యాచార ఘటనపై ఖండన

బాలికపై అత్యాచార ఘటనను దూదేకుల సంఘం రాష్ట్ర నాయకులు ఖండించారు. సోమవారం బాలిక నివాసానికి దూదేకుల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ మస్తానమ్మ, ప్రధాన కార్యదర్శి షేక్ సలీంలు స్థానిక నేతలతో కలిసి వెళ్లి తల్లిదండ్రులను పరామర్శించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి శిక్ష పడేవరకు తమ సంఘం తరుపున పోరాడుతామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు షేక్ హుస్సేన్ సాహెబ్, ఖలీల్, చిన్నా, రఫీ, దిల్షాద్, షాకీరా తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారుల నుంచి చెరువులను కాపాడాలి

కావలి, జూలై 29: ఆక్రమణదారుల చెర నుంచి ముసునూరు మందాటి చెరువు, బోగోలు మండలం కోపూరుపల్లి చెరువులను కాపాడాలని మందాటి చెరువు పరిరక్షణ సమితి నాయకుడు కసుమూరి భాస్కర్‌రెడ్డి, దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. సోమవారం వారు ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. అనంతరం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మందాటి చెరువు ప్రాంతంలో స్థానికేతరులు వచ్చి ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. ముసునూరు వాసులు కర్మక్రతులు చేసుకునే స్థలాన్ని సైతం ఆక్రమించారన్నారు. ఆక్రమణదారులపై అధికారులు చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో రమణయ్య, డీ జార్జి, బాబు, పీ. శ్రీనివాసులు, చెరు కూరు జనార్దన్. పీ. శ్రీనివాసులు పాల్గొన్నారు.

జంప్‌రోప్ పోటీల్లో కావలి విద్యార్థుల ప్రతిభ

కావలిటౌన్, జూలై 29: నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ పోటీల్లో కావలి మండలం కొత్తసత్రం జడ్పీ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు పతకాలు సాధించారు. సోమవారం విజేతలను పాఠశాలలో అభినందించారు. 12 ఏళ్ల విభాగంలో ఎల్లంగారి జ్యోతి, పామంజి సరిత ప్రథమ స్థానం, వాయిల శాలిని ఫ్రీస్టయిల్ విభాగంలో రెండవ స్థానం, అండర్ 14లో కల్పన రెండవ స్థానం సాధించారు. విజేతలను హెచ్ఎం శ్రీనివాసరావు, పీడీ మురళి, గ్రామ కాపులు అభినందించారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్ ప్రారంభం



భోజనం వడ్డిస్తున్న మధుబాబునాయుడు, సిద్దు తదితరులు

కావలిటౌన్, జూలై 29: జనసేన నాయకులు సిద్దు ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్‌ను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు పాల్గొని భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో రంగా యువసేన అధ్యక్షుడు దేవరకొండ శ్రీను, మధుసూదన్‌రెడ్డి, రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అధిక మొత్తాలు వసూలు చేస్తే రిజిస్ట్రేషన్ల రద్దు

కావలిటౌన్, జూలై 29: రోగుల నుంచి అధిక మొత్తాలు వసూలు చేస్తే ఆయా ల్యాబ్‌ల రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని క్రిష్టియన్‌పేటలోని ప్రైవేట్ ఆసుపత్రుల ల్యాబ్‌లు, స్కాన్ సెంటర్లను ఆమె తనిఖీలు చేశారు. రికార్డులు పరిశీలించి ఏపరీక్షకు ఎంత వసూలు చేయాలి... ఎంత వసూలు చేస్తున్నారు.. అని ఆరా తీశారు. కొన్ని ఆసుపత్రుల ల్యాబ్ నిర్వాహకులు, స్కాన్ సెంటర్ల నిర్వాహకులు అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయని తీరు మార్చుకోవాలని ఆమె హెచ్చరించారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం : మండలంలోని అన్నెబోయినపల్లి మన్నేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బందితో సోమవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో మన్నేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను గ్రామ శివారులో దాడి చేసి పట్టుకున్నారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని, డ్రైవర్లను అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. నలుగురు డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

వరిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

కలిగిరి : పంచాయతీ పరిధిలోని జిర్రావారిపాలెంలో సాగుచేస్తున్న కెఎన్ఎమ్-1638రకం వరిని సోమవారం వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వింజమూరు ఏడీఏ రామిరెడ్డి మాట్లాడుతూ వరిపైరులో సస్యరక్షణ చర్యలు తప్పనిసరని, కెఎన్ఎమ్-16 38 రకం వరికి ప్రస్తుతం నల్లితెగులు సోకిందని, దీంతో ఆకులు చివర్లో ఎండిపోతాయన్నారు. నివారణకు ఎకరానికి 400ఎంఎల్ ప్రొఫెనోఫాస్ లేదా 200ఎంఎల్ ఒబెరాన్ పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎం సురేష్‌బాబు, వీఏఏ సుజాత పాల్గొన్నారు.